

ఆదివాసీ వీరుడు

# కొమురంభీమ్

పిల్లల నవల

భూపాల్

ఆదివాసి వీరుడు

# కొమురం భీమ్

(పిల్లల నవల)

భూపాల్

వెన్నెల ప్రచురణలు

*KOMURAM BHEEM (Children's Navel)*
*by* Bhoopal

© *Author*

*Cover design & illustrations : Ale Laxman*

*₹ 50/-*

*Published by : Vennela Prachuranalu - 7*
*M. Sadguna,*
*2-2-985, Sahithi Sadan,*
*Amberpet, Hyderabad - 500 013. A.P.*
*Ph : 098662 04260*

*For copies : Navayuga, Disha, Prajashakthi, Shachara, Telugu Book House.*

*First Edition : Bala Saahithi - 1994*
*Second Edition : Hyderabad Book Trust - 2002*
*Third Edition : Hyderabad Book Trust - 2006*
*Fourth Edition : Vishalandhra Book House - 2009*
*Fifth Edition : Hyderabad Book Trust - 2010*
*Sixth Edition : Vishalandhra Book House - 2011*
*Seventh Edition : Vennela Prachuranalu - 2012*

*ప్రచురణ సంఖ్య : 7*

*ఏడవ ముద్రణ : జూలై, 2012*

*కొమురం భీమ్ (పిల్లల నవల)*

*బొమ్మలు : ఏలే లక్ష్మణ్*

*₹ 50/-*

*ప్రచురణ : వెన్నెల ప్రచురణలు,*
*ఎం. సద్గుణ, 2-2-985, సాహితీ సదన్, అంబర్‌పేట్, హైదరాబాద్ - 500 013.*
*ఫోన్ : 098662 04260*

*ప్రతులకు : నవయుగ, దిశ, ప్రజాశక్తి, సహచర, తెలుగు బుక్ హౌజ్*

ముద్రణ : చరిత ఇంప్రెషన్స్, హైదరాబాద్. ఫోన్ : 040-27678411

# చిన్నమాట

**("బాల సాహితి" వేసిన మొదటి ముద్రణ – ముందుమాట)**

ఒక ఊరిలో ఒక పిల్లవాడు ఉన్నాడు. ఆకలి తీర్చుకోవడానికి ఎంతో కష్టం చేశాడు. మన్ను మోశాడు; సాయంకాలం వరకు అతనికి ఒక రొట్టె కూలీ దొరికింది. అతను ఆ రొట్టె తినబోయాడు.

మరొకడు పని చేయడు. ఎప్పుడూ తింటూ కూర్చుంటాడు. వాడు ఆ పిల్లవాని చేతిలో ఉన్న రొట్టె గుంజుకున్నాడు. రేపటి కోసం దాచుకున్నాడు.

ఇప్పుడు ఆకలితో ఉన్న ఆ పిల్లవాడు, తన ఖర్మ అనుకోవాలా? లేక తన రొట్టె గుంజుకున్న వాడికి ఎదురు తిరిగి మళ్ళీ గుంజుకోవాలా? నాకు తెలుసు, మీరందరూ మళ్ళీ లాక్కోవాలి అంటారు. మరి, తిరిగి లాక్కునే బలం అతనికి లేదు కదా? అప్పుడేం చేయాలి? తనలాంటి మరో ఇద్దరినో, ముగ్గురినో కలుపుకోవాలి. తనది తాను బలవంతంగానైనా తీసుకోవాలి అంతే కదా!?

అదిగో అదే జరిగింది ఆదిలాబాద్ అడవుల్లో... కష్టజీవుల కష్టాన్ని అప్పటి నవాబులూ, షావుకార్లూ, ఫారెస్టు పోలీసులూ లాక్కునేవాళ్ళు. వాళ్లకు ఎదురు తిరిగారు అక్కడి గోండులు, కొలామ్‌లు, ఇంకా ఇతర గిరిజనులు.

అంతేకాదు; నీళ్లలో నుండి చేపలను తీసి ఒడ్డున పారేస్తే బతుకుతాయా? బతకవు కదా? అట్లే అడవి నుండి అడవిలో బతికే వాళ్లను తీసేస్తామంటే... వాళ్లు మనుషులు కనుక 'మేం అడవిని వదలం' అన్నారు.

ఇలాంటివి ఇంకా ఎన్నో కారణాలతో వాళ్లు బతుకు దెరువుకోసం తలలెత్తుకొని నిలబడ్డారు. అడవిలో ఆహారం కోసం పోరాటం చేశారు. అలా పోరాటం చేసిన గిరిజన, ఆదివాసీ వీరుడు కొమురం భీమ్, అతన్ని నైజాం పోలీసులు 1940లో దొంగచాటుగా కాల్చి చంపారు.

కొమురం భీమ్ బహుశ 1901లో పుట్టి ఉంటాడు. ఈ కథ ప్రారంభం నాటికి అతని వయస్సు 14 సంవత్సరాలు. 'కొమురం భీమ్' కథ ఇప్పుడు మీరు చదువుతున్నారు. ఇది రాయడానికి కొమురం భీమ్ నివసించిన అడవిలో నేను గమనించిన గోండుల జీవితం కొంత, విన్న విషయం మరికొంత ఉంది. అంతే కాదు, సాహు, అల్లం రాజయ్యలు రాసిన 'కొమురం భీమ్' నవల ఎంతో ఉపయోగపడింది. వారికి నా కృతజ్ఞతలు.

**– భూపాల్**

24.12.1993

పూర్వం 16వ శతాబ్దంలో బీజాపూర్ రాజ్యం ఉండేది. ఆ రాజ్యానికి రాజు అలీ అహమ్మద్‌షా. అతను తన తండ్రి తర్వాత ఇరవై రెండు సంవత్సరాలు రాజ్యమేలినాడు. ఇరవై మూడో ఏట ఎవరో శత్రువులు కుట్రపన్ని అతన్ని హత్య చేశారు. హత్య గావించబడిన నాటికి అతనికి తొమ్మిది ఏండ్ల కొడుకు ఉన్నాడు. అతని పేరు ఇబ్రహీం ఆదిల్‌షా.

అప్పట్లో రాజు కొడుకే మళ్లీ రాజు కావాలన్న నియమం ఉండేది. కానీ, తొమ్మిది ఏండ్ల పిల్లవాడు రాజ్యం ఏలడం కష్టం గదా!! ఐతే తండ్రి అలీ అహమ్మద్ షా కొలువులో ఆర్థికమంత్రి ఒకరున్నారు. అతను మహారాష్ట్ర బ్రాహ్మణుడు. ఆయన ఈ రాజ్యభారమంతా తన నెత్తిన వేసుకున్నాడు. ఇబ్రహీం ఆదిల్‌షా ఆ మంత్రి చేసిన మహా ఉపకారానికి ఎంతో సంతోషించాడట. అందుకు గాను ఇప్పటి ఆదిలాబాద్ ప్రాంతాన్ని అతనికి జాగీరుగా బహూకరించాడట. ఆ జాగీరు ప్రాంతానికి అప్పట్లో ఆ మంత్రి ఆదిల్‌షాబాద్ (ఆదిల్‌షా + ఆబాద్; ఆబాద్ అంటే 'పొందు పరిచింది' అని అర్థం) అనే నామకరణం చేసుకున్నాడట. ఆ పేరే కాలక్రమంలో ఆదిలాబాద్‌గా మారిందని చరిత్రకారులు చెపుతున్నారు.

అదిగో ఆ ఆదిలాబాద్ మహారాష్ట్ర దిగువన ఉంది. ఇది విశాలమైన జిల్లా. దీని వైశాల్యం 16.126 చదరపు కిలోమీటర్లు. ఈ జిల్లాలో ఉన్నన్ని నదులు మన రాష్ట్రంలో మరే జిల్లాలోనూ లేవు. ఎప్పుడూ గలగల పారే నదులే ఈ జిల్లాకి సరిహద్దు రేఖలై ఉన్నాయి.



దక్షిణంగా గోదావరినది, తూర్పున ప్రాణహిత ఉంది. ఉత్తర పడమర దిక్కుగా పెన్‌గంగ, వార్ధా నదులతో మహారాష్ట్రని ఆనుకొని ఉంది. ఈ జిల్లా విస్తీర్ణంలో నలభై శాతం అడవులే. ఆ అడవులు దక్షిణ భారత దేశానికి వాకిలి ముందలి పచ్చతోరణంలా, చూడముచ్చటగా ఉంటాయి.

ప్రకృతి సౌందర్యానికి వన్నె తెచ్చే అడవులు. అడవుల్లో వాగులు, వరదలు. వాటి పక్కనే ఆకాశమంత ఎదిగిన పెద్ద పెద్ద గిరులూ ఉన్నాయి. గిరుల పై నుండి జలా జల దూకే కుంటాలా, స్వర్ణా, సాత్నాలా, పొచ్చరా, గాయిత్రీ ఇలా ఎన్నో జలపాతాలు. ఆ జలపాతాల అంచుల్లో అందమైన రకరకాల రంగురంగుల పక్షులు కనిపిస్తాయి. వాటి కిలకిల మనే చప్పుళ్లు ఎప్పుడూ వినిపిస్తూ ఉంటాయి.

ఆ అడవుల కొండ గుహల్లో ఎన్నో పాతరాతి యుగపు పనిముట్లు దొరికాయి. పూర్వమెప్పుడో రాజ్య మేలిన గోండు రాజుల కోటల శిథిలాలు ఇప్పటికీ కనిపిస్తాయి.

మనుషులకి దూరంగా మసలే వన్యమృగాలు అడవుల గుహల్లో, కొండచరియల్లో, పొదల్లో, చెట్ల గుబురుల్లో దాగి ఉంటాయి. దాహం వేసినప్పుడు మెల్లగా బయటికి వస్తాయి. పచ్చి పాలవలె తెల్లగా పారే నీటి అంచుల్లో నిలబడి, నీళ్లు తాగుతాయి. మళ్లీ కనిపించీ కనిపించనట్లే కనుమరుగై పోతాయి.

అట్లాంటి అడవిలో ఒక గోండు గూడెం సంకెనపల్లి. చలికాలం రోజులు. రాత్రి సమయం. వెన్నెల విరబూసింది. వెన్నెల ఎంత పండుబారి వెలుగులు చిమ్ముతున్నా, చలిమాత్రం తన పద్ధతిలో తాను ఉంటుంది గదా!?... ఒంటిమీద గుడ్డలు సరిగా లేని గోండుల్ని అది వణికిస్తూంది. గుడిసెల ముందు చలి నెగళ్లు. నెగళ్ళ చుట్టూ కొందరు పడుకున్నారు. కొందరు కూర్చొని చేతుల చాచి కాపుకుంటున్నారు.

గూడెం మధ్యలో ఒక చలి నెగడు ముందు నలుగురు పిల్లలు కూర్చొని ఉన్నారు. రాత్రి బాగా పొద్దుపోయినా వాళ్ల 'తాత మోతీరాం గోండు ఇంకా రాలేదేమా!!' అని వాళ్లు ఎదురు చూస్తున్నారు.

ఎక్కడో దూరంగా ఏదో పక్షి క్యార్‌క్యార్ మని కూస్తోంది. మరోవైపు నుండి గుడ్లగూబ గుగ్గూగూ... గుగ్గూగూ పాట. మంటలో నుండి పైకి లేస్తున్న సన్నటి మిరుగులు. అందులో వేసిన పుల్లలు కాలుతూ చిటపట టపటప చప్పుళ్లు. అప్పుడే తాత వస్తున్న చేతికర్ర చప్పుడు. పిల్లలంతా అటు దిక్కు చూసారు. సంతోషంతో తాతకి నెగడు దగ్గర కూర్చొమని చోటు చూపారు. ఎండినడొక్క చర్మం వేలాడుతుంది.



తాత కళ్ళు గుంతలకి పోయి దీనంగా ఉన్నాయి. ఆ నలుగురు పిల్లల దిక్కూ చూశాడు. "తను అన్నా, తన కథలన్నా ఎంత ఇష్టం ఈ పిల్లలకూ!" అని మనసులో అనుకుంటూ... కర్ర సహాయంతో నిదానంగా కూర్చున్నాడు. వాళ్ల దిక్కు చూసి బోసినోటితో నవ్వాడు.

"తాతా! మనం ఈ అడివికి ఎట్లా రాజులమో! ఈ అడివి మనదెట్లా అయ్యిందో చెపుతానన్నావుగా! చెప్పుమరీ!" అన్నాడు చురుకు చూపుల ఓ అబ్బాయి. వాడు నెగడుకి కొంచెం దూరంగానే ఉన్నాడు. వానికి చలికన్నా కథ వినాలన్నదే పెద్ద ధ్యాసలా ఉంది.

తాత తల ఊపి అందరినీ గమనించాడు. ఒంటి మీద సరిగా గుడ్డలు లేని, వాళ్ల పెదమలు పగిలి ఉన్నాయి. ముఖాలు పీక్కుపోయి కనిపించారు. ఎవ్వరూ కనీసం సగం కడుపుకన్నా తిన్నవాళ్లలా లేరు. తాత నిట్టూర్చి కథ చెప్పడం ప్రారంభించాడు.

"మనం రాజులం భీమ్. మనమే అడివికి రాజులం. మనదే ఈ అడివంతా. అడివి కాని పల్లెల నుండీ, పట్నాల నుండీ షావుకార్లు, నవాబులు మన గూడాలకు రాకముందు మనమే రాజులం. అట్లాంటి రాజుల బతుకులకు ఇప్పుడు బూజు పట్టింది.

పూర్వం అంటే మా తాత తాత, ఆ తాత వాళ్ల తాత ఇట్లా వందమంది తాతలకు తాత భీముడు. భీముడంటే పంచపాండవుల్లో రెండోవాడు. అతను మహా బలవంతుడు. చిన్ననాడు ఆ భీమున్ని తల్లి కుంతి ఎత్తుకొని, ... ఒకసారి బట్టలుతుక లొద్దికి (వాగుకి) పోయింది. ఆమె ఒడిలో ఉన్న భీముడు జారిపోయి అక్కడున్న బండ మీద పడ్డాడు. బండ పట్టున పగిలి పోయింది. ఐనా భీమునికి ఏమీ కాలేదు. నవ్వుతున్నాడు. అంతటి బలవంతుడు మన భీముడు. ఆ భీముడు పెద్దగైనంక అడివిలో హిడింబి అనే స్త్రీని పెళ్లి చేసుకున్నాడు. హిడింబి కూడా తక్కువదేం కాదు. ఆమె పెద్ద పెద్ద రాళ్ళతో బంతులాడేది. భీముడు రెండు చేతులతో చెట్లను భూమిలో నుండి పెకిలించి పారేసేవాడు. ఆమె కూడా అతనితో పోటీగా చెట్లు పీకేసేది. నరికేసేది. పెద్ద పెద్ద రాళ్ళను చెట్ల పొరకతో ఊడ్చేది. నేలంతా మన్నం చేసేది. వాళ్లు అడివిలో ఇంకా పెద్ద చెట్లు నరికి, గుట్టలు పెకిలించి, రాళ్లను విసిరేసి, భూమి సాగు చేశారు. "రేరేరెలా! రెలా రెలా రెలా రేరేలా! రెలా!" అంటూ ఇట్లాంటి వెన్నెల రాత్రుల్లో పాటలు పాడుకున్నారు. వాళ్లను చలి కరిచేది కాదు. ఎండ మండించేది



కాదు. వాటిని వాళ్లు లెక్కచేసే వాళ్లే కాదు. అలా హాయిగా బతికి ఆడుతూ పాడుతూ పంటలు పండించారు."

తాత కథ చెపుతున్నాడు. మధ్యలో మాటతో, చూపులతో, చేతుల కదలికతో గొప్పగా నటిస్తూనే చెపుతున్నాడు.

"కొంత కాలానికి వాళ్లకు సంతానం కలిగింది. మొదటి కొడుకు భీమునంత గొప్పవాడు ఘటోత్కచుడు. అతని తర్వాత మరొకడు వాడూ అంతే బలాఢ్యుడు. పేరు గుర్తుకులేదు. వాళ్లిద్దరూ పుట్టి తండ్రితో సమానంగా కష్టం చేశారు. కొన్ని యేండ్ల తర్వాత ఏదో పనుండింది భీముడికి. అడివి విడిచి పాండవులను చేరవెళ్లిపోయాడు. ఘటోత్కచుడు, తన తమ్ముడూ కలిసి అడివిలో ఉన్న ఇతర రాజులతో యుద్ధాలు చేశారు. అడివంతా తమదేనని గొప్పరాజ్యం పొందుపరిచారు. ఆదివాసులందరికీ సరిపోను భూములు చూపించారు. సాగు చేసుకొని కడుపునిండా తినే ఏర్పాటు చేశారు. అదిగో ఆ ఘటోత్కచుని సంతానమే గోండులు. అతని తమ్ముని సంతానమే కొలామ్‌లు. వాళ్లదే అడివి. అడివికి రాజులూ వాళ్లే".

తాత కథ చెప్పడం పూర్తి చేశాడు. అప్పటికే ఇద్దరు పిల్లలు నిద్రలోకి జారుకున్నారు. కొమురం భీమ్ ఇంకా అతని పక్కనే కూర్చున్న జంగు మాత్రం వింటున్నారు.

"తాత! అంత గొప్ప వాళ్లం గదా! మరి మనకు తిండికే లేదు ఎందుకూ?" అడిగాడు కొమురం భీమ్.

"లేదంటే లేదు మరి. మనం చేసిన కష్టం మనకు మిగులుతుందా? పంట పొలాలు దున్నగానే కాదు గదా? పురుగులతోను, పక్షులతోను, పశువులతోను, అడివి జంతువులతోనూ కాపాడుకోవాలి. వీటన్నిటికన్నా ముఖ్యం షావుకార్లు, జంగ్లాత్ వాళ్లతోను కాపాడుకుంటే గదా! మన నోటికి ముద్ద దక్కేది" అని చెప్పి తాత నిద్రొస్తున్నట్టుగా ఆవులించాడు. అట్లే నేల మీద ఒరిగి నిద్ర పోయాడు.

కొమురం భీమ్ ఆలోచిస్తున్నాడు. వదిన తనకు నేర్పిన పాట జ్ఞాపకమొచ్చింది. "కూసేకూకు... కూకూ... కేడా మావయి కూకూ" మెల్లగా పాట పాడుకున్నాడు. జంగు కూడా నిద్రపోయాడు. భీమ్‌కి ఇంకా నిద్ర రాకుంది. చలి మరికాస్త ఎక్కువైంది.

కొమురం భీమ్ గోండు తెగవాడు. కొమురం ఇంటి పేరు. భీముడు అతని పేరు. ఆదిలాబాద్ అడవుల్లో నివసించే ఈ గిరిజనుల్లో ఎన్నో తెగలున్నాయి. గోండు, కొలామ్, పరదాన్, కోయ, అందాల్, చెంచు ఇంకా బిల్లులు. అందరూ రెక్కలు

వంచి పని చేస్తారు. చాలా కష్ట పడతారు. వ్యవసాయం ముఖ్యవృత్తి. ఇక్కడ మైదాన ప్రాంతంలో మాదిరిగా కాకుండ, పెద్ద పెద్ద కొండల మీద ఉంటారు. ఆ కొండల పై భాగాన వెడల్పుగా, సమతలంగా కొంత ప్రదేశముంటుంది. అక్కడ నివశిస్తారు. ఆ ప్రాంతాన్ని 'పటారు' అని పిలుస్తారు. పటారు మీది చెట్టూ చేమా నరుకుతారు. పొదలూ, చిన్న చిన్న గుదుమలూ తీసేసి కుప్పగా వేస్తారు. ఆ కుప్పల్ని కాల్చిన తర్వాత నాగలితో దున్ని వ్యవసాయం చేస్తారు. ఈ పద్ధతిని పోడు వ్యవసాయం అంటారు.

ఏటవాలుగా ఉన్న ఎత్తైన కొండల మీద నాగలీ, ఎడ్లూ నిలువలేవుగా! అట్లాంటి స్థలంలో ఇనుప సువ్విలాంటి దానితో రంధ్రాలు చేసి విత్తనాలు వేస్తారు. వర్షం పడితే అవి మొలుస్తాయి. ఈ విధంగా పండించే పద్ధతిని 'కూకీ' వ్యవసాయమంటారు.

ఆదిలాబాద్ అడవుల్లో ఈ రెండు పద్ధతులతో పంటలు పండిస్తారు. ఇక్కడ జొన్నలు, కందులు, నువ్వులు, పెసళ్లు, రాగుల పంట ముఖ్యం. పంటలు పండని రోజులూ ఉంటాయి. పండించిన పంట చేతికందని పరిస్థితీ ఉంటుంది. అలాంటి సమయాల్లో ఈ గిరిజనులు గునుగు గింజలు, వెదురు గింజలు ఉడకేసుకొని తింటారు. అవీ దొరకని మరీ కరువు రోజుల్లో ఏవేవో దుంపలు, ఆకూఅలమూ తింటూ ప్రాణం కాపాడుకుంటారు. ఇంకా, అడివిలో చలికాలంలో విప్ప చెట్ల కింద పువ్వు ఏరుకుంటారు. ఆ పువ్వుతో రొట్టెలు చేసుకుంటారు. సారా కాచుకుంటారు. విడిగా తిని ఆకలి తీర్చుకుంటారు.

కొమురం భీమ్‌కి ఆకలిగా ఉంది. సాయంకాలం తాగిన జొన్న అంబలి ఎప్పుడో అరిగిపోయింది. నెగడు దగ్గర ఆలోచిస్తూ కూర్చున్న భీమ్ లేచి గుడిసెలోకి వెళ్లాడు. ఓ మూలన పెద్దన్నా, వదిన నిద్రపోతున్నారు. గడపలో పడుకున్న తండ్రి దగ్గుతున్నాడు. కాలికి చాలా ఏండ్లుగా విషం పుండు ఉంది. అది బాధ పెడుతుంది. భరించలేక మూల్గుతున్నాడు. ఇట్లాంటి పుళ్లూ, నొప్పులు అక్కడి వాళ్లు మామూలే అనుకుంటారు.

భీమ్‌ని చూసిన తండ్రి "ఏంరా నిద్ర పోలేదా?" అన్నాడు.

భీమ్ "లేదు" అంటూ పొయ్యి దగ్గర కెళ్లి జొన్న గటక ఏమన్నా ఉందేమోనని అటికె తీసి చూశాడు. ఏమీలేదు. పక్కనే ఉన్న మరో పగిలిపోయిన కుండలోకి చూశాడు. అందులో ఎండబెట్టిన పంది మాంసం ముక్కలు కనిపించాయి. నాలుగు ముక్కలు తీసుకొని వచ్చాడు. వాటిని నెగడు నిప్పుల మీద కాల్చి తిన్నాడు. నిద్రపోయాడు.

చంద్రుడు పడమరకు తిరిగాడు. కోళ్లు కూస్తున్నాయి. వెన్నెల ఇంకా మెరిసిపోతోంది. కొమురం భీమ్ వదిన కుకూబాయి వచ్చి భీమ్‌ని నిద్ర లేపింది. ఆమె చేతిలో రెండు గంపలున్నాయి. అవి సన్నని వెదురు బద్దలతో అల్లినవి.

ఇద్దరూ విప్పపూలు ఏరడానికి అడివిలోకి బయలుదేరారు. భీమ్ కంకబొంగు దివిటీ పట్టుకున్నాడు. అది వెలుతురు కోసమే కాదు. అడివి జంతువులను భయపెట్టడానికి కూడా వాడతారు. విప్పపూలు రాలే రోజుల్లో ఎలుగుబంట్ల భయం ఆయా గూడాల ప్రజలం దరికీ ఉంటుంది. తెల్లవారుజామునే తరుచుగా ఎలుగుబంట్లూ పువ్వు బుక్కడానికి వస్తాయి. అందుకే జాగ్రత్తగా వెళతారు. వాటితో కొట్లాడైనా విప్ప పువ్వు ఏరుకొస్తారు.

"భీమ్ జాగ్రత్త! తెల్ల పాములుంటాయి" అంది కుకూబాయి.

"అవ్వినన్నేం చేస్తాయ్ వదినా?!" అన్నాడు భీమ్.

అలా ముందుకు నడిచి అడివిలో ఓ విప్ప చెట్టు కింద పువ్వు లేరుతున్నారు.

"వదినా నువ్వెప్పుడన్నా ఎలుగుబంటితో కొట్లాడినావా?" అడిగాడు అమాయకంగా.

కుకూబాయి నవ్వింది.

"నేను ఎలుగుబంటితో కొట్లాడడమా!? కొట్లాడగలనా! ఐనా అది నా మీదకి వస్తేగదా? ఐతే నేను కొట్లాట చూశాను".

"ఎప్పుడూ?!"

"నా చిన్నతనంలో మా తల్లిగారింటి దగ్గర జంగు దాదా అనే ఓ యువకుడుండేవాడు. అందరిలాగే అతనూ ఓ ఉదయం విప్పపూలకని అడివి కొచ్చాడు. అతను అందరికన్నా ముందు వెళ్లాడు. అక్కడ లొద్దికి తూర్పున పెద్ద విప్ప చెట్టు కింద పువ్వు లేరుతున్నాడు. అప్పుడు అమావాస్య చీకటి. నల్లగా ఉండే ఎలుగుబంటి చీకట్లో కనిపించలేదు. తీరా దగ్గర కెళ్లి చూసేసరికి అతనికి భయమేసింది. అప్పటికే అది తన గోర్లతో అతని వీపున గీరేసింది. జంగుదాదా ఇక చేసేది లేక ఎదురు తిరిగాడు. చేతనున్న కర్రతో దాన్ని నాలుగు వాయించాడు. అదీ ఇంకా కోపంతో అతని ఛాతీ మీద మరొక్కటి వేసి ఇక చంపేద్దామనుకుంది. దాని కోపం గమనించాడు జంగు దాదా. ఇంకా అక్కడ ఉండలేదు. పరిగెత్తాడు."

భీము పకపకా నవ్వసాగాడు.

"నవ్వకూ మొత్తం వినూ! అతను పరిగెత్తి దగ్గరలో ఉన్న ఓ చెట్టు మీదకు

ఎక్కాడు. ఐనా అది వదిలి పెట్టలేదు. ఆ చెట్టు దగ్గరకు వెళ్లింది. పైకి పాకే ప్రయత్నం చేయసాగింది. అది గమనించిన జంగుదాదా ఓ కొమ్మ మీదుగా పాకి కిందకి దూకాడు. చెట్టును పాకే ప్రయత్నం చేస్తున్న ఎలుగుబంటి ముందలి కాళ్లు రెండూ గట్టిగా పట్టుకున్నాడు. ఒక వైపు అది, మరో వైపు జంగు, నడుమ చెట్టు. ఇక చూడు భీమ్.... జంగుదాదా తన బలం కొద్దీ దాన్ని చెట్టుకేసి గుద్దీ గుద్దీ... అట్లే చంపేయాలనుకున్నాడు. కానీ అదీ బలంగానే ఉంది. ఎంతకూ చావలేదు. పెద్దగా అరిచింది. దాని నోట్లో నుండి రక్తం కారింది. అప్పటికే మా గూడేం వాళ్లు చాలా మంది వచ్చారు. దివిటీలు చేతుల్లో పట్టుకొని ఈ వింత చూడ సాగారు. కొందరు కర్రలతో దాన్ని కొట్టారు."

భీమ్‌కి ఇంకా ఓపిక లేక "చంపేశారా?" అని అడిగాడు.

"లేదు. బాగా అలసిపోయిన జంగుదాదా దాన్ని వదిలిపెట్టాడు. అది ఆరుస్తూ తన వాడియైన పండ్లతో అందర్నీ భయపెట్టింది. చీకటిగుట్ట దిక్కుగా ఒకటే పరుగుదీసింది. మళ్లీ ఆ ప్రాంతంలో అది కనిపించలేదు."

భీము ఆశ్చర్యంగా, వింతగా, కళ్లు పెద్దవి చేసి విన్నాడు. ఇకవాళ్లు ఆ చెట్టుకింద రాలిన పువ్వు ఏరుకున్నారు. గాలి చల్లగా వీస్తోంది. పక్షుల కలకలరవాలు, అవి పెట్టుకునే ముచ్చట్లు వినిపిస్తున్నాయి.

"వదినా! పెద్దన్నయ్య! ఇప్పుడు ఎలుగుబంటి వస్తే కొట్లాడుతాడా?"

"ఓ! ఎందుకు కొట్లాడడూ? నువ్వూ కొట్లాడగలవ్. ధైర్యముండాలిగానీ, వయసుతో పనేముందీ?" అంది కుకూబాయి.

వదిన మాటతో తను చాలా ధైర్యవంతున్ని అనుకున్నాడు భీమ్.

భీమ్‌కి వదిన కుకూబాయి అంటే చాలా ఇష్టం. ఆమె చెప్పే కథలంటే, పాడే పాటలంటే మరీ ఇష్టం. తాను తిన్న తినకున్నా ఏదో ఒకటి తెచ్చి భీమ్‌కి పెడుతుంది. ఆకలి తీరుస్తుంది. అడవిలోకి ఎప్పుడూ వెళ్లినా తనకు తోడు భీమ్‌ని తీసుకెళుతుంది. భీమ్ తను చేసే ప్రతి పనిలో ఆమె సలహా అడుగుతాడు. తన తండ్రికీ, మోతీరాం తాతకీ ఎన్ని కథలు తెలుసో అన్ని కథలూ వదినకు తెలుసు అనుకుంటాడు భీమ్.

అడివిలో నుండి గూడెం వచ్చే వరకు సూర్యోదయమైంది. తెచ్చిన పువ్వు అంతా వెదురు తడకలపై గుడిసె ముందే ఆరబోసారు.

* * *



ఫిరంగి చెట్టు మీద మంగల్ పిట్ట కొమ్మ ఉయ్యాలలూగుతోంది. పిట్టను నెట్టేయాలని గాలి ప్రయత్నం. పిట్ట ఎగిరి మళ్లీ అదే కొమ్మ మీద ఆకుల చాటుగా కూర్చుంది. ఆ పిట్టను అదే పనిగా చూస్తున్నాడు కొమురం భీమ్. అడివికి తన మిత్రులు జంగు, కొండల్, మాదు, పైకులతో కలసి వచ్చాడు. మాదు పది రోజులుగా



గూడెంలో లేడు. పొరుగూరు నుండి ఈ ఉదయమే వచ్చాడు. భీమ్ మేకల మందలో బట్టమేక రెండు పిల్లల్ని వేసింది. వాటిని మాదు ఉదయమే చూశాడు. ఎత్తుకున్నాడూ. ఇప్పుడు భీమ్ దగ్గరకొచ్చి "మేక ఎప్పుడు ఈనింది భీమ్?" అని అడిగాడు.

"వారం రోజుల కిందట. ఆ రోజు సాయంకాలం పెద్ద కథ జరిగింది నీకు తెలుసా?" అన్నాడు.

ఆ రోజు మేకలన్నీ గూడెం వెళ్ళిపోయాయి. అడివిలో బట్టమేక ఆయాసపడుతోంది. చుట్టూ చీకటి ముసురుతూంది. ఆ మేకతో తానొక్కడే మిగిలాడు. అంతలో తోడేలు వచ్చింది. గట్టిగా ఊళపెట్టి మిగతా తోడేళ్లను పిలవసాగింది. అప్పుడు తాను ఎంతో తెలివిగా దాన్ని తరిమేశాడు.

ఈ కథంతా ముందే విన్నారు జంగూ, కొండల్. అయినా మళ్లీ వింటున్నారు. పైకు దగ్గరలో ఉన్న నారేపచెట్టు ఎక్కాడు. ఒక కొమ్మ మీద కూర్చొని సన్న సన్న మండలు నరికి మేకలకు వేస్తున్నాడు.

"తొందరగా దిగిపో పైకూ రాక్షసులొస్తారు. చూశారంటే చాలా కష్టం" అన్నాడు జంగు.

ఏదో పాట పాడుతూ మండలు నరికేస్తున్న పైకుకి జంగు మాట చెవికెక్కనేలేదు. భీమ్ కథ ముగించనేలేదు. ఎవరో పరుగెత్తుకొస్తున్న చప్పుడు వినిపించింది. పైకు అంత ఎత్తు నుండి దిమ్మున దూకడం గమనించాడు భీమ్.

అంతలో ముగ్గురు జంగ్లాత్ జవాన్లు (వాచర్లు), ఒక సుంకరి పరిగెత్తుకొని వచ్చారు. రాగానే చెట్టు దూకి పారిపోను చూస్తున్న పైకును పట్టుకున్నారు. కర్రలతో కొడుతున్నారు. భీమ్, మిగతా మిత్రులు కళ్లు తేలవేశారు. పైకు ఏడుస్తున్నాడు. వచ్చిన జవాన్ల వెనకాలే ఇంకా ఇద్దరు జవాన్లూ, అమీన్‌సాబ్, చౌకిదార్ కూడా వచ్చారు.

"చెట్లు కొడుతున్నారా! ముండా కొడుకుల్లారా! ఈ అడివిని మీ అయ్యలు పెంచి పెద్ద చేశారనుకున్నారా!?" అని "అరే! అందరినీ పట్టుకొని బంగ్లా దగ్గరకి తీసుకు రండిరా!" అంటూ తన మనుషులకు చెప్పాడు అమీన్‌సాబ్.

బంగ్లా అంటే మేడకాదు అక్కడ. అదీ ఓ గుడిసే. ఇలాంటి అమీన్, చౌకీదార్, సెహరేదార్‌లు వస్తే, షావుకార్లూ, పోలీసులు వాళ్ళు ఉండేందుకు వేసిన గుడిసే. ఇక్కడ మన గ్రామాల్లో రచ్చబండ అంటారే అలాంటి ప్రదేశమని అర్థం.

అమీన్‌సాబ్ భయంకరంగా ఉన్నాడు. ఎర్రగా పెద్ద కనుగుడ్లు, కడవంత కడుపు, గుబురుమీసాలు, బలంగా, ఎత్తుగా ఉన్నాడు. చౌకీదారు ఆయనంత ఎత్తు లేకున్నా



పొట్ట మాత్రం ఉంది. అతను బండిలో వచ్చినా ఆయాసం ఇంకా తగ్గలేదు. దమ్ము ఎగపోస్తున్నాడు.

భీమ్ స్నేహితులనూ, మేకలనూ తీసుకొని రండని చెప్పి అమీన్‌సాబ్, చౌకీదార్ వెనక్కి తిరిగారు. గూడెం కేసి నడవసాగారు. సుంకరీ వాళ్ల వెంబడే వెళుతున్నాడు. మిగతా ముగ్గురు జవాన్లు మద్దిచెట్టుకింద ఆశ్చర్యంతో, భయంతో నిలుచున్న భీమ్ వాళ్ల దగ్గరకొచ్చారు.

జంగు ఆ వచ్చే జవాన్ల చేతికి అందకుండ పక్కకు పరిగెత్తాడు. జంగు తప్పించుకునే ప్రయత్నంలో ఉన్నాడని ఒక జవాన్ జంగు వెంటపడ్డాడు. జంగు ఒకటే పరుగు. అతని వెనకాల జవాన్ పరుగు. చెట్ల పక్క నుండి, చేల అంచు నుండి పరిగిడుతున్న జంగును ఎంతకూ వదలకున్నాడు జవాన్. జంగు ఒక బండ మీదుగా పరిగెత్తాడు. అతనూ వెంబడించాడు. ఆ బండ మీద కంది చేను కోసి కొట్టిన కందులు ఆరబోసి ఉన్నాయి. జంగు వాటి పక్క నుండి తెలివిగా వెళ్లిపోయాడు. జవాను మాత్రం కోపంతో కందుల మీద గుండా అడుగులేస్తూ పరిగెత్తాడు. అంతే అతని కాలు జారింది. పడిపోయాడు. అది బండ గదా! మూతి పగిలింది. కాళ్లకూ, చేతులకూ గాయలయ్యాయి. లేచి ఏడుస్తూ గూడెం దిక్కు నడవసాగాడు.

పైకుతో బాటుగా, మాదు, భీమ్, కొండల్నీ పట్టుకున్నారు జవాన్లు. కొంత దూరం నడిచారు. “ఆ పరిగెత్తి నోడు ఎవ్వని కొడుకురా? వాని పేరేమి?” అడిగారు.

భీమ్ ఒక్క నిముషం ఆలోచించి “వాడు ఎవ్వడో మాకు తెలియదు” అన్నాడు.

“తెలియకపోతే మీ దగ్గరెందుకున్నాడురా బద్మాష్?” అని కోపంతో భీమ్ నెత్తిన ఒక్కటి కొట్టాడు జవాను.

“ఎవరో తెలియదు. వాని ఆవు అడివిలో తప్పి పోయిందట. వెదుకుతూ వచ్చాడు. వాడిది ఏ గూడెమో మాకు తెలియదు.”

ఇంతలో ఏడుస్తూ వస్తున్న జవానుని చూశారు వాళ్లు. గాయాలు కనిపించాయి. ఆతృతతో ఏమైందని వాళ్లు అడిగితే... “వాడు... ఆ పరిగెత్తిన... గోండు నా కొడుకు నన్ను బండమీద నెట్టేసి పారిపోయాడు” అన్నాడు జవాను.

వీళ్లకు కోపం మరీ ఎక్కువైంది.

“చెప్పండిరా! వాడెవ్వడు. మమ్మల్నే కొట్టి పారిపోతాడు? వాడు మీ గూడెం వాడే అయ్యుండాలి. పేరు చెపుతారా? చెప్పరా?” అని కొండల్‌ని కొట్టాడు మరో జవాను. కొండల్ ఏడుస్తున్నాడు.

భీమ్ తడుముకోకుండా "వాడు తన పేరు అర్జు అన్నాడండీ" అన్నాడు.

వీళ్లు ఊళ్లోకి వెళ్లగానే అమీన్‌సాబ్, చౌకీదార్, బంగ్లా ముందు మంచాల మీద కూర్చొని ఉన్నారు. దూరంగా బండి ఇడిసి ఉంది. సుంకరి బండి వాడి దగ్గరే ఉన్నాడు. కొందరు గోండులు, కోలామ్‌లు నిలబడి ఉన్నారు. అందరినీ చూసి ముందు ఆ గాయపడ్డ జవాన్‌ని ఏమైందని అడిగాడు అమీన్‌సాబ్. అతను క్రితం చెప్పిందే మళ్లీ చెప్పాడు. భీమ్‌నీ, కొండల్, మాదులనూ పైకూతో బాటుగా కట్టేశారు. మేకల్ని కొట్టుకొచ్చారు.

అమీన్‌సాబ్ మీసం తిప్పి బుసకొడుతూ "అరేయ్! ఈ గూడెంలో అర్జు అనే కుర్రవాడి తండ్రి ఎవ్వడో ముందుగా ఇటు రావాలి!" అన్నాడు గట్టిగా.

అర్జు తండ్రి వచ్చి చేతులు జోడించుకొని నిలబడ్డాడు. ఎందుకు తనను పిలుస్తున్నారో అతనికే తెలియదు.

"వరే నీ కొడుకు ఎక్కడరా?"

"ఇక్కడే ఎటో ఆడుకుంటున్నాడు దొరా!"

"ఆ! ఏడీ ఎక్కడ వాడూ?"

కొందరు పిల్లలు వాన్ని పట్టుకొచ్చారు. వాడు రెండు సంవత్సరాల వయస్సున్న అర్జు. వాడి ఒంటి మీద గుడ్డలు లేవు. రోగమున్న బాన కడుపు కాళ్లూ, చేతులు సన్నగా ఉన్నాయి. కాళ్లకు పుండ్లు. ఈగలు వాలుతున్నాయి. ముక్కు కారుతోంది. నోట్లో నుండి సొంగ కారుతూంది.

వాన్ని చూసి అమీన్ "ఛీ... వీడా?" అన్నాడు.

"రాం... రాం... అమీన్‌సాబ్ మా గూడెంలో వీడే అర్జు" అంటూ అప్పుడే అక్కడికొచ్చాడు గూడెం పెద్ద కొమురం చిన్ను.

కొమురం చిన్ను భీమ్ తండ్రి. కాలుకి ఉన్న విషం పుండు సొనకారుతున్నది. బాధ పడుతున్నాడు. చౌకీదార్‌కి 'రాం రాం' చెప్పాడు.

"ఐతే వాడు ఈ గూడెం వాడు కాదన్నమాట. సరే వాని సంగతి చూస్తాం... ఓరే! చిన్నూ! ఈ పిల్లలు అడవంతా నరికేస్తున్నారు. అడివిలో ఆకు తెంపొద్దని వందసార్లు చెప్పిన. చౌకీదార్‌నీ, సారెదార్‌నీ పంపించి నీకు చెప్పుమన్నా. ఈ రోజు నేనే వచ్చిన. ఏముందీ అడివంతా నరికేస్తున్నారు. నా కళ్లారా చూసిన... అడివి నరికితే శిక్ష ఏందో మీకు తెలుసా?" కోపంలో అడిగాడు అమీన్‌సాబ్ అందర్నీ చూస్తూ.

అప్పటికే గూడెంలో ఉన్న వాళ్లందరూ వచ్చి భయం భయంగా నిలుచున్నారు. పైకు ఏడుస్తున్నాడు.

"అయ్యా! పిల్లలు తెలియక తప్పు చేశారు. మేమెందుకు అడివంతా నరికేస్తం? పిల్లలు మేకలకని ఓ కొమ్మ నరికారేమో! క్షమించండి" చిన్ను బతిమాలుతూ అన్నాడు.

అంతవరకూ మౌనంగా వీన్న చౌకీదార్ "ఒరే! చూస్తారేం రా! మళ్లీవాడు కొమ్మ నరకకుండ వాని వేళ్లు నరకండి" అన్నాడు జవాన్లతో.

అమీన్‌సాబ్ నవ్వాడు. పైకూ తండ్రీ, తల్లీ ఏడుస్తూ చౌకీదార్, అమీన్‌సాబ్ కాళ్ల మీద పడ్డారు. కొమురం చిన్ను "వద్దు సార్ మొదటి తప్పుగా వదిలేయండి!" అని బతిమాలాడు.

"వాడు ఇక కష్టానికి కూడా నోచుకోడు. ఏం తిని బతుకుతాడు? ఈ ఒక్కసారి క్షమించండి. పిల్లవాడు. వాన్ని నాలుగు తన్ని వదిలేయండి" అంటూ గూడెంలోని కొందరు వాళ్ల కాళ్లు పట్టుకొని ప్రాధేయపడ్డారు. పిల్లలంతా గొల్లున ఏడ్చారు. పైకూ గింజుకుంటున్నాడు. వాన్ని గట్టిగా పట్టుకున్నారు. అమీన్‌సాబ్ 'కానీయండి' అని



ఆజ్ఞ ఇచ్చాడు. జవాన్లు అక్కడ పక్కనే ఉన్న టేకు మొద్ద మీద పైకూ కుడిచెయ్యి ఉంచారు. పైకూ వద్దని గింజుకున్నా, గొల్లున ఏడుస్తున్నా, అందర్నీ నెట్టేస్తున్నా వినక వేళ్లు నరికేశారు. అడివంతా వణికేలా ఏడ్చాడు పైకూ; స్పృహ తప్పి పడిపోయాడు.

భీమ్‌నీ, మదూ, కొండల్‌ని కొట్టి వదిలేశారు.

తర్వాత చౌకీదార్ ఎవరెవరు ఏఏ పట్టీ కట్టాలో చిట్టా చదివాడు. పట్టీ బాకీ చెల్లించండనీ అన్నాడు. పట్టీలు కట్టకపోతే కొట్టి చంపేస్తామనీ, ఇక్కడ ఉండనీయమని గూడెం తగుల పెట్టేస్తామనీ బెదిరించాడు అమీన్ సాబ్. కొందరు ధాన్యం తెచ్చి ఇచ్చారు. ఇవ్వని వాళ్ల గుడిసెల్లోకి వెళ్లి అంతా వెదికారు. కుండలు పగులకొట్టారు. దొరికిన ధాన్యం మూటలు కట్టి బండిలో వేసుకున్నారు. నాలుగు మేకల్ని బండికి వెనకాల కట్టుకున్నారు. పది కోళ్లను తీసుకున్నారు. ఇక గూడెం విడిచి బయలుదేరారు. బండిమీద మధ్యలో మెత్తటి గడ్డి ఉంది. అక్కడ అమీన్‌సాబ్ కూర్చున్నాడు! వెనక వైపు చౌకీదార్ మామూలుగా కూర్చున్నాడు. సుంకరి ముందు నడుస్తున్నాడు. జవాన్లు బండి వెనక నడుస్తున్నారు.

గూడమెంతా ఊడ్చేసినట్టుగా ఉంది. బాధతో మూల్గింది. భీమ్, పైకూ దగ్గర కూర్చొని ఏడుస్తున్నాడు. జనమంతా ఆ వెళుతున్న జంగ్లాత్ వాళ్ల దిక్కు కోపంతో చూస్తున్నారు.

వీళ్లకు ఎందుకింత పగ? మేము ఏం తప్పు చేస్తున్నాం? అడివి వీళ్ల సొంతమా? అడివికి ఆ సర్కారు ఎవరు? అడివి సర్కారుదే ఎందుకైంది? ఆకు తెంపితే. కొమ్మ నరికితే ఇలా చేతులు నరకడం ఏంది? భీమ్‌కి అన్నీ ప్రశ్నలే!

పట్టీ అంటే పన్ను. పట్టీలు కట్టమంటారు. జంగ్లాత్ వాళ్లు. ఎందుకు కట్టాలి? ఎంతని కట్టాలి? మేకపట్టి, ఆవుకిపట్టి, ఎద్దుకిపట్టి; నాగలిపట్టి, మంచెపట్టీ కట్టాలట! గడ్డికి పన్ను, భూమికి పన్ను, గుడిసెకు పన్ను, ఎందుకీ పన్నులు? పన్నులన్నీ కట్టి ఏం తినాలి? చేసిన కష్టమంతా పన్నుల కింద వీళ్లు లాక్కొనిపోతే ఆకలితో చనిపోవలసిందేనా? కఱ్ఱదుంగలా అలా పడిపోయి ఆలోచిస్తున్నాడు భీమ్.

ఇంతలో ఏవో అరుపులు. హాహాకారాలు వినిపించాయి. అదీ గూడెం పొలిమేరలోనే. బండి వెళ్లిన బాట వైపే. గూడెం వాళ్లందరూ అటు దిక్కు చూశారు. బండి కనిపించడం లేదు. ఇద్దరు ముగ్గురు యువకులు అటు దిక్కు వెళ్లి చూశారు. చిన్ను వాళ్లను వెళ్ళొదన్నారు. "ఎడ్లు బెదిరినాయి. బహుశ, కొండరాళ్లలో లాగడం

కష్టం కదా!" అన్నాడు మోతీరాం తాత.

కుక్కలు మొరుగుతున్నాయి. కూకీ పిట్టగొంతులో బాధతో కూత. తల్లుల్నీ పట్టుకొని వెళ్ళడం చూసిన చిన్ని మేకపిల్లల 'మేమే' అనే అరుపులు. చీకటి పడేవరకూ ఏ ధ్యాసాలేక అట్లాగే కూర్చుండిపోయాడు భీమ్.

"వదినా ఆ చౌకీదార్‌నీ, అమీన్‌గాన్నీ ఇద్దర్నీ నరికేస్తాను" పండ్లు కొరుకుతూ అన్నాడు భీమ్.

"భీమ్ మనం వాళ్లను నరికే రోజులొస్తాయి. ఇంకా మన గూడెం పెద్దలకు బుద్ధులు రాలేదు. నువ్వు బాధపడకు. పెద్దగయినంక వాళ్ల పని చేద్దువుగానీ..." అంది.

"వదినా ఈ నీళ్లు మనవి, ఈ గాలి మనది, ఎండ మనది, ఆకాశం మనది, వర్షం మనది. మరి ఈ అడవి మనదెందుకు గాదూ?... అడివీ, భూమీ వాళ్లదెట్లా అయ్యింది?"

"ఈ ప్రశ్నలన్నీ మన గోండులందరికీ వస్తే బాగుండు భీమ్. మీ నాయిన నడుగు నీకు సమాధానం దొరుకుతుంది..."

కుండ నెత్తిన పెట్టుకుంది వదిన. భీమ్ లొద్దికి అవతలి దిక్కు చూసి "అరే! జంగూ" అన్నాడు – ఆశ్చర్యంగా.

జంగు పరిగెత్తుకొని వచ్చాడు. నవ్వుతున్నాడు. సంతోషంగా ఉన్నాడు.

"పైకూ వేళ్లు నరికారు వాళ్లు. వాడు చచ్చిపోతాడిక" భీమ్ ఏడుస్తూ చెప్పాడు.

జంగూకీ ఏడుపొచ్చింది. "పైకూ లేవలేడా? వదినా! చచ్చిపోతాడా?" అడిగాడు.

"పైకూ ఏం చావడు. కానీ, ఏ పనీ కుడిచేతితో చేయలేడు" అంది.

"వాళ్లకూ... అదే ఆ ఆమీన్‌గాడికి, చౌకీదార్ గాడికీ బలేగా బుద్ధి చెప్పాను. బండి కింద పడేశాను. బాగా దెబ్బలు తాకినయ్!"

"ఎట్లా? ఏం చేసినవ్?" సంతోషంతో అడిగాడు భీమ్.

"వాడు ఆ జవాను బండమీద పడిపోయాడుగా. ఇక అక్కడి నుండి అడివి లోపలనే ఉన్నాను. పైకూ ఏడుపు బాగా వినిపించింది. తర్వాత మీరందరూ ఏడ్చారు. నేను భయపడి ఇంకా లోపలికెళ్లాను. పైకూని ఏమైనా చేసి ఉంటారని... గూడ్దేలుగు పొద గుట్ట నుండి మెల్లగా నడిచాను. జంగ్లాత్ వాళ్ల బండి తిరిగి వెళ్లే దారి పక్కనే దూరంగా దాగి ఉన్నాను. బండచాటుగా ఉంది. బండి ఈ లొద్ది దాటింది. కొండ దిగుతుంది. నెమిలి చెట్టు, నక్కెర్త చెట్టు మలుపు దగ్గర బాట బాగలేదు గదా! అదిగో



అక్కడ గురిచూసి ఎడమవైపున్న ఎద్దు ముఖమ్మీదికి రాయి విసిరాను. రాయి పటేల్ని తాకింది. ఎద్దు ఒక్కసారే బెదిరి పక్క గుంతలోకి బండిని ఈడ్చింది. బండి పడిపోయింది. అమీన్‌కి, చౌకీదార్‌కి దెబ్బలు తగిలాయి. ఎడ్లకు ఏమీ అయినట్టు లేదు. నేను మెల్లగా ఒంపులో నుండి చెట్ల చాటుగా, గుండ్ల చాటుగా దాగి, ఎవ్వనికి కనిపించకుండ తప్పించుకున్నాను. జవాన్లు రాయి విసిరింది ఎవ్వరా అని వెదికారు. నేను చూశా. కాని వాళ్లు నన్ను చూడలేదు. ఆ తర్వాత చాలా సేపటికి లేచి మెల్లగా వెళ్లిపోయారు."

భీమ్ సంతోషంతో "బలే పని చేశావ్. మంచి బుద్ధి చెప్పావ్" అన్నాడు.

"జంగూ వాళ్లు నిన్ను నిజంగా చూడలేదా?" అడిగింది కుకూబాయి.

"నిజం వదినా చూడలేదు"

"బతికిపోయాం. నడవండి చీకటి పడుతూంది" అంటూ ముందుకు నడిచింది నవ్వుకుంటూ.

ఆమె వెనకాలే భీమ్, జంగూ నడిచారు.

* * *


భీమ్ తల్లి ఎప్పుడూ  పొలంలో పనిచేస్తూనే ఉంటుంది. ఆమెకు మరో ధ్యాసే ఉండదు. తండ్రి గూడెం పెద్దయినా ఏదో ఒక పని చేస్తూనే ఉంటాడు. సోము, బొజ్జు ఇద్దరూ కొమురం భీమ్ అన్నలు. సోము పెద్దవాడు నాగలి పట్టి దున్నుతుంటాడు. బొజ్జు,  భీము అన్నకు తోడుగా ఆవుల్ని, మేకల్ని మేపుతుంటారు. పంట చేల కావలుంటారు. ఇంటి పనులు చూస్తారు. కాలాన్ని బట్టి పనులు చేస్తుంటారు.

భీమ్ తండ్రి కొమురం చిన్నుకి ఇద్దరు తమ్ములున్నారు. కొమురం కుర్దు ఒకడైతే, కొమురం యస్వంతు మరొకడు.

యస్వంతుని అందరూ 'యేసూ' అని పిలుస్తారు. అన్న చిన్నుతో బాటుగా వాళ్లూ వ్యవసాయం చేస్తూ అదే గూడెంలో ఉన్నారు. ఆ గూడెం ఎప్పుడు ఏర్పరిచారో వాళ్లకు తెలియదు.

కొమురం కుర్దుకి ఐదుగురు కొడుకులు. అందులో ఇద్దరు సుద్దు, జంగు భీమ్‌కన్నా పెద్దవాళ్లు. రఘు, సోము ఇంచుమించు భీమ్ వయసు వాళ్లే. ఐతే బాదు చిన్నవాడు. అట్లే కొమురం యేసుకి ముగ్గురు కొడుకులు. లచ్చు, రాము, రాజు. భీమ్‌తో బాటు ఆడుకునే వాళ్లు రాము, రాజు.

ఒక రోజు ఉదయం జొన్న అంబలి తాగి గుడిసె బయట నిల్చున్నాడు భీమ్.



చిన్నాయన కొడుకు ఏడు సంవత్సరాల వయసున్న రాజు వచ్చి భీమ్ దగ్గర నిలుచున్నాడు. చేతిలో పురికొసలున్నాయి. ఒంటి మీద గుడ్డలు లేవు. భీమ్ వాడిని "ఏం కావాలని" అడిగాడు.

"అన్నయ్యా నాకు ఒడిసెల పేనీయవా!" అంటూ పురికొసలు చేతికొచ్చాడు రాజు.

"రా... మంచె మీద కూర్చొని పేనిస్తా" ఇద్దరూ జొన్నచేలో ఉన్న మంచె దగ్గరికి వెళ్లారు.

భీమ్ మంచె మీద కూర్చొని మంచి ఒడిసెల పేనిచ్చాడు. అందులో చిన్నరాయి ఎలా పెట్టాలి! ఎలా కొట్టాలో చూపిస్తూ నిలబడి ఒడిసెల తిప్పుతున్నాడు. అతనికి దూరంగా కొందరు తెల్లబట్టల వాళ్లు గూడెం దిక్కురావడం కనిపించింది. వాళ్ల వెనకాలే బండి కూడా ఉంది. అప్పుడు సోము జొన్న చేలో బలసి ఉన్న కలుపు గునుగు చెట్లను పీకేస్తున్నాడు.

"అన్నయ్యా అదిగో ఎవరో వస్తున్నారు" అన్నాడు భీమ్.

సోము అటు దిక్కు చూసి "ఇంకెవరూ షావుకార్లు" అన్నాడు.

భీమ్ తల్లి "షావుకార్లా! ఏముందని కొలుస్తార్రా వాళ్లకూ?" అంది ఆమె చూపు మందగించింది. ఐనా అటు దిక్కుగా చూసింది. మసకగా బండి కనిపించింది. తన చిన్నతనంలో ఈ షావుకార్లు కాలినడకన వచ్చేవాళ్లు. నెత్తిన గంపలుండేవి అనుకుంది. బుడుమ పాదుల తీగెలకు కాయలేమన్నా దొరుకుతాయేమోనని మళ్లీ చేలో వంగింది. కానీ చిన్ననాటి రోజులు జ్ఞాపకమొచ్చి కాయలు తెంపబుద్ధి కాలేదు.

అప్పుడు, ఆమె చిన్నవాడు షావుకార్ల మాయ మాటలు నమ్మేవాళ్లు గోండులు, కొలామ్‌లు. ఏ వస్తువైనా అడిగితే ధర తెలియకే ఇచ్చేవాళ్లు. ఇప్పుడూ ఇస్తూనే ఉన్నారు. వీళ్లకు లెక్కలురావు. చదువులు లేవు. నక్కజిత్తులు తెలియవు. వాడు షావుకారు గంపలో కొన్ని బెల్లం ముక్కలు, కొంత ఉప్పు, కొన్ని పిప్పరమెట్లు, సిగరెట్లు, ఇంకా కొన్ని బిస్కట్లు తెచ్చేవాడు. బియ్యం మురుకులు, ఏవో తూటు గారెలు కూడా ఉండేవి. చారెడు ఉప్పు గిరిజనులకిచ్చి కుండెడు కందులు తీసుకునేవాడు. (కుండేడు అంటే సుమారు ఇరవై రెండు కిలోలు). ఓ బెల్లం ముక్క చేతిలో పెట్టి అడ్డెడు (సుమారు రెండున్నర కిలోలు) నువ్వులు కావాలనేవాళ్లు. ఒక సిగరెట్టో, ఒక పొగాకు కాడో ఇచ్చి, బుడ్డెడు (కుండలో సగం) తేనె తీసుకునేవాళ్లు. అప్పట్లో షావుకారులు ఇచ్చే వస్తువు ఎంత ధరదో ఈ కొండవాళ్లకు తెలియదు. వీళ్లు ఇచ్చే వస్తువుల విలువ

ఎంతో వీళ్లకే తెలియదు. ఇలా దోచుకున్న షావుకార్లు ఈ కొండల్లోకి మెల్లగా బట్టలూ, చెప్పులూ, దువ్వెనలూ, పౌడర్లు తేవడం మొదలుపెట్టారు. వస్తువుల్ని డబ్బులిచ్చి కొనే పద్ధతి అలవాటు చేశారు. ఆ తర్వాత ఏ ఆపద, అవసరం వచ్చినా డబ్బులిచ్చేవారు. పంట కోతల సమయంలో వడ్డీతో తీసుకునేవాళ్లు. వీళ్లకు లెక్కలు అర్థమయ్యేవి కావు.

ఆ లెక్కలు ఇప్పటికీ అర్థం కావు. జొన్నలు, కందులు, నువ్వులు, తేనె, విప్పపువ్వు మాత్రమే కాదు అడవిలో లభించే సకల సంపద షావుకార్లతో కొల్లగొట్టబడుతుంది. అప్పులిచ్చి భూములు తాకట్టుపెట్టుకున్న షావుకార్లు గోండులను, కొలామ్‌లను దోచి జనగామ (ఆసిఫాబాద్)లో మేడలూ, మిద్దెలూ కట్టారు.

కొమురం భీమ్ తల్లికి ఈ విషయాలన్నీ తెలుసు. భీమ్‌కి తెలియవు. ఎవరన్నా చెబితే వింటాడు. కానీ, ఎందుకు ఇలా తీసికెళుతున్నారో సరిగా అర్థం కాదు.

ఎన్నో గూడాలు తిరుగుతూ సంకెలపెల్లికొచ్చాడు షావుకారు. అతనితో ఇంకా కొంత మంది ఉన్నారు. ఈ గూడెం పటేలు చిన్నుని పిలిపించాడు. గూడెంలో ప్రతి గుడిసే అతనికి బాకీ పడి ఉన్నదే. ప్రతి పంటలో ఎక్కువ భాగం అతనికి పోవలసిందే. షావుకారు గూడెం రావడంతోనే నవ్వుతూ అందర్నీ పేరు పేరున పలకరిస్తాడు. తన వద్ద ఉన్న ఖాతా పుస్తకం తీసి చదువురాని వాళ్ల ముందు పరుస్తాడు. "ఇదిగో చూడండీ" అంటూ ఏదో చూపిస్తూ లెక్కలూ అంటాడు. వేలి ముద్రలు ఎవరెవరివో చెపుతాడు. అమాయకులైన వాళ్లు నిజమే కాబోలు అనుకుంటారు. వడ్డీకి వడ్డీ కట్టి పది రూపాయల అప్పుని వంద రూపాయలు చేసి అది అంతే అంటాడు. ఐనా చావు బతుకుల అడివి జీవులు అప్పు చెల్లించడం మా ధర్మమనే అనుకొని పంట కొలుస్తారు.

ఎవరన్నా ఒకరో ఇద్దరో అప్పు తీర్చివుంటే. షావుకారు పద్దు పుస్తకంలో అప్పు తీర్చారని రాశానంటూ... ఐదు రూపాయలు ఆ గోండు పేర అలా బాకీ ఉంచేస్తాడు. ఎందుకంటే మళ్లీ రేపు అప్పు కావలసి వస్తే పద్దు మళ్లీ రాయడమెందుకనీ అంటాడు. అంతే కాదు "మళ్లీ పూచీకత్తుగా ఎవరుంటారూ? అలా ఉండనీ" అని చెపుతాడు. చెప్పి, మరో రెండు సంవత్సరాల తర్వాత పాతబాకీ అప్పటి ఐదు రూపాయలు మళ్లీ అప్పు కింద చూపించి వంద వసూలు చేస్తాడు. ఇలా అన్ని గూడాలకెళ్లే షావుకార్లు గోండుల్ని మోసగించడం పరిపాటి.

గూడెంలో కొచ్చిన షావుకారు పేరు పేరున గోండుల్ని పిలిచాడు. అప్పు అడిగాడు. ఇంకా అప్పు తీరలేదా అని కొందరు బాధ పడ్డారు. పంటలు సరిగా

లేవు. తిండికే కరువున్న రోజులు. అప్పు తీర్చడం ఎలాగో తెలవదు. కొండంత బరువుగా తోచి చాలా బాధపడ్డారు కొందరు.

అందుకు షావుకారు కోపంతో "నేను తెచ్చిన చోట ఏమని చెప్పుకోవాలి? నా షావుకారు ఊరుకుంటాడా? మీరు మాట తప్పని గోండులేనా ఇలా పలుకుతున్నారు. మీ తాతలు తండ్రులు ధర్మనీతి పరులుగాదా? మీరు ధర్మం తప్పుతున్నారు. బాధ్యత మర్చిపోతున్నారు. మీ పెద్దల పేర్లు చెడగొడుతున్నారు. ఒకరికీ బాకీ పడి ఉండి చనిపోతే ఆ దేవుడు మిమ్మల్ని క్షమిస్తాడా?" అంటూ నీతులు పలికాడు.

కొమురం చిన్నుని బంగ్లా ముందుకి పిలిపించాడు. అప్పటికప్పుడే అప్పు తీర్చవలసిందిగా నీలదీశాడు షావుకారు. చిన్ను గ్రామ పటేల్. తలవంచుకొని ఈ సారి పంట పండలేదని జవాబు చెప్పాడు. అందుకు షావుకారు అంగీకరించలేదు. వారం రోజుల గడువు పెట్టాడు. వసూలైన సరుకులు బండిలో సర్దుకొని వెళ్లిపోయాడు.

'భూములు తాకట్టులో పడి ఉన్నాయి. షావుకారు కోర్టులో దావా వేస్తే జనగామ వరకూ తిరగలేం. కోర్టుకి వెళ్లకుంటే పోలీసులు వస్తారు. తన్ని ఈడ్చుకెళతారు. ఇక ఏం చేద్దామా' అని రైతులందరూ ఏమీ తోచక కుమిలిపోతున్నారు.

చిన్ను వారం రోజులు ఆలోచన చేసి చివరకి సోముని పిలిచాడు. ఆవునూ, మేకలనూ జనగామ అంగడికి పంపించాడు. సోము జనగామలో వాటిలో అమ్మి షావుకారు అప్పు కొంత తీర్చాడు.

ఉదయం మేకల్నీ, ఆవునీ అమ్మడానికి కొట్టుకొనిపోతుంటే భీమ్ చాలా బాధ పడ్డాడు. అవి వెళుతుంటే వాటికి ఎదురుగా ఉండలేదు. అలా దూరంగా వెళ్లి జొన్న చేని మలుపులో నిలబడ్డాడు. భీము చిన్నాన్న కుర్దు చివరి కొడుకు బాదు ఆడుకుంటున్నాడు. వాడు విసిరేసిన సొరకాయ బుర్ర దగ్గరలో వచ్చి పడింది. అటుగా చూశాడు భీమ్. ఆ బుర్ర పడ్డ చోటికి పరిగెత్తు కొస్తున్నాడు బాదు. వాడు వస్తున్న దారికి ఎదురుగా పిల్లబాట పక్కనుండే అదే సమయంలో ఓ పాము వెళుతూంది. బాదు ఏ మాత్రం అటుగా కాలు వేసినా అది అతన్ని కరిచేది ఖాయం. అప్పటికే అడుగుల చప్పుడు విన్నది. బుస్సుమంటూ పడగ విప్పి సగం వరకూ పైకి లేచింది. ఇంక ఒక్క క్షణం ఆలస్యం చేసినా కాటేస్తుంది. ఆ స్థితిలో పాము వెనుక దిక్కున్న భీమ్ దాని తోక పట్టుకొని గిరగిరా తిప్పి చేనిలోకి విసిరి పారేశాడు. బాదు భయంతో కనుగుడ్లు పెద్దవి చేసి నిలబడ్డవాడల్లా పరిగెత్తుకొచ్చి భీమ్ కాళ్లు చుట్టేశాడు. పిల్లలంటే కొమురం భీమ్‌కి ఎంతో ఇష్టం.

ఒక రోజు ఏదో పండుగ. కోళ్లను కోసుకున్నారు. గూడెమంతా సంతోషంగా ఉంది. సూర్యుడు గూటిలో పడ్డాడో లేదో పిల్లలూ పెద్దలంతా ఉత్సాహంగా నృత్యం చేయసాగారు. కొమురం భీమ్ తమ్ములు రఘు, సోము, బాదు, రాము, రాజు ఇంకా అన్న జంగు, మిత్రులు కొండల్, పైకూ, మాదూ ఉన్నారు. వీళ్లు వేషాలు వేసుకున్నారు. గుస్సాడీ నృత్యం ఎంతో ఉత్సాహంగా ఆడారు. గిరిజనుల్లో సాంప్రదాయంగా వస్తున్న ఈ నృత్యాల్లో భీమ్‌కి దండాసి నృత్యమంటే చాలా ఇష్టం. అందరూ గుడిసెల్లోకి వెళ్లి పండుగ విందు తిన్నారు. వాళ్లకు మోతీ రాం తాత గుర్తకొచ్చి అతని గుడిసెకెళ్లారు. "తాతా కథ చెప్పవా?" అని అడిగారు. మోతీరాం తాత భార్య రుక్కీబాయి ఏదో దీర్ఘ రోగంతో బాధ పడుతోంది. ఐనా మోతీరాం తాతకు పిల్లలంటే ఇష్టం గదా! "సరే! చెపుతాగానీ, ఈ జబ్బు మనిషి దగ్గర కాదు. అలా ఆరుబైటకు వెళదాం." అన్నాడు.

పిల్లలంతా చెంగో అని పరుగుదీశారు. తాత కర్ర తీసుకొని మెల్లగా కదిలాడో లేదో చేను కావలి కాస్తున్న కొమురం బొజ్జు కేకలు వినిపిస్తున్నాయి. ఇంత రాత్రి ఈ కేకలంటే చేనిలోకి ఏవో జంతువులు వచ్చే ఉంటాయనుకున్నారు. పిల్లలంతా బొబ్బలు పెడుతూ కొందరు చేతికందిన డబ్బాలు తీసుకున్నారు. కొందరు డప్పులు తీసుకొని కొడుతూ అటుగా పరుగుదీశారు. పెద్దలూ గోలగోలగా అరుస్తూ అటు వైపే పరుగందుకున్నారు. భీము గుడిసె సూరున ఉన్న బరిశీ అందుకొని కుడిచేత్తో నోరు లబలబ బాదుకుంటూ ఒకటే పరుగు.

లొద్దికి (వాగుకు) ఎగువన మరో కొండ దిగువన ఉన్న చేనిలోకి పందుల గుంపు వచ్చి పడింది. చేనంతా తొక్కేస్తున్నాయి. నేలంతా కుమ్మేస్తున్నాయి. గూడెం జనమంతా పెద్ద గోల చేస్తూ, అరుస్తూ, డప్పుల చప్పుళ్లతో వాటిని బెదిరిస్తారు. వెళ్ళగొడుతారు. ఇది మామూలే. అలా వెళుతున్న వాళ్లలో అందరికన్నా ముందు ఉన్నాడు భీమ్. పందుల మీదకి కొందరు కర్రలు విసిరారు, కొందరు చేతుల్లో ఉన్న రాళ్లు విసిరారు. అవి భయపడి వెనక్కి పరుగుదీశాయి. కొమురం భీమ్ వాటి వెనకాలే పొదల్లోకీ, చెట్ల మరుగు ప్రదేశంలోకి వెళ్లిపోయాడు.

ఒక బలసిన పంది భీమ్ మీదకు ఎదురు తిరిగింది. వచ్చి కుమ్మేసింది. భీమ్ కింద పడిపోయాడు. మళ్లీ వెంటనే లేచి పంది మీదకు లంఘించాడు. అది భయపెట్టింది. కరిచేందుకు నోరు చాచి మీదకొచ్చింది. ఐనా భీమ్ దాన్ని కొట్టడం, బరిశెతో పొడవడం మానుకోలేదు. అది భయపడి పరుగుదీస్తున్నట్టు వెళ్లి వెంటనే వెనక్కి తిరిగింది. చాలా వేగంగా భీమ్ మీదకు పరుగెత్తుకొస్తోంది. అది గమనించిన

భీమ్ అంతే వేగంతో వెనక్కి పరుగెత్తి వెళ్లి ఎదురుగా ఉన్న గుండు మీదకు ఎగిరి నిలబడ్డాడు. భీమ్ పొడిచినందుకు బాగా గాయపడ్డ ఆ పంది ఉక్రోషంతో కన్నుగానక వచ్చి ఫెటేల్న ఆ రాతి గుండుకేసి గుద్దుకుంది. అంతే తల రెండుగా పగిలి గిలగిల కొట్టుకొని అక్కడే ప్రాణం వదిలింది. భీమ్ ఏ మాత్రం సమయస్ఫూర్తి పాటించకున్నా అప్పుడు చాలా ప్రమాదానికి గురి అయ్యేవాడు.

ఇక భీమ్ చెట్లలో నుండి బయటకొచ్చి కేక వేశాడు. పందిని చంపాననీ చెప్పాడు. అందరూ పరిగెత్తు కొచ్చారు. ఎంతో సంబరపడిపోయారు. ముగ్గురు మనుషులు లేపినా లేవనంత బరువుంది పంది. దాన్ని నలుగురు వ్యక్తులు దృఢమైన కట్టే కావడి కట్టి మోసుకుంటూ గూడెం తీసికెళ్లారు. చిన్ను పటేల్ పంది మాంసం



గూడెంలోని అందరికీ సమానంగా పంచిపెట్టాడు. ఆ రోజు పండుగ ఎంతో గొప్పగా ఎవరూ మర్చిపోనంత బాగా చేసుకున్నారు.

మరునాడు భీమ్ మోకాలికి తాకిన గాయం కొంచెం బాధ పెడుతున్నది. ఐనా లెక్క చేయలేదు. వదినతో నీళ్లు తేను లొద్దికి సిద్ధమయ్యాడు. కానీ, పైకూ అతన్ని వెళ్లనివ్వలేదు. వదినతో తాను వెళతానని బయలు దేరాడు. పైకూ చేతిగాయం తగ్గింది. కానీ, మొండి చెయ్యి మిగిలింది. అప్పుడు అనుకున్నాడు భీమ్ 'అడివిలో విషం పురుగులకు భయపడం. భయంకరమైన జంతువుల్ని తరిమికొడతాం; చంపేస్తాం. కానీ, ఆ జంగ్లాత్ వాళ్లతో, ఈ షాపుకార్లతో చచ్చిపోతున్నాం. ఇది ఎట్లా మారాలి? ఏం చేయాలి? ఈ కొండల కింద నుంచి వచ్చే మనుషులు ఇంత ప్రమాదకరంగా ఉన్నారు. వీళ్లను ఎట్లా తరిమేయాలో తోచడం లేదు. నా నేస్తం పైకూ మీదకి వచ్చింది సింహమైనా పొట్లాడి రక్షించేవాణ్ణి. వాని చేతివేళ్లు తెగనిచ్చేవాన్ని గాదు.'

పైకూ, వదినా తిరిగి వచ్చే వరకు భీమ్ ఏదో ఆలోచిస్తూ అట్లే కూర్చొని ఉన్నాడు. వదినను చూడగానే నిన్న ఆమె పాడిన పాట, ఎప్పుడూ తాను పాడే పాట గుర్తుకొచ్చింది.

కూసే కూకు కూకూ... కూసే కోకిల కూ... కూ...
కేడా మావయి కూ.. కూ... అడివి మనదీ కూ.. కూ..
బీడూ మావయి కూ.. కూ.. బీడూ మనది కూ.. కూ..
గోండు రాజ్యం కూ.. కూ.. గోండు రాజ్యం కూ.. కూ..
మైసి వాకట్ కూ.. కూ.. గెలిచీ వస్తాం కూ.. కూ..
తుడుం అంకత్ కూ.. కూ.. తుడుం మోగించాలె కూ.. కూ..
సచ్చుల దేశం కూ.. కూ.. మొత్తం దేశం కూ.. కూ..
లడాయి గెల్వన కూ.. కూ.. పోరాటం గెల్వాలె కూ.. కూ..
మైసి వాకట్ కూ.. కూ.. గెలచీ వస్తాం కూ.. కూ..
కూసే కూ.. కూ.. కూ.. కూ.. కూసే కోకిల కూ.. కూ..

వదిన కుకూబాయి భీమ్ దగ్గరకొచ్చింది. "భీమ్ కాలు నొప్పిగా ఉందా? ఏంగాదు. లే. లేచి ముఖం కడుక్కో అంబలి తాగుదువుగాని. నీకు ఏంగాదు. ఆ మాత్రం దానికే అట్లా కూర్చోకూడదు. మీ నాన్న రాంజీ గోండు కథ చెపుతాడు ఓ సారి విను" అంది.

భీమ్ వెంటనే లేచాడు. కాలు గట్టిగా జాడించి నేరుగా నిల్చున్నాడు. నిజమే

తనకు ఏ బాధా లేదు. వదిన చెప్పింది నిజమే అనుకున్నాడు.

ఆ రాత్రి తండ్రి దగ్గరకెళ్లి రాంజీ గోండు కథ గూర్చి అడిగాడు. తండ్రి కథ చెప్పే ఓపిక లేదన్నాడు. ఇక వదినే చెప్పాలి. ఆమె దగ్గర కెళ్లి ఆమెను విన్నది చెప్పమని అడిగాడు. "ఐతే నాన్న కన్నా పెద్దవాడు మోతీ రాం తాతకూ ఆ కథ తెలుసు. మీకు ఎన్నో కథలు చెప్పాడు గదా అదీ చెపుతాడు వెళ్లి అడుగు" అంది.

ఐతే భీమ్ అప్పుడే వెళ్లి మోతీరాం తాతని అడగలేదు. ఎందుకంటే మోతీరాం తాత భార్య రుక్మీబాయి చావుబతుకుల్లో ఉంది. అది భీమ్‌కి తెలుసు. వదిన కింకా తెలియదు.

* * *

మోతీరాం తాత భార్య ఆకలితో, జబ్బుతో చనిపోయింది. అన్నిటికన్నా ప్రమాదకరమైన రోగం ఆకలి. అది గోండులందరికీ తెలుసు. ఆ చుట్టుపట్ల ఉన్న గూడాల ప్రజలు ఒంటి పూట సగం కడుపుకే గంజి తాగుతున్నారు. అదీ బతకడానికే. గూడాల్లో చాలా మందికి రకరకాల జబ్బులు. ఎవ్వరు ఎప్పుడు చనిపోతారో ఎవ్వరికీ తెలియదు.

పది రోజులు గడిచాయి. ఆ రోజు చీకటి పడ్డాక ఊరి చివర నున్న బేతాళ్ జెండా దగ్గర పిల్లలంతా కూర్చొని మాట్లాడుకుంటున్నారు. వాళ్లకు గుడిసెల్లో నుండి మోతీరాం తాత వస్తున్నది కనిపించింది. అందరూ సంతోషంగా గంతులేశారు. అతను రాగానే భీమ్ లేచి కూర్చోమని చోటు ఇచ్చాడు. అతని ముఖం దిక్కుగా చూశాడు. పిల్లలెవరూ తాతను కథ చెప్పమని అడిగే ధైర్యం చేయకున్నారు. కానీ, అందులో అందరికన్నా చిన్నవాడు లచ్చు మాత్రం 'తాత కథ చెప్పవూ?' అన్నాడు.

మోతీరాం తాతకు నవ్వు ఆగలేదు. బోసినోటితో పకపకా నవ్వి "సరేరా చెపుతాను, ముందు అక్కడ నెగడు ఏర్పాటు చేయండి" అని "ఇంతకూ ఏ కథ చెప్పాలీ?" అడిగాడు.

"రాంజీ గోండు కథ" అన్నాడు భీమ్.

పిల్లలు క్షణంలో మంట ముట్టించారు. అందరూ కూర్చున్నారు. తాత అందరి దిక్కు చూశాడు. భీమ్ తాత దగ్గరికి జరిగాడు.

"పూర్వం మా నాయన, మీ అందరి తాతలు రాజ్యమేలుతున్న కాలం. మనందరికీ రాజు ఉట్నూరులో ఉండేవాడు. అప్పుడు మీ తాతలు, మా నాయన కూడా అక్కడనే ఉండేవారు. ఆ కాలంలో మనకు ఈ పన్నుల బాధలు లేవు. షావుకార్ల

పీడాలేదు. అడివంతా మనదే. ఇంతలో ఎక్కడి నుండి వచ్చారో వాళ్లు? ఎలా వచ్చారోగానీ కొందరు తెల్లదొరలొచ్చారు. ఎందుకూ? అడివిలో వేటకని వచ్చారు. ఆ తెల్లదొరలకూ, ఈ నైజాం రాజుకూ దొస్తానీ ఉందట. ఆ తెల్లోడు అంటే అదే ఇంగ్లీషువాడు. వాడు ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేసేవాడట ఈ నైజాము. సరే! అడివికి వేటకని వచ్చిన ఈ తెల్లదొరలు జింకనో, కుందేలునో, ఇంక దేన్నో పట్టుకుపోతే ఫరవాలేదు. వాడూ మనిషే గదా అని ఊరుకుందుము. మరి అట్లా జరగలేదు. అడివికొచ్చి జంతువులను పట్టుకున్నట్లే మన మనుషులను పట్టుకున్నాడు. పట్టుకపోయి వాళ్ల ఇళ్లలో అన్ని రకాల చాకిరి చేయించుకుంటున్నారట. ఈ పద్ధతేం బాగోలేదు. మనుషులు జంతువులు కారు. అని కొందరు యువకులు, మన రాజును అడగందే బయటివాళ్లు మా అడివికి రావొద్దు అన్నారు. మనుషుల్ని తీసుకు పోకూడదన్నారు. ఆ వొచ్చేవాళ్లకు ఈ సంగతి గట్టిగా చెప్పారు. అంతే తెల్లదొరలకు కోపం వచ్చేసింది. 'నైజాం రాజు సైతం మాకు ఒంగి సలాములు చేస్తుంటే మీరెంత వాళ్లురా' అన్నారు. ప్రశ్నించిన ఆ యువకుల చేతులు నరికి పంపించేశారు. అంతేగాదు ఈ అడివి అడివంతా మాదే. ఈ భూమంతా మాదే అన్నారట.

అప్పుడు మన రాజు రాంజీ గోండు ఈ అన్యాయం సహించలేదు. అంతా విన్నాడు. కోపంతో కళ్లు నిప్పులు చిమ్మాయి. పండ్లు పటపట కొరికాడు. వీరుడై లేచాడు. వెంటనే అడివిలో 'తుడుం' మోగింది. గూడెం గూడెం కదిలింది. ఎక్కడెక్కడున్న పటేండ్లు వచ్చారు. వంద గ్రామాల పెద్దలైన ముఖాసీలను పిలిపించాడు. అందరిని ఒక్కటి చేశాడు. ఇక తప్పదు యుద్ధం చేయాలని వారికి చెప్పాడు."

పిల్లలందరూ ఎంతో శ్రద్ధగా వింటున్నారు. అందరినీ గమనించిన మోతీరాం తాత మళ్లీ చెప్పసాగాడు.

"యుద్ధం ఎందుకు చేయాలో వివరించాడు రాంజీ గోండు రాజు, తెల్లదొరలు అడివిని అల్లకల్లోలం చేస్తున్నారు. గూడాలను దోచుకుపోతున్నారు. మనిషిని మనిషిలా చూడకున్నారు. ఇదంతా అన్యాయం గదా అని, తనకన్నా పెద్దలైనవాళ్లు, అనుభవం ఉన్నవాళ్లు ముసలివాళ్లతో విచారించాడు. అప్పుడు వాళ్లు ఎందుకైనా మంచిదని తెల్లదొరలకు ఓ కబురు పంపించమన్నారు వినయంగా. రాంజీగోండు అందుకు సరే అని ఓ పెద్దమనిషితో కబురు పంపించాడు ఏమనీ...? "అయ్యా! మేము అడివిని నమ్ముకొని బతికేవాళ్లం. అడివే మాకు తల్లి. అడివే మా రాజ్యం. మేం ఎవరికీ, ఏ రాజ్యానికీ వ్యతిరేకులం కాము. మీరే వచ్చి మమ్మల్ని బాధలు పెడుతున్నారు.

రెచ్చగొడుతున్నారు. ఇది మీకు న్యాయం కాదు. ఈ సంగతి మీ తెలివిమంతులైన రాజు గారికి తెలపండి. మా జోలికి రాకండి. అట్లా కాకుండా మీకు యుద్ధమే కావాలంటే సరే మీ ఇష్టం. ఇక్కడ గోండులూ, కొలామ్‌లూ మీకు మంచి గుణపాఠం చెపుతారు. నెత్తురు ధారపోసి వీళ్లు వీళ్ల రాజ్యాన్ని కాపాడుకుంటారు." ఈ కబురు తీసుకెళ్లిన మనిషి మళ్లీ తిరిగి రాలేదు. మరేమయ్యాడూ? అతని తల తిరిగొచ్చింది.

తర్వాత ఇంగ్లీషోడు యుద్దానికి సిద్ధమై వచ్చాడు. ఐతే మనవాళ్లు ఊరుకుంటారా!! లేదు. కొమ్ములు ఊదారు. తుడుం మోగించారు. యుద్ధం మొదలైంది. మనకు కత్తులు, కటార్లు, బాణాలు, బరిశెలు, ఒరిశెల రాళ్లురప్పలు, కొండల మీదున్న గుండ్లు, ఇవ్వే ఆయుధాలు. అంతే కాదు. చేతికి ఏది దొరికితే దానితోనే యుద్ధం చేశారు. పెద్ద యుద్ధమే జరిగింది. మూడు రోజులు రాత్రి పగలూ జరిగింది. మన ఆయుధాలు అయిపోయాయి. వాని దగ్గరేమో తుపాకులాయే. వాడు ఆ గొట్టాలలో మందు నింపడం కాల్చడమే పనాయే. ఐనా మనవాళ్లు భయపడలేదు. ధైర్యం చెడలేదు. చాలా మంది తెల్ల సైనికుల్ని చంపేశారు. నాల్గోనాడు మన రాజు రాంజీగోండును, ఇంకా ఎందరినో బంధించి తీసుకుపోయారు. మన గూడాలు అన్నీ చెల్లాచెదురైపోయాయి. గూడాలను తెల్లోళ్లు తగులబెట్టారు. దోచుకున్నారు. రాంజీ గోండునూ, ఆయన తోడున్న వాళ్లనూ నిర్మల్ అనే చోటికి తీసుకపోయ్యి కాల్చి చంపి ఓ చెట్టుకు వేలాడదీశారు.

మన గూడాలన్నీ తల్లడిల్లాయి. పిల్లాపాపా ఏడ్చారు. చెట్టూపుట్టా వెలవెలబోయాయి. పక్షులూ, పశువులూ దుఃఖపడ్డాయి. మూడు రోజులు ఎవరూ తిండి ముట్టుకోలేదు." మోతారాం తాత కథ పూర్తి చేశాడు. పిల్లలంతా మౌనంగా కూర్చున్నారు.

"అప్పుడు మనకూ తుపాకులుంటే మనమే గెలచేవాళ్లం కదా తాతా?" అడిగాడు జంగు.

"అవును మరి లేవుగా!" అన్నాడు తాత.

కొమురం భీమ్ మనసు నిండా రాంజీ గోండు జ్ఞాపకాలే మిగిలాయి. రాంజీ గోండు మా తాతయ్య అనుకున్నాడు. మెల్లగా పాట అందుకున్నాడు. "కూసే... కూకు... కూకూ... కేడా మావయి కూ.. కూ..."

* * *

ఎండ మండిపోతోంది. చెట్ల ఆకులూ రాలిపోయి ఉన్నాయి. వేడికి భరించలేక చిన్న చిన్న పక్షులూ రాలి పడి చనిపోతున్నాయి. వేడిగాలులు. ఎండాకాలంలో

గోండులకు నీటి కరువు. ముఖ్యంగా పటారు మీదుండే గూడాలు నీళ్లకు తల్లడిల్లిపోతాయి. నీళ్ల కోసం స్త్రీలు కొండలు దిగి వస్తారు. రెండు మూడు కిలోమీటర్లు నడిచి వచ్చి నీళ్ల బరువుతో మళ్లీ ఎక్కుతారు. నీళ్లు లేకుండా ప్రాణి బతకడం కష్టం కదూ!! నీళ్లకే కాదు. వేసవిలో గిరిజనుల తిండికీ కష్టమే ఉంటుంది.

పంటలు పండే కాలంలో వర్షం లేకపోవడం. వర్షం పడినా తక్కువ పడడంతో పంట నష్టమౌతుంది. కొన్ని పంటలు దక్కినా కీటకాల బాధ, పక్షుల బాధ, కోతులూ, పందుల బాధ. ఇవ్వన్నీ తినేసినాక మిగిలింది షావుకార్లు తింటారు. ఇంకా ఏమైనా మిగిలిందంటే జంగ్లాత్ వాళ్లు వచ్చి గుంజుకొని వెళ్లిపోతారు. ఇక ఏమీ లేక వెర్రి మొహాలతో ఉండే వీళ్లకు ఆకులు, అలము తప్ప ఏమీ ఉండదు. వేసవిలో ఆకులే తింటారు. లేదా నేలను తవ్వి రకరకాల దుంపలు తీస్తారు. ఏవో దొరికినవి తినేస్తారు. దానికి తోడు నీళ్ల సమస్య. ఇలా పశువులు, మనుషులు నానాయాతన పడతారు.

అదిగో అలాంటి వేసవి కాలంలో బాధలన్నీ ఇంకా పడదలుచుకోలేదు కొమురం చిన్ను. బతుకు చాలించాలనుకున్నాడు. జ్వరం వచ్చింది. కాలికున్న పుండు మరీ బాధిస్తుంది.

తన గుడిసెలో మంచం మీది చివరి క్షణాల్లో ఉన్నాడు. తన తమ్ములు కుర్దు, యేసులను పిలిచాడు. తన కొడుకులు సోము, బొజ్జు, భీములనూ పిలిచాడు. తమ్ముల కొడుకులనూ దగ్గరగా రమ్మనాడు.

చివరి మాటలుగా కుర్దుకి తన కొడుకుల్ని అప్పగించి “ఇక నుండి వీళ్లను నీ పిల్లలనుకో. మన తండ్రి పోయాక మిమ్మల్ని నేను పెంచాను. వీళ్లను నువ్వు పెంచాలి. ఈ గూడెంలో ఉండకండి. వదిలేసి వెళ్లిపోండి. ఇక్కడ బతకలేరు. భూమి సారం తగ్గింది. అంతేకాదు, జంగ్లాత్ వాళ్లు, షావుకార్లు మిమ్మల్ని బతకనీయరు. మీరు సుర్దాపూర్ వెళ్లండి. మళ్లీ అడివి నరకండి. భూమి సాగు చేసుకోండి.

ఇకపోతే, నేను గూడెం పెద్దను. నా తర్వాత సోము గూడెం పటేలు కావాలి. పటేలుకి కొన్ని ధర్మాలుంటాయి.”

సోము, తండ్రి దగ్గరకి జరిగాడు. చిన్ను మళ్లీ చెప్పసాగాడు. “దేవుళ్లను కొలవాలి. పండుగలు బాగా చేయాలి. పటేలు తనకున్నా లేకున్నా సర్కారు మనుషులొస్తే తిండి పెట్టాలి. అందుకుగాను గూడెం వాళ్లు ఒక్కరోజు నీ భూమి ఉచితంగా దున్ని పెడతారు. వార్తలు బయటకి పంపించడానికి ఒక వ్యక్తిని నీవు హవల్దారుగా నియమించుకోవాలి. కొట్లాటలు వస్తే న్యాయంగా తీర్పు చెప్పాలి. తెగని పంచాదులుంటే నూరు గూడాలా

పెద్దయిన 'ముఖాసీ' దగ్గరకెళ్లాలి" అని చెప్పాడు.

భీమ్ అంతా వింటున్నాడు.

చిన్ను చివరగా "ఈ శరీరం పాతబడి పోయింది. ఇది చినిగిపోయింది. నేను దీన్ని విడిచి వెళ్లిపోతున్నాను" అంటూ నవ్వుతూ కండ్లు తేలవేశాడు. అతన్ని నలుగురు పట్టి నేల మీద గడ్డిలో పడుకోబెట్టారు. కొమురం చిన్ను నోట్లో సోము నీళ్లు పోశాడు. అంతే అతను చనిపోయాడు. ఇదంతా కొమురం భీమ్‌కి కొత్తగా ఉంది. తండ్రి చెప్పి చనిపోవడం విచిత్రంగా తోచింది.

* * *

కొమురం చిన్ను చనిపోయాక కొమురం కుర్దు సంకెనపెల్లి వదిలేశాడు. తన తమ్ముడు యేసు కుటుంబం, అన్న పిల్లలూ అంతా గూడెం వదిలేశారు. కొందరు అక్కడే ఉన్నారు. కొందరు కొలాములు కూడా కుర్దుతో బయలుదేరారు. పశువులు, మేకలు, కోళ్లు, తట్టాబుట్టలతో బండి మీద సామాన్లు సర్దుకొని సాగిపోయారు. గూడెం వదిలేస్తూంటే భీము చాలా బాధ పడ్డాడు. అక్కడి చెట్టూ చేమా, బోళ్లూ బండలు, కొండలు, కొండ వాగులూ అన్నీ అతనికి గుర్తుకొచ్చాయి. భీమ్‌కి ఏడుపొచ్చింది. అది గమనించిన వదిన ఇదంతా మామూలేనని, అడవుల్లో బతికే మనకు ఇది అలవాటేనని చెప్పింది.

వాళ్లు జనగామ (ఆసిఫాబాద్), ధనోరా దాటి సుర్దాపూర్ చేరుకున్నారు. మూడు గుట్టలు, మధ్య మైదాన ప్రదేశం చూసి బండ్లు ఆపారు. పక్కనే ఉన్న పెద్దవాగు ఒడ్డున గుడిసెలు వేసుకున్నారు. అడివి విశాలంగా కనిపిస్తోంది. ఇక ఆ ప్రాంతమంతా సాగుభూమి కాగలదని భీమ్ సంతోషించాడు.

చెట్లు నరికారు; తుప్పలు నరికి, రాళ్లు రాప్పలు ఎత్తేశారు. చిన్న చిన్న రాళ్లు ఏరిపారేశారు. ముండ్ల కంపలు కాల్చి భూమి చదును చేసుకున్నారు. ఒక్కరొక్కరుగా సాగు చేస్తే చాలా కాలం పడుతుంది. కదా! అలా వద్దని "సమిష్టిగా పని చేద్దాం. తర్వాత భూమి సమానంగా పంచుకుందాం'' అన్నాడు కుర్దు. అందరూ అంగీకరించారు. అట్లే చేశాడు. అందరికీ భూమి పంపకం జరిగింది.

వర్షాలు పడ్డాయి. నేలంతా బురద బురద. పిల్లలు వెదురు బొంగులు నిలువెత్తువి తీసుకున్నారు. వాటికి నేల నుండి పావు మీటరు ఎత్తున రంధ్రాలు చేశారు. పాదం నిలిచేంత నిడివి ఉన్న చిన్న కర్రలు అడ్డంగా ఆ రంధ్రాల్లో దూర్చారు. ఇక వెదురు బొంగుల్ని నిలబెట్టి రెండు చేతుల్లో రెండు పట్టుకొని అడ్డకర్రలు మీద నిలబడి



నడవసాగారు. పెద్ద పెద్ద అంగలతో పెద్ద వాళ్లకు సమానంగా నడక. వాళ్లకు బురదా, ముండ్లు అడ్డురావు. బలే సరదాగా ఉంది పిల్లలకు.

ఒకనాడు అడివిలో మేకల్ని మేపుతున్నారు పిల్లలు. వాళ్లకు ఒక సమస్య ఎదురైంది. కొమురం భీమ్, సోము, బాదు, జంగు, రాజు, మాదు ఇంకా లచ్చు అడివిలో ఉన్నారు. అందరూ కలిసే మేకలమందల్ని మేపి ఇంటికి తిరిగొస్తున్నారు. కొండమీద కొత్త ప్రదేశం లోతుపాతులు తెలియవు. ఒక బండ సొరికెలోకి దూరి వెనకాల ఏముందో చూడబోయాడు లచ్చు. లచ్చు అక్కడున్న అందరిలోకి చిన్నవాడు. వెళ్లనైతే వెళ్లాడు గానీ, తిరిగి వచ్చేందుకు పైకి ఎక్కే వీలుకాకుంది. ఇక లచ్చుకి ఏడుపే మిగిలింది. లచ్చు కనిపించడం లేదని భీమ్ వాళ్లంతా దిక్కులు వెదికారు. చివరికి వాడి ఏడుపు విని ఎక్కడున్నదీ పసిగట్టారు. కానీ, వీళ్లు ఎవరూ వెళ్లి లచ్చుని పైకి తేలేరు. అది చాలా చిన్న సొరంగంలా ఉంది. ఏం చేయాలో ఎవరికీ అర్థం కాలేదు.

ఇంతలో దూరంగా పులి అరుపు. ఆకలితో అరుస్తున్నట్టే అరుపు. అందరూ భయంతో వణికిపోయారు. ఆ పులి ఎటువైపుగా ఉందో? ఎంత దూరంలో ఉందో ఎవరికీ తెలియదు. చప్పుడు మాత్రం వినిపిస్తోంది. పిల్లలందరూ లచ్చును వదిలేసి పరిగెత్తే ఆలోచనలో ఉన్నారు. అప్పుడు భీమ్ ఏం చేయాలో తోచక "ముందు మీరందరూ వెళ్లిపోండి" అన్నాడు.

"మరి నువ్వో?" అన్నారు పిల్లలంతా!

"నేను దాన్ని చంపేస్తా." అది ఎంత పెద్దదో దాని బలమెంతో తెలియదు. భీమ్ చంపుతానంటాడు. అందరికీ అనుమానం. భయం.

మళ్లీ పులి అరుపు వినిపించింది.

"మీరంతా వెళ్లి ముందు మన పెద్దవాళ్లకు ఈ విషయం చెప్పండి. నేను ఇక్కడే ఉంటాను. లచ్చుని వదిలి మనం వెళ్లిపోతే వాడు భయంతో చస్తాడు. లేదా పులి చిన్నదైతే లోపలికి దూరి వాన్ని తినేస్తుంది. లచ్చు పులికి ఆహారం కాకూడదు. అందుకు మనం ఓ ఉపాయం చేద్దాం. ఆ పులికి కనిపించే విధంగా ఓ మంచి మేకను చెట్టు దగ్గర కట్టేద్దాం. పులి మనవాళ్లు వచ్చేలోగా ఇక్కడికి వస్తే మేకను తినేస్తుంది. లచ్చు బతుకుతాడు. మనవాళ్లే ముందు వస్తే మేకా, లచ్చు బతుకుతారు. మన వాళ్లంతా పులిని తరిమేస్తారు. లేదా చంపేస్తారు" అన్నాడు భీమ్.

"ఈ ఉపాయం బాగుంది" అన్నాడు జంగు.

"మరి నువ్వో?" అడిగాడు సోము.



'నేను ఆ టేకు చెట్టు ఎగబాకి పైన కూర్చుంటా' అని చెప్పి కొండపై భాగాన మేకను కట్టేశారు. అప్పటికే పులి అరుపు కొంచెం దగ్గరగా వినిపిస్తోంది. పిల్లలంతా గూడెం దిక్కు పరిగెత్తారు. భీమ్ చెట్టేక్కాడు. పులి అరుపు మరీ దగ్గర్లో వినిపించగానే అటు చూశాడు భీమ్. పులి బలంగానే, పెద్దగానే ఉంది. అది భీమ్‌నే చూస్తోంది.

భీమ్ దాన్ని వెక్కిరిస్తూ చెట్టు కొమ్మలు విరిచి దాని మీదకి విసిరేస్తున్నాడు. అది ఆకలితో ఉందో లేదో! వెంటనే మేక దగ్గరికీ వెళ్లదు, ఇటు భీమ్‌నీ వదిలి దూరంగా పోదు. అలా టేకు చెట్టుకి కొంచెం దూరంలో కూర్చొని భీమ్ దిక్కూ, అరుస్తున్న మేకవైపూ చూడసాగింది.

ఇంతలో గూడెం పెద్దలంతా డప్పులతో, పెద్ద చప్పుళ్లతో వచ్చారు. చేతుల్లో దివిటీలు వెలిగిపోతున్నాయి. గొడ్డళ్లూ, కత్తులూ, బరిశెలూ తెచ్చారు. ఆ చప్పుడూ, ఆ హంగామా చూసి పులి తోక జాడిచ్చి వెళ్లిపోయింది. కుర్దు తనతో తెచ్చిన తాడు లచ్చు ఉన్న బండ సొరికెలోకి వదిలాడు. లచ్చు దాని ఆధారంగా పైకి రాగలిగాడు. లచ్చు అందరిలో కలవగానే పిల్లలంతా గొప్పగా నవ్వి, కేరింతలేశారు. పాటలు పాడారు. ఆడుకుంటూ గూడెం దిక్కు సాగిపోయారు.

భీమ్ తెలివిని పెద్దలు మెచ్చుకున్నారు. వదిన భీమ్‌ని బలేగా మెచ్చుకుంది. భీమ్‌కి ఇష్టమైన "కూసే కూకూ.. కూకూ.." పాట పాడింది.

* * *

జొన్న చేలు ఏపుగా ఎదిగాయి. తెల్లగా ముత్యాలవలె జొన్నలు. కంకి బాగా విడిచింది. ఆ చేను చూసి గోండులు, కొలామ్‌లు తెగమురిసిపోతున్నారు. ఏండ్లుగా ఉన్న ఆకలి మంట చల్లారనుంది. ఇక కడుపు నిండా ఆరు నెలల పాటు తిండి దొరుకుతుంది.

కొమురం భీమ్ తన తమ్ములకూ, మిత్రులకూ కథలు చెపుతున్నాడు. మోతీరాం తాత చెప్పిన ప్రతి కథా తనకు జ్ఞప్తికుంది. అన్నిటికన్నా రాంజీగోండు కథంటే తనకు చాలా ఇష్టం. అందరూ వింటారు. అదే చెపుతున్నాడు...

అప్పుడు సుమారు పదిపన్నెండు మంది తెల్లబట్టల వాళ్లు గూడెంలోకి ప్రవేశించారు. 'ఎవరబ్బా వీళ్లంతా' అని గూడెం వాళ్లు అనుమానం నుండి తేరుకోకముందే "రాంరాం కుర్దూ" అన్నాడు అందులో ఒకడు.

కుర్దు అతన్ని ఒకసారి చూసి ఉన్నాడు. ఏదో అంగడిలో కలిసినఅతనే లక్ష్మణరావు  పట్వారి.



"రాం రాం పట్వారి గారూ" బదులు పలికాడు. కొమురం కుర్దు.

'రాంరాం' అనే మాట గోండులూ, కొలామ్‌లు తరుచూ అంటారు. ఏ కొత్తవాళ్లు కలిసినా, బంధువులు వచ్చినా మనం 'నమస్తే' అన్నట్టుగానే వాళ్లు 'రాం రాం' అని మాటలు ప్రారంభిస్తారు. అది వాళ్ల ఆనవాయితీ.

రాం. రాం. అన్న పట్వారీ తన పక్కనే ఉన్న ఏనుగంత మనిషిని చూపాడు. "ఇతనెవరో తెలుసా?" అని అడిగాడు.

తెలియదన్నారు గూడెం వాళ్లంతా.

"ఇతను సిద్ధిక్‌సాబ్."

పేరు తెలియగానే ఆ ముస్లిం సోదరునికి 'రాంరాం' చెప్పారు వాళ్లంతా. అతనితో వచ్చిన వాళ్లు తొమ్మిది మంది దిక్కులు చూస్తున్నారు. అసలు వీళ్లంతా ఎందుకొచ్చారో గూడెం వాళ్లకెవరికీ తెలియదు.

సిద్ధిక్ అనే అతను గూడెం మధ్యలో ఉన్న బంగ్లాలోకి దూరిపోయాడు. మంచం మీద కూర్చున్నాడు. అతని కాళ్లకు చెప్పులు అలాగే ఉన్నాయి. చెప్పులతో గుడిసెల్లోకి వెళ్లడం గోండుల పద్ధతికీ, మర్యాదకీ విరుద్ధం. ఐనా అప్పుడు వాళ్లు ఏమీ అనలేదు. యేసు మాత్రం బాధపడినాడు. "వాడు చెప్పులతో లోనికి వెళతా డేం?" మర్యాదగానే అడిగాడు లక్ష్మణరావుని.

గోండుల్లో మరోటుంది. మహారాజు వచ్చినా వారినీ 'వాడు' అనే అంటారు గానీ, కనీసం 'అతను' అనరు. 'ఇతను' అనరు. 'వీడు' అంటారు.

"అది అతని ఇష్టం. మీరు దున్నిన భూములన్నీ ఈ సిద్ధిక్ సాబ్‌వే. ఇక్కడి నుండి మొదలుకొని కెరిమెరి కొండల వరకూ ఇతను పట్టేదారు. నైజాం సర్కారు ఈయనకు చాలాకాలం కిందటే పట్టాలిచ్చారు. ఈయన అనుమతి లేందే మీరు భూమి సాగు చేశారు. చాలా పెద్ద నేరం చేశారు. మీరు చదువూసంధ్యా లేని మొద్దులు కనుక మొదటి తప్పుగా భావించి వదిలేస్తున్నారు సిద్ధిక్ గారు. ఇక నుండి మీరంతా ఈ భూముల మీద కౌలు చెల్లించాలి" చెప్పాడు లక్ష్మణరావు.

"ఇక్కడికొచ్చి ఇంతకాలం కష్టించాం. పంటలు పండించాం. ఇప్పుడు వీళ్లు మాదంటూ రావడం చాలా అన్యాయం. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ భూమి మరొకనిది కాజాలదు." అనుకొని "మేం కౌలూ గివులూ ఏదీ చెల్లించేది లేదు" అన్నారు.

గూడెం వాళ్ల మాటలు విన్న సిద్ధిక్ గుడిసె బంగ్లాలో నుండి బయటకొచ్చాడు. వచ్చి "ఐతే వెంటనే ఈ ప్రాంతం వదిలి వెళ్లిపొండి. ఈ పంటా గింటా అంతా నాదే" అన్నాడు.



సిద్ధిక్‌తో వచ్చిన మిగతా వాళ్లు సారా తాగి, కోళ్లు తిని గ్రామస్తుల్ని నానా బాధలు పెట్టాలనుకున్నారు. చేతికందిన వస్తువు ఎత్తుకుపోదామనే ఉద్దేశంతో ఉన్నారు. కానీ, గూడెం వాళ్లంతా భయపడకుండా ఉన్నారు. గట్టిగానే మాట్లాడుతున్నారు. 'ఇక లాఠీలెత్తి చితక కొట్టాలి దారికొస్తారు' అనుకొని కొట్లాటకు సిద్ధమౌతున్నారు.

"ఎంతో కష్టపడి చెమటోడ్చి సాగు చేశాం. పంట పండించాం. మీదే ఈ భూమి ఐతే ముందే చెప్పకూడదా? ఇప్పుడే మేం దీన్ని వదలం. మీకు కౌలు చెల్లించం" అన్నాడు కుర్దు కోపంతో.

"ఇక్కడ అడివిల చచ్చిన మీకు నేను... నేనొచ్చి చెప్పాలెరా? బద్మాష్!" అంటూ సిద్ధిక్ కుర్దూ చెంప మీద గట్టిగా కొట్టాడు.

అంతే గోండులూ, కొలామ్‌లూ ఒక్కసారే లేచారు. సిద్ధిక్‌ని, అతని మనుషులనీ ఎదుర్కున్నారు. సిద్ధిక్‌తో వచ్చిన వాళ్లు ఆడామగా అని కూడా అనకుండా అందరినీ లాఠీలతో కొడుతున్నారు.

గూడెంలో ఉన్న ప్రతి మనిషీ ఎదురు తిరిగాడు. ఇక చావో బతుకో అన్నట్టుగా గట్టిగానే జవాబు చెబుతూ వాళ్లను కొట్టేస్తున్నారు. కర్రలు ఎగురుతున్నాయి. అరుపులు, పెడబొబ్బలు, కేకలు, అదో యుద్ధరంగంలా ఉంది. సిద్ధిక్ మనుషులు వీళ్ల ధైర్యం చూసి జడుసుకున్నారు. పట్వారి లక్ష్మణరావు తన గోచీ పంచ పైకి ఎగకట్టాడు. ఇక పెద్దవాగు గుండా ఒకటే పరుగుదీశాడు.

కొమురం భీమ్ తన తోటివాళ్లనంతా ఉత్సాహపరిచాడు. సిద్ధిక్ బలగంతో సమానంగా పోటీపడుతున్నాడు. సిద్ధిక్ చేతిలో పెద్ద లాఠీ ఉంది. పోటీ పడుతున్నాడు. కుర్దూతో తల పడుతున్న వాడల్లా దొంగచాటుగా వెనక నుండి యేసు తల మీద బలంగా దెబ్బ తీసేందుకు కర్ర ఎత్తాడు. ఆ దెబ్బతో యేసు ప్రాణం పోవలసిందే. కానీ, భీమ్ అది గమనించాడు. వెంటనే తన ఎడమచేతి కర్రతో సిద్ధిక్ లాఠీని ఆపేశాడు. తన కుడిచేతిలోకి దాన్నే తీసుకొని సిద్ధిక్‌ని చితకబాదేశాడు. సిద్ధిక్ కిందపడి ప్రాణం విడిచాడు. అతనితో వచ్చిన వాళ్లంతా ఒకటే పరుగుదీశారు. నిముషంలో ఆ ఛాయల్లో ఒక్కడూ కనిపించక వెళ్లిపోయారు.

సిద్ధిక్ శవం అక్కడుంది. ఆ తర్వాత ఏం జరుగుతుందో అందరికీ తెలుసు. గూడెమంతా చెల్లాచెదురైంది. అందరూ ఇంకా అక్కడ ఉండక కొండల్లోకి పారిపోయారు. భీమ్ కొట్టాడేకాని వాడు చచ్చిపోతాడనుకోలేదు. కోళ్లు, గొర్లు తిని సారా తాగి మదమెక్కిన ఏనుగంతటి మనిషి సిద్ధిక్, రెండు దెబ్బలకే చస్తాడని

ఊహించలేదు భీమ్. కాని, ఇప్పుడు జరిగేది ఎట్లా? భీమ్ అక్కడే ఉండి భయంతో ఆలోచిస్తున్నాడు. వదిన కుకూబాయి వచ్చి "భీమ్ ఇంకా ఇక్కడెందుకున్నావ్? ఎక్కడి కన్నా పారిపో... తర్వాత కలుద్దాం పరిగెత్తూ. సిద్ధిక్ మనుషులు చాలా మంది వస్తారు. నువ్వు ఇటు నుండి వెళ్లిపో" అని నెట్టేసి పంపించింది.

భీమ్ చాలా దూరం పరిగెత్తాడు. వాగు దాటి, అడ్డంగా చెట్ల గుండా నేరెడు కొండకేసి పరిగెత్తాడు. ఆయాసంతో రొప్పుతూ ఓ గుండు మీద కూర్చున్నాడు.

'సిద్ధిక్ భూములేనా ఇవ్వి? పట్టా ఏమిటి? ఎవరిస్తారు? నైజాం ఎవరు? వీళ్లకే ఎందుకిస్తారు? గోండోళ్లకి పట్టాలెందుకివ్వరు? ఎప్పుడూ మమ్మల్ని దోచుకోవడమేనా? మేం భూమి సాగుచేస్తున్నది తెలుసు కోలేదా? తెలిసి కూడా వచ్చి అడగలేదా? న్యాయం లేదా? ఎవరూ సిద్ధిక్‌ది తప్పు అని అతనికి చెప్పరా? సర్కారంటే ఎవరు? ఎక్కడుంటారు? ఇప్పుడు జరిగిన దానికి వాళ్లు ఊరుకుంటారా? పోలీసు లొస్తారేమో! అందర్నీ కొడతారేమో. లచ్చు, రఘు, సోము, మాధు, పైకూనీ కొడతారేమో! నేను ఇలా రావలసింది కాదు. మరి వదిన వెళ్లిపొమ్మందే!! ఆమెనూ పోలీసులు కొడతారేమో!!' ఇలా దిగులు పడుతున్న కొమురం భీమ్ గూడెం దిక్కు చూశాడు. దూరంగా గూడెమంతా కాలిపోతున్న మంటలు కనిపించాయి. మరింక గూడెం వెళ్లి లాభం లేదు అనుకున్నాడు. తను దొరికితే సిద్ధిక్‌ని చంపినందుకు రాంజీ గోండును చంపినట్టే తననూ చంపేస్తారేమో అనుకున్నాడు. లేచి మెల్లగా తన పాత ఊరు సంకెనపెల్లి దిక్కుగా నడిచాడు. అతనికి ఆ ఒక్కదారే తెలుసు. అక్కడ తన మిత్రుడు కొండల్ ఉన్నాడు. వాని కుటుంబం వీళ్లతో రాలేదు.

* * *

భీమ్ రాత్రీ పగలంతా నడిచి సాయంకాలం వేళకు సంకెనపెల్లి చేరాడు. తిండి లేక ముఖమంతా వాడి పోయింది. కడుపులో మంటగా ఉంది. గూడెం చేరకముందే జొన్న చేలో మంచె మీద కూర్చున్న కొండల్ భీమ్‌ని చూశాడు. పరిగెత్తుకొని వచ్చి కలిశాడు. ముందు తినడానికి ఏమన్నా కావాలని అడిగాడు భీమ్.

కొండల్ వెంటనే జొన్న చేలో నుండి పాల కంకుల్ని తెంపుకొచ్చాడు. జొన్నలు రాల్చాడు. మంచె కిందే చిన్న మంట పెట్టి మంటలో పలుగురాళ్లు వేసి బాగా కాల్చాడు. గోనె బస్తాలో రాల్చిన పచ్చి జొన్నల్లో వేడి వేడి పలుగురాళ్లు వేశాడు. బస్తాను బిగ్గరగా బిగించి జొన్నలు వేంచాడు. జొన్నలు సుయ్యిసుయ్యిమంటూ పేనం మీద ఏంచినట్లు అయ్యాయి. అప్పటికి భీమ్ ఏమీ మాట్లాడక నిద్రతో కునుకుతున్నాడు.

జొన్నలు సిద్ధం కాగానే భీమ్‌ని లేపి తినమని ఇచ్చాడు కొండల్. భీమ్ కడుపు చల్లబడింది. తర్వాత జరిగినదంతా కొండల్‌తో చెప్పాడు.

ఆ రాత్రి మిత్రులిద్దరూ ఆ చేలోనే మంచె మీద పడుకున్నారు. తెల్లారి లేచాక ఎలా తెలిసిందో ఏమో సుర్దాపూర్‌లో జరిగిన గొడవ, సిద్ధిక్ చావూ ఈ గూడెం వరకూ తెలిసింది. కొండల్ తండ్రి ముత్తు కొమురం భీమ్‌ని చూసి తన మీద ఏ నేరం వాలుతుందోనని భయపడ్డాడు. భీమ్ ఇంకా అక్కడ ఉండక కొండల్‌తో ఇక వెళ్లిపోతానన్నాడు. కొండల్ నేనూ వస్తానని సిద్ధమయ్యాడు. జరిగిన సంగతి అంతా మనందరికీ పెద్ద ముఖాసీతో చెపుదామన్నాడు. ముఖాసీ 'భారీలొద్ది' అనే చోట ఉంటాడని కొమురం చిన్ను చెప్పగా విని ఉన్నారు. అక్కడికి వెళితే అతను ఏమన్నా సహాయం చేస్తాడని వాళ్ల అభిప్రాయం.

"ఐతే దారి తెలియదుగా ఎట్లా?" అని కొండల్ భీమ్‌ని అడిగాడు.

"మనం వెళ్లే ప్రయత్నం చేస్తే దారి దొరుకుతుంది అడుక్కుంట ఎక్కడికైనా పోవచ్చు" అన్నాడు భీమ్.

భీమ్, కొండల్ చాలా దూరం నడిచారు. ఎన్నో గూడాలు దాటాలు. చీకటి పడేసరికి ఒక గూడెంలో ఆగి ఒక రైతు ఇంట్లో రాత్రి గడిపారు. తెల్లారి మళ్లీ ప్రయాణం. భారీలొద్ది చేరడానికి దారి అడుగుతూ నడుస్తున్నారు. దారి పొడుగునా వాళ్లకు ఎన్నో వింతలు కనిపిస్తున్నాయి. రకరకాల మనుషులు కనిపిస్తున్నారు.

ఎలాగైతేనేం భారీలొద్ది చేరారు. చీకటి పడ్డది. ముఖాసీకి చాలా పెంకుటిల్లులు ఉన్నాయి. ఇళ్ల చుట్టూ వెడల్పైన చోటు ఉంది. ఆవులు, గేదెలు, మేకలు ఎన్నో ఉన్నాయి. గడ్డివాములు, పశువుల కొట్టాలు కనిపించాయి. ఆ పశువుల కొట్టాలు భీమ్ వాళ్ల గుడిసెలకన్నా బాగున్నాయి. చాలా మంది జీతగాళ్లు ఉన్నారు. వాళ్లు అన్ని పనులూ చేస్తున్నారు. ఒక వ్యక్తి వచ్చి వీళ్ల వివరాలన్నీ అడిగాడు. రాత్రికి తిండి, పడుకోను చోటూ చూపించాడు. ముఖాసీ మాత్రం ఆ రాత్రి కనిపించలేదు.

తెల్లారి లేచాక రాత్రి వీళ్లను చూసిన వ్యక్తే వచ్చాడు. ముఖాసీ దగ్గరకి తీసికెళ్లాడు. చాలా మంది ఆడవాళ్లు అటూ ఇటూ తిరుగుతున్నారు. వాళ్లు ఏవో పనులు చేస్తున్నారు. "వీళ్లంతా పాలేర్లేనా?" అని అడిగాడు భీమ్ అతన్ని.

"కాదు వీళ్లంతా ముఖాసీ భార్యలు" అన్నాడు ఆ వ్యక్తి.

గోండోళ్లలో ఇద్దరినో లేక ముగ్గురినో చేసుకోవడం పరిపాటి. కానీ, పన్నెండు మంది భార్యలంటే భీమ్‌కి, కొండల్‌కీ ఆశ్చర్యమేసింది.



ముఖాసీ తన నాల్గో ఇంట్లో బల్ల ఊయ్యాల మీద కూర్చున్నాడు. భీమ్, కొండల్ వెళ్లి "రాం... రాం" చెప్పారు.

"రాం... రాం... రండి కూర్చోండి" అన్నాడు ముఖాసీ.

వీళ్లు, వీళ్ల పరిచయం చేసుకున్నారు.

"అవును కొమురం చిన్ను నాకు తెలుసు. అతను మంచి వాడుండె" అన్నాడు ముఖాసీ.

తర్వాత భీమ్ మాట్లాడుతూ అడివిలో బతుకులు జంతువుల కన్నా హీనం గున్నాయనీ చెప్పాడు. బాధలన్నీ వివరించాడు. జంగ్లాత్ వాళ్లు, తెల్లబట్టల షావుకార్లూ ఎలా వేటాడి చంపుతున్నారో చెప్పాడు. "మేం బతికే చోట మాకే అధికారం లేదు. దున్నుకోను భూమి లేదు. ఎంతో కష్టపడి భూమి సాగుచేస్తే ఎవ్వడో వస్తాడు. ఆ భూమి తన పట్టా అంటాడు. మీ గురించి మా నాన్న చెప్పేవాడు. ఇంకా మోతీరాం తాత చెప్పాడు. మాలాంటి వాళ్లకు మీరే దిక్కు. మీరు సరేనంటే మేము అన్ని గూడాల జనాలను ఒక్కటి చేస్తాం. ఈ తెల్లబట్టలోళ్లకూ, ఈ సర్కారుకూ రాంజీగోండు చెప్పినట్టు బుద్ధి చెపుదాం" అన్నాడు ఉత్సాహంగా.

"మీ బాధలు నాకు తెలుసు. ఏం చేస్తాం మరి? సర్కారుకు జంగల్ మీద లాభాలు కావాలి. జంగ్లాత్ వాళ్లు అవి తెచ్చి ఇవ్వాలి. వాళ్లు మాత్రం ఎక్కడి నుండి తెస్తారూ? గిరిజనుల మీద పడేగదా? ఇలాంటి సర్కారును ఎదిరించాలంటే మాటలా? భీమ్ నీది ఉడుకు నెత్తురు. తొందరపడకు. చిన్నవాడివి. ఇప్పటికే సిద్ధిక్‌ని చంపి సర్కారు నిగలో (దృష్టిలో) ఉన్నావు. ఏదో సర్దుకొని వెళ్లాలి కానీ, ఇలాంటి అఘాయిత్యం పనులు చెయ్యొద్దు. రాంజీ గోండులాగా పోట్లాడడం మనతో అయ్యే పనేనా? కాదు. నాకు మాత్రం అంత గుండె లేదు" నిదానంగా చెప్పాడు ముఖాసీ.

ఇతను ఒక గోండువాడై ఇలా మాట్లాడడం వింతగా తోచింది భీమ్‌కి. అదీ చాలా పెద్ద మనిషి. ముఖాసీ ఇంత చేవ చచ్చి మాట్లాడతాడనుకోలేదు. తనకు ఇంకా అక్కడ నిలవాలని లేదు.

"ఇక మేం వెళతాం... రాం... రాం.." అంటూ లేచాడు. కొండల్ కూడా లేచి నిలబడ్డాడు.

"వెళతారా వెళ్లండి. మళ్లీ అడివి నరకండి. బతకడం నేర్చుకోండి" అన్నాడు చివరగా ముఖాసీ.

'బతకడం నేర్పవలసింది నువ్వు కాదు మాకు. మా బాధలు నీకేం తెలుసు?'



తన మనసులో అనుకున్నాడు భీమ్. ఇద్దరూ బయలు దేరారు.

* * *

ముఖాసీ ఉండే ఊరు విడిచి పెట్టారు. భీమ్, కొండల్ వాళ్లకు కనిపించిన బాటలో నడుస్తున్నారు. ఎటు వెళ్లాలో వాళ్లకే తెలియదు. ఏం చేయాలో తోచదు. నడుస్తున్న వాళ్లకు గ్రామాల ప్రజల కట్టుబొట్టులో మార్పు కనిపించింది. కొందరు స్త్రీలు వీళ్ల గూడాలలో మాదిరిగా కాకుండా జాకెట్లు వేసుకున్నారు. తలకొప్పులు కూడా మరో తీరు కట్టారు. భాషా మారింది.

ఇంకా ముందుకు నడిచారు. వాళ్లిద్దరికీ ఆకలేస్తోంది. పొద్దు పడమరకి తిరిగింది. ఎవరన్నా నాలుగు ముద్దల గటక పెడితే బాగుండుననీ, రెండు రొట్టెలిస్తే బాగుండుననీ అనుకున్నారు. ఒక బావి దగ్గర నీళ్లు తాగారు. అక్కడున్న రైతుతో...

"చేయడానికి ఏదన్నా పని దొరుకుతుందా?" అడిగారు.

"ఊళ్లోకెళ్లి పట్వారి నడగండి" అన్నాడు అతను.

వీళ్లు వెళ్లారు. పట్వారిని కలిశారు. అతను వీళ్లు దొంగలేమోనని అనుమానపడ్డాడు. వాళ్లతో ఇంట్లోకి వంట చెరుకుగా వాడుకునేందుకు కట్టెలు కొట్టించాడు. ఇంత గంజి పోసి వెళ్లిపొండని తరిమేశాడు.

భీమ్‌కి, కొండల్‌కి మనుషులు మనస్సుల తీరు విచిత్రంగా తోస్తూంది. 'ఒంటి మీద గుడ్డలు సరిగా లేవు మాకు. మేమెట్లా దొంగలమౌతాం? ఐనా తెల్లబట్టలోళ్లు కదా దొంగలూ?" అనుకున్నారు.

ఆ ఊరు విడిచి పెట్టారు. ఇంకా ముందుకు నడిచారు. దగ్గరలో ఓ పెద్ద ఊరు కనిపించింది. బలార్షా, మేడలున్నాయి. రోడ్డు కూడా కనిపించింది. భీమ్‌కీ, కొండల్‌కీ చాలా ఆశ్చర్యంగా ఉంది. ఇంత పెద్ద మేడలు, పెద్ద పెద్ద దుకాణాలు ఎప్పుడూ చూడలేదు. వింత వింత బట్టలతో మనుషులు, రకరకాల వాహనాలు బలేగా ఉంది. దగ్గరలోనే వాళ్లు రైలు పట్టాలు చూశారు. అది మరీ వింతగా ఉంది. కొత్త ప్రదేశంలో కొత్త మనుషులను చూస్తూ నిద్రా, ఆకలీ మరిచిపోయారు. అలా రైల్‌స్టేషన్‌లో కూర్చుండి ఉన్నారు. చాలా సేపటికి ఓ రైలు వచ్చింది. అందరూ రైల్లో ఎక్కుతున్నారు. అది కదులుతోంది. "నడవడమెందుకూ మనమూ ఎక్కుదాం" అన్నాడు కొండల్. ఇద్దరూ రైలెక్కారు. అది వేగం పుంజుకుంది.

రైలు నడక, పరుగు, ఆ చప్పుడు, దాని ఊయల కుదుపు బలేగా ఉంది ఇద్దరికీ. భీమ్‌కి నిద్రొస్తోంది. కొద్ది సేపు కునుకుతీశాడు. మళ్లీ కళ్లు తెరిచి రైల్లో



ఉన్న వాళ్లనూ, వాళ్ల మాట తీరునూ గమనించసాగాడు.

రైలు ఆగింది. అందరూ దిగుతుంటే వాళ్లూ దిగారు. దిగి తమాషాగా ఉంది రైలు అనుకున్నారు. ఒక వ్యక్తి వచ్చి టికెట్ అడిగాడు. అతనే మడుగుతున్నాడో ముందు అర్థం కాలేదు. తర్వాత తెలుసుకొని మా దగ్గర డబ్బులు లేవన్నారు. అతను టి.సి. ఇద్దర్నీ తిట్టాడు. తన వెంట తీసుకెళ్లి పోలీసులకు అప్పగించాడు.

పోలీసులు వీళ్లను అసలెవరు మీరని నిలదీసి అడిగారు. వీళ్లు గోండులమని చెప్పారు. పోలీసులు ఇద్దరి జేబులు తడిమి డబ్బుల కోసం వెదికారు. ఏమీ దొరకలేదు. ఇద్దరూ చవటల్లా ఉన్నారనీ కోపంతో కర్ర పుచ్చుకొని రెండేసి తగిలించారు. వెళ్లిపోండని నెట్టేశారు. "దెబ్బలు తింటే తిన్నాంగానీ, రైలు బండి ఎక్కాం" అన్నాడు కొండల్. ఓ ప్రయాణికుడు తనతో తెచ్చుకున్న వస్తువులు మోయలేక బాధపడుతున్నాడు. భీమ్ అతని దగ్గరికెళ్లి 'నేను మోయనా?' అని అడిగాడు. అతను ఆ బరువులు అందించాడు. ఆ ప్రయాణికుని ఇల్లు చేరారు. మూటలు దించిన భీమ్, కొండల్‌కి ఆ ఇంట్లో కొంత మంది కనిపించారు. వాళ్లంతా యంత్రాలు తిప్పుతున్నారు. అవి అచ్చుయంత్రాలు. ఇక్కడ ఏదన్నా పని దొరుకవచ్చుననే ఆశ భీమ్‌లో కలిగింది. వాళ్లను ఇక్కడికి తీసుకొచ్చిన ఆ ప్రయాణీకునితో పని కోసం అడిగాడు. అతనికీ వీళ్ల అవసరం ఉంది, వీళ్ల భాషా కొంచెం తెలుసు కాబోలు. వీళ్ల అమాయకత్వం అర్థమయ్యే ఉంటుంది. 'సరే పని ఇస్తా'న్నాడు. అతను ఆ ప్రింటింగ్ ప్రెస్ యజమాని. పేరు 'విటోబా'.

నైజాం సర్కారుకు, తెల్ల దొరలకు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తున్న వాళ్లతో విటోబాకి రహస్య సంబంధాలు ఉన్నాయి. రహస్యమైన ఆ పార్టీ దెబ్బకు దెబ్బ తీస్తూంది. డాక్టరు చేసే ఆపరేషన్ హింస కాదని చెబుతుంది. అదిగో అట్లాంటి పార్టీతో ఉన్న విటోబా రహస్యంగా పత్రిక నడిపేవాడు. ఇది తెలిసిన కొమురం భీమ్, విటోబా చాలా మంచివాడని అర్థం చేసుకున్నాడు. అక్కడే కొంత కాలం ఉండాలని నిర్ణయించుకున్నాడు.

కొమురం భీమ్ ఆలోచనలు వేరు. ఆవేదన వేరు. అందుకు కొండల్ పూర్తిగా సంసిద్ధత చూపకున్నాడు. అందుకే ఇదంతా ఎంతకాలమనీ, తాను ఇక్కడ ఉండలేననీ అనుకున్నాడు. బాధ పడుతూ భీమ్‌తో చెప్పాడు కూడా. అందుకు భీమ్ 'సరే నీవు ఇంటికి వెళ్లిపో' అన్నాడు. మరునాడే అతన్ని మళ్లీ రైలు ఎక్కించాడు.

విటోబా దగ్గరే ఒక సంవత్సరం వరకున్నాడు భీమ్. అక్కడే తెలుగూ, హిందీ, ఇంగ్లీషు చదవడం, రాయడం నేర్చుకున్నాడు. విటోబా రోజూ భీమ్‌కి ఏదో ఒక

సమయంలో చదువు చెప్పేవాడు. రాజకీయాలు పరిచయం చేసేవాడు. విటోబా ఎప్పుడూ ఏదో ఆలోచించడం భీమ్ గమనించాడు. ఈ సమాజం మారాలి అనడం, అందుకు ప్రతివాడూ త్యాగం చేయాలి అనడం అతని ఊతపదాల్లా ఉండేవి.

ఒక రాత్రి చాలా మంది పోలీసులు వచ్చి విటోబాని పట్టుకున్నారు. అచ్చు కాగితాలు తీసికెళ్లారు. అతన్ని అరెస్టు చేశారు. కొమురం భీమ్‌నీ పట్టుకెళ్లి ఎవరు నీవని అడిగారు. ఒక రోజు తర్వాత తన్ని తరిమేశారు.

మళ్లీ కొమురం భీమ్ రోడ్డున పడ్డాడు. "విటోబాని కాల్చి చంపేస్తారేమో! ఉరి తీస్తారేమో!" ఇలా ఊహిస్తూ ఎంతో బాధకు లోనయ్యాడు భీమ్. కానీ, తానూ ఏమీ చేయలేడుగా!

రోజంతా రైల్వేస్టేషన్‌లో దిగాలుగా కూర్చున్నాడు భీమ్. ఎవరో నైజాం ప్రాంతపు మనిషి కలిశాడు. అతను తనది 'మంచిర్యాల' అని చెప్పాడు. తెలుగువాడు. తాను బతుకుదెరువు కోసం 'ఛాయపత్తా' దేశం వెళుతున్నట్టు చెప్పాడు. అక్కడ చేసిన కష్టానికి కూలీ బాగా ఇస్తారనీ చెప్పాడు. భీమ్ ఇక మరో యోచనే చేయలేదు. అతనితో 'ఛాయ్‌పత్తా దేశం' వెళ్లడానికి రైల్ ఎక్కాడు. అతను వెళుతున్నది 'అస్సాం'.

* * *

కొమురం భీమ్ అప్పుడు సుర్దాపూర్ వదిలేశాడు గదా!! అక్కడ ఉన్న చిన్నాయనలు, అన్నలు చెల్లాచెదురయ్యారు.

కుర్దు ఆ రాత్రే బండ్లు కట్టుకొని కాలిపోగా మిగిలిన సామానులు తీసుకొని బయలుదేరాడు. కేరెమెరీ అడవుల మీదుగా పంగడిరాజు జంగుబాబు దగ్గరికి వెళ్లిపోయాడు. పంగడిలో జంగుబాబు రాజుల సంతతి వాడు. పూర్వమెప్పుడో అక్కడ గోండు రాజ్యముండేది. ఇప్పుడు లేకున్నా జంగుబాబుకి భూములున్నాయి. కుర్దుని జంగుబాబు ఆదరించి భూమి చూపించాడు. కానీ, పండిన పంటలో సగం తనకు ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నాడు. కుర్దు ఇక ఒప్పుకోకతప్పింది కాదు.

కుర్దు అటువెళ్లిపోగానే కొమురం భీమ్ అన్నలు ఇంకా అక్కడే ఉండలేదు. వాళ్లూ బయలుదేరి కలన్‌వాడి (మహారాష్ట్ర) వెళ్లిపోయారు. పొట్టచేత పట్టుకొని.

ఇక మిగిలింది యేసు. అతనూ ధనోరా వైపు నడిచివెళ్లి మళ్లీ అడివి చూశాడు. అది ఏ పట్టేదారు భూమి కాదని తెలుసుకొని చెట్లు నరికాడు. రాళ్లూ రప్పలు ఏరి, పొదలూ ముళ్లు తగులపెట్టి భూమి సాగు చేశాడు. వానా కాలం వచ్చింది. విత్తనాలు వేశాడు. చేనూ ఏపుగా ఎదిగింది. అంతే మళ్లీ గుర్రాల మీద అమీన్ సాబ్, చౌకీదార్,

సెహరేదార్ రానేవచ్చారు. మళ్లీ కొట్లాట జరిగింది. యేసును కొట్టారు. ఐనా యేసు అక్కడే ఉన్నాడు. కోర్టుల చుట్టూ తిరుగుతున్నాడు.

మళ్లీ దుక్కులు దున్నినాడు. పంట పండించుకున్నాడు. జంగ్లాత్ వాళ్లు వచ్చారు. ఇబ్బందులు పెట్టారు. ఈసారి ఎకరాకు నూరు రూపాయలు లంచం అడిగారు. యేసుకి మరో మార్గం తోచలేదు. 'సరే' అన్నాడు. అంతేగాక జంగ్లాత్ వాళ్లు గూడెం వచ్చినప్పుడల్లా కోళ్లూ, మేకలు పట్టుకెళుతున్నారు. ఇలా నెలలు గడుస్తున్నాయి. సంవత్సరాలు గడుస్తున్నాయి.

* * *

తేయాకు తోటల్లో అడుగుపెట్టాడు కొమురం భీమ్. అక్కడ తనలాగే ఎంతోమంది కార్మికులు. రకరకాల మనుషులు. తాను పుట్టి కొంచెం బుద్ధి తెలిసిన గూడెం మొదలు ఈ ఛాయ్‌పత్తా దేశం వరకు వందల అనుభవాలు ఎన్నో యోచనలు. కష్టాలు కన్నీళ్లు, అన్నీ నెమరేసుకుంటున్నాడు. దేశమంతా తిరిగినా పేదలు పేదలే. ధనికులు ధనికులే. ఎక్కడ చూసిన కష్ట జీవులకు బాధలు తప్పడం లేదు. కష్టపడేవానికి కడుపే నిండకుంది.

భీమ్ ఆలోచిస్తూ తేయాకు తోటల్లో వంచిన నడుము ఎత్తకుండా పనిచేస్తున్నాడు. రోజు కూలీ పద్ధతి. ఇస్తే అర్ధ రూపాయ కూలీ ఎక్కువిస్తారేమోకానీ, కష్టజీవుల మూల్గులు పీల్చే పని అది. నుదుటికున్న చమట తడ్చుకోను లేచినా తప్పే. కొరడా దెబ్బ ఛళ్లున వీపును చీరేస్తుంది. గుర్రాల మీద తిరిగే మేస్త్రీలు పనివాళ్ల నెత్తురు కళ్ల చూస్తారు. అక్కడ కష్టపడేవాళ్ల ముఖాలు పీక్కుపోయి ఉంటాయి. ఎముకలు తేలి ఉంటాయి. ఎదలు ఎండి పోయి కనిపిస్తాయి. ఒంటి శక్తి రోజు రోజుకీ నశిస్తుంది. ఎంతో మంది విషజ్వరంతో చచ్చిపోతుంటారు. అంత మంది చచ్చినా అక్కడి యజమానికి ఏ మాత్రం కూలీల కొదవ ఉండదు. మరునాడే ఇంకా కొత్తవాళ్లు వచ్చి పనిలో చేరిపోతారు. అక్కడ ఆకలి చావులూ అధికమే. చేసిన కష్టం మందులకూ, మాకులకూ సరిపోను తిండికి ఏమీ మిగలదు.

అక్కడే తేయాకు పండించే చోట; ఆ అస్సాం దేశంలో కొమురం భీమ్ నాలుగు సంవత్సరాలకు పైగా ఉన్నాడు.

ఒక రోజు రాత్రి నిద్రపోయే సమయం. ఈ మధ్యే కొత్తగా వచ్చిన మన్నెం దొర దగ్గర కూర్చున్నాడు భీమ్. అతను తెలుగు మాట్లాడుతున్నాడు. ముఖంలో, మీసాల్లో తెలుగుతనం ఉంది. ధైర్యంగా, గొంతెత్తి మాట్లాడే అతన్ని "మన్య ప్రాంతం ఎక్కడుంది?" అని అడిగాడు భీమ్.

అతను మీసం మెలి తిప్పాడు. ఎంతో అందంగా నవ్వాడు. “నువ్వూ తెలుగువాడివేనా? ఐతే నైజాం నవాబు రాజ్యం తెలియదా అక్కడే ఉంటుంది మన్నెసీమ. అక్కడ జరిగిన గిరిజన తిరుగుబాటు గూర్చి వినలేదా? మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు కథ తెలియదా?” అని అడిగాడు.

కొమురం భీమ్ తనకేమీ తెలియదన్నాడు. మీరు చెపితే వింటాననీ అన్నాడు. భీమ్ ఒక్కడే కాదు. ఇంకా చాలా మంది కార్మికులు ఆ మన్నెం దొర చుట్టూ కూర్చున్నారు. భీమ్ అతన్ని అల్లూరి సీతారామరాజు కథ చెప్పమని మళ్లీ అడిగాడు.

మన్నెం దొర చెప్పసాగాడు.

“మేం అడివిలో పుట్టి అడివిలో పెరిగాం. మా తాత ముత్తాతలు అడివిలోనే పుట్టి అడివిలోనే చనిపోయారు. మేమంతా అడివి నరికి పోడు వ్యవసాయం చేసేవాళ్లం. అడివి జంతువుల్ని వేటాడి తినేవాళ్లం. అడివిలో దొరికే పండ్లూ, ఫలాలు, తేనె అన్నీ అడివి తల్లి మాకిచ్చిన సంపద. ఇట్లాంటి మా బతుకుల్ని కాలితో నలిచేయడానికి తెల్లదొరలొచ్చారు. వాళ్లు వచ్చిందే మొదలు అడివి మీద మా ఆశలు అడుగంటాయి. మా తల్లికి మమ్ముల్ని దూరం చేయచూశారు. కొమ్మ వంచినా తప్పే. ఆకు తెంపినా తప్పే. కొమ్మ వంచితే కాళ్లు నరుకుతున్నారు. ఆకు తెంపితే చేతులు నరుకుతున్నారు. బందిఖానాల్లో బంధించి వేస్తున్నారు. మా మనుషుల్ని బలవంతంగా పట్టుకెళ్లి బానిసలుగా చేస్తున్నారు. పనులు చేయించుకుంటున్నారు. ఇదంతా చాలా అన్యాయమన్నాడు. వ్యవసాయమే మా జీవనోపాధి అన్నాడు. అడివి సంపద మా సొంతమనీ చెప్పాడు. వేటాడడం మా జన్మ హక్కు అనీ అన్నాడు. అంతేగాదు మా బతుకులకు అడ్డం తగిలితే పోరాటం మా హక్కే అన్నాడు అల్లూరి సీతారామరాజు.

గ్రామ గ్రామం తిరిగాడు. గూడెం గూడెం నడిచాడు. అడివి తల్లిని పరాయిచెర నుండి విడిపించాలన్నాడు. అందరూ నడుం కట్టండి అని వెన్ను తట్టి లేపాడు. గిరిజనులంతా మేలుకున్నారు. అడివి మాదనీ, ఇందులోకి వచ్చే అధికారం ఎవ్వరికీ లేదనీ ప్రకటించాం.

భీమ్ సంతోషంగా అందరి దిక్కూ చూశాడు. మన్నెం దొర చెపుతూనే ఉన్నాడు.

“అంతే ఇక అప్పుడేమైంది? తెల్లవాళ్లు నిద్రలు పోలేదు. వాళ్ల పునాదులు కదిలిపోతున్నాయి. ఇంకా ఊరుకోలేదు. వెంటనే పోలీసుల్నీ, సైన్యాన్నీ అడివిలోకి పంపించారు. మేం తక్కువ తిన్నామా? వచ్చిన తెల్ల దొరల మనుషుల్ని వచ్చినట్టే నరికేశాం. మాకు పొదలూ, చెట్లూ, గుండ్లూ, బండలూ అన్నీ అండగా నిలిచాయి.

లోయల్లో నుండి కొండచరియల్లో నుండి దాడి చేశాం. వాళ్లను వెనక్కి పంపించేశాం. మా ధాటికి నిలువలేక వాళ్లు వచ్చిన దారి పట్టారు.”

“వాళ్లకు తుపాకులున్నాయి గదా! మీరెట్లా తట్టుకున్నారు?” అడిగాడు భీమ్. “ఉంటే ఏంది? మన బాణాల ముందు, మన బరిశెల ముందు ఆ తుపాకి ఒక లెక్కా! నలుగురు నిలబడి తుపాకులతో ఒక దిక్కుసూటి చూస్తున్నారనుకో! ఇంకో దిక్కుగా మనం ఎత్తు నుండి పెద్ద గుండు ఎత్తేస్తే ఆ తుపాకులు తుస్సుమనేయి. అయినా మనమూ తుపాకులు సంపాదించాం. ఎట్లా అంటావా!? మన శత్రువే మనకు అవి ఇచ్చాడు. ఏం లేదు. పోలీసు స్టేషన్ల మీద దాడి చేశాం. పోలీసు క్యాంపులు చితకగొట్టి ఆయుధాలు సొంతం చేసుకున్నాం. కొన్ని మేమే తయారుచేశాం.

సీతారామ రాజు యువకులందరికీ ఎలా కొట్లాడాలో తర్ఫీదు ఇచ్చాడు. ఎలా ఎదుర్కోవాలో చూపించాడు. శత్రువుని చికాకు పరిచే విధానం, ఓడించే తీరు అర్థం చేయించాడు. ప్రతి గ్రామంలో మన మనుషుల్ని ఉంచాడు. అక్కడి సమాచారం రహస్యంగా అందే ఏర్పాటు చేశాడు. మా రాజ్యం మేమే ఏలుకుంటాం అన్నాం.

అడివిలో కొచ్చిన తెల్ల సైన్యాన్ని ఊపిరి సలుపనీయలేదు. దెబ్బ మీద దెబ్బ తీశాం. వాళ్లలో భయం పుట్టించాం. ఇంగ్లీషు దొరలు గజగజ వణికిపోయారు. ఇక దేశం విడిచి వెళ్లిపోక తప్పదనుకున్నారు. కుయుక్తులు పన్నారు. కుట్రలు చేశారు. సీతారామరాజును చంపనిదే లాభం లేదనుకున్నారు. ఇక్కడి నుండి ఇంగ్లాండు వరకు మంతనాలు సాగినాయి. వీరుడు మోసం చేయడు. పిరికి పందలు మోసగిస్తారు. దొంగతనంగా రామరాజును బంధించారు. ఐనా వాళ్ల ముందు తల వంచలేదు. ప్రాణభిక్ష యాచించలేదు. వీరుడు వీరుడే. నా వాళ్లను చిత్రహింసలు పెట్టడం కాదు. నన్ను కాల్చండిరా అని గుండెలు వాళ్ల ఫిరంగుల ముందు ఉంచాడు. నా ఒక్క నెత్తురు బొట్టు రాలితే నాలాంటివాళ్లు వెయ్యి మంది పుట్టుకొస్తారు అన్నాడు. ఈ రోజు సీతారామరాజు లేడనుకుంటారు ఇంగ్లీషువాళ్లు. అతను ప్రతి అడివి మనిషి గుండెల్లో మేల్కొని ఉన్నాడని చూడలేరు. మనం మనుషులుగా బతకాలంటే అడివి మనది కావాలి. అడివిలో మన రాజ్యం మనం ఏలుకోవాలంటే యుద్ధం చేయాలి. తప్పదు. అదే అల్లూరి సీతారామరాజు మనకు ఇచ్చిన అమర సందేశం.” అంతా నిశ్శబ్దంగా ఉన్నారు. కథ పూర్తి చేశాడు మన్నెం దొర. కొమురం భీమ్‌కి ఇంకా వినాలని ఉంది. వివరాలు తెలుసుకోవాలని ఉంది.

ఆ తర్వాత కొన్ని నెలలు గడిచాయి. తేయాకు తోటల యజమానుల బంటులు

మేస్త్రీలు, అమాయకులైన కార్మికుల్ని బాగా వేధిస్తున్నారు. హింసిస్తున్నారు. ఒకనాడు తోటలో పనిచేస్తున్న కార్మికుల్ని ఇద్దరు మేస్త్రీలు కొరడాలతో కొడుతున్నారు. అర్థం పర్థం లేకుండా అలా వాళ్లను కొట్టడం భీమ్‌కి బాధగా ఉంది. అడ్డు వెళ్లి కారణం అడిగాడు. వాళ్లు భీమ్ మీదకూ ఆ కొరడా లేవనెత్తారు. భీమ్‌కి కోపం ముంచుకొచ్చింది. వాళ్ల కొరడాలే లాక్కొని ఆ మేస్త్రీలను ఇద్దరినీ చితక కొట్టాడు. వాళ్లు కుయ్యోమొర్రో అని ఏడుస్తూ వెళ్లారు. యజమానికి చెప్పారు. యజమాని చాలా మంది పోలీసుల్ని పంపించాడు. వాళ్లు వచ్చి భీమ్‌తో సహా సుమారు ఇరవై మంది కార్మికులను బంధించారు. బాగా కొట్టి, తన్ని జైల్లో వేశారు.

మూడు రోజులు గడిచాయి. నాల్గోనాడు జైల్లోనే ఉన్న మరికొందరు ఖైదీల సహాయంతో ఇనుప చువ్వలు వంచాడు. జైల్లో నుండి బయటకొచ్చాడు. ఇనుప చువ్వలే వంచిన భీమ్‌కి ప్రహరీ గోడ అడ్డమా?! దూకేసి బయట పడ్డాడు. ఎవరూ చూడలేదు. చాలా దూరం నడిచి నేరుగా రైల్వేస్టేషన్‌కి వచ్చాడు. అక్కడ సిద్ధంగా ఉంది ఓ గూడ్స్ రైలు బండి. ఏదో ఒకటి అనుకున్నాడు. ఒక డబ్బాలో దూరి అలా పడిపోయాడు. నిద్ర పట్టేసింది. లేచి చూస్తే తాను చేరుకున్నది బలార్షా అని తెలిసింది.

బలార్షాలో కొన్ని రోజులు మూటలు మోస్తూ కాలం గడిపాడు. అక్కడే ఇంకా ఉండదలుచుకోలేదు. తన జనం, తన గూడాలు, తన కొండలు, తన అడివి పిలుస్తున్నట్టుగా అనిపించింది. బలార్షా వదిలేశాడు. రాజోరా మీదుగా అడివి దిక్కు ప్రయాణం సాగించాడు. చీకటి పడ్డాక అడివిలో ఒక గూడెంలో పడుకున్నాడు. అక్కడే ఎవరో గోండు చెప్పాడు. తన అన్నలు కాకన్ ఘాట్‌లో ఉంటున్నారని.

పక్షులు గూళ్లకొస్తున్న సమయం. పశువులు దొడ్లను చేరుతున్న సమయం. చెట్ల నీడలు భూమిలోకి ఇంకుతున్న సమయం. ఆ సమయంలో కాకన్‌ఘాట్‌లో ఉన్న అన్నల గూడెం చేరాడు కొమురం భీమ్. సోము ఇల్లు అడిగితే ఎవరో చూపించారు. గుడిసె ముందుకెళ్లే సరికి వదిన కుకూబాయి ఎదురొచ్చింది. భీమ్‌ని చూసి విస్తుపోయింది. నిండు యవ్వనంలో బలిష్టంగా ఉన్న భీమ్ నిజంగా అప్పటి కొమురం భీమేనా! అనుకుంది. పూర్ణచంద్రుడిలా, ఉదయ సూర్యుడిలాగా ఉన్నాడు భీమ్. సంతోషంతో వదిన కళ్లు చెమ్మగిల్లాయి. నోట మాట రాలేదు. లోపలి కెళ్లి మంచంలో పడుకున్న అత్తను లేపింది. భీము వచ్చాడని చెప్పింది. తల్లి కొడుకును పట్టుకొని ఏడ్చింది. ఆమె చావు దగ్గరైంది. ఇక వదిన ముఖంలో అప్పటి కళే లేదు. ఎముకలు తేలి ఉన్నాయి. నల్లబడింది.

"భీమ్. మళ్లీ ఇటు ఎందుకొచ్చావ్? ఆకలీ, దరిద్రం లేని చోట నువ్వు హాయిగా ఉంటే అంతే చాలు అనుకున్నా!" అంది వదిన.

వదినను చూడగానే ఏదో ఆత్మీయత, అమ్మలాంటి అనురాగం. ఆమె చెప్పిన కథలు. పాడిన పాటలు అన్నీ గుర్తుకొచ్చాయి. ఎంతో మాట్లాడాలనుకున్నాడు. ఏమీ మాట్లాడలేకపోతున్నాడు. అయినా...

"గోండోళ్లకు ఆకలీ, దరిద్రం లేని చోటంటూ ఉందా వదినా?" అన్నాడు.

భీము అక్కడున్న పిల్లల్ని తన దగ్గరకు రమ్మని పిలిచాడు. వదిన తన ఇద్దరు కొడుకులతో, పాపతో "మీ చిన్నాన్నరా! వెళ్లండీ" అంది. వాళ్లు భీమ్ ఒడిలో చేరారు.

రాత్రి అంబలి తాగినంక తమ్ముని వివరాలన్నీ అడిగారు అన్నలిద్దరూ..., భీమ్ అన్నీ చెప్పాడు. పడ్డ కష్టాలు వివరించాడు. అన్నలిద్దరూ ఆశ్చర్యపోయారు. తర్వాత భీమ్ ఇక్కడి విషయాలు అడిగాడు. కుర్దు, యేసు ఎక్కడున్నదీ కనుక్కున్నాడు. కొండల్ ఏమి చేస్తున్నదీ తెలుసుకున్నాడు. మిగతా మిత్రుల్ని పేరు పేరునా అడిగి ఎలా ఉన్నారో ఊహించుకున్నాడు.

మరునాడు భీమ్‌ని అన్న సోము దగ్గరలో ఉన్న ఊరు దేవడం తీసికెళ్లాడు. దేవడం పెద్ద లచ్చు పటేల్.

లచ్చు పటేల్ దగ్గర జీతం కుదిరిన భీమ్ అతని పంట పొలాల్లో మార్పు తెచ్చాడు. పత్తి, మిరపలాంటి వ్యాపార పంటలను పరిచయం చేశాడు. పటేల్ సంతోష పడిపోయాడు. భీమ్ తెలివిపరుడనీ, వ్యవహారాలు అన్ని చక్కపెట్టగల నేర్పరి అనీ అనుకున్నాడు. కొన్ని నెలలు గడిచాయి.

ఒక రోజు భీమ్‌ని రమ్మని పిలిచాడు లచ్చు పటేల్. తన భూమిని ఆనుకొని ఉన్న భూమి చూపించి... "అది పన్నెండు ఎకరాల భూమి. అది ముందు పోరంబోకు. దాన్ని సాగు చేయించాను. అలా చేయిస్తున్నట్టుగా ముందే జంగ్లాత్ వాళ్లకు చెప్పాను. డబ్బులిచ్చాను. చౌకీదారుకీ, సేరెదారుకీ చాలా డబ్బు తగిలేశాను. తర్వాత అడివి తనిఖీ (చెకప్) కని అమీన్‌సాబ్ వచ్చాడు. నా మీద కేసు పెట్టాడు. ఈ కేసు మన మీద ఉండకూడదు. నాకు ఉర్దూ రాదు. నువ్వు జనగామ (ఆసిఫాబాద్) వెళ్లి అమీన్‌తో మాట్లాడాలి. ఈ పొలం మనకు వచ్చేలా చూడాలి. ఖర్చులు నేను పెట్టుకుంటాను" అన్నాడు.

జరిగినదంతా విని, అర్థం చేసుకున్నాడు భీమ్. ఈ వ్యవహారం అంతు చూద్దామని బయలుదేరాడు.



జనగామ వెళ్లి అమీన్‌సాబ్‌తో కలిశాడు కొమురం భీమ్. తను లచ్చుపటేల్ మనిషిననీ చెప్పాడు. తను చాలా దేశం తిరిగివచ్చాననీ చెప్పి అతన్ని కబుర్లలో దించాడు. ఉర్దూ బాగా మాట్లాడుతున్న భీమ్‌ని చూసి అమీన్ (ఫారెస్ట్ ఇన్‌స్పెక్టర్) కొంచెం మర్యాద ఇచ్చాడు. భీమ్ లచ్చుపటేల్ పంపించిన విషయం చెప్పాడు. అమీన్‌సాబ్ ఆ ఫైల్ తెప్పించి చూశాడు. లచ్చుపటేల్‌తో మంచిగా ఉండాలనుకున్నాడు. గోండులను అడివి నరకకుండా ఆపాలంటే లచ్చుపటేల్‌కి గాలం వేసి ఉంచాలి. కనుక కేసు కొట్టేయడం మంచిదని తను అనుకున్నాడు. "లచ్చు పటేల్‌ది ఇది మొదటి తప్పుగా భావించింది సర్కారు. ఈ కేసులో అతన్ని క్షమిస్తున్నది. ఒకసారి వచ్చి అతన్ని నన్ను కలసిపొమ్మను" అన్నాడు అమీన్‌సాబ్.

భీమ్ ఉపాయం పండింది. లచ్చు పటేల్ భీమ్‌ని తెగ మెచ్చుకున్నాడు. ఈ విషయం ప్రతి గ్రామానికి పాకింది. ఎందరో భూముల తగాదాలు తీసుకొని భీమ్ దగ్గర కొచ్చారు. భీమ్ మళ్లీ అమీన్‌సాబ్‌ని కలిశాడు. అతను తిట్టి పంపించాడు.

లచ్చు పటేల్ భూముల వ్యవహారాలు ముందు నుండీ చేసే మరో వ్యక్తి అంబతిరావు. అంబతిరావుకు సోంబాయి అనే కూతురు ఉంది. సోంబాయిని భీమ్ కిచ్చి పెళ్లి చేస్తే బాగుంటుందని లచ్చుపటేల్ అంబతిరావుని అడిగాడు. సోమూా, బొజ్జులను పిలిపించి విషయం చెప్పాడు. వాళ్లు "సరే కానీయండి" అన్నారు. భీమ్ ఒప్పుకున్నాడు.

కొమురం భీమ్, సోంబాయిల పెళ్లి దేవడంలో లచ్చు పటేల్ ఆధ్వర్యంలో జరిగింది. గొప్పగా చేశారు. వదినలు కుకూబాయికి, రాధాబాయికి తోడికోడలు వచ్చింది. భీమ్, సోంబాయితో కాకన్‌ఘాట్‌లో కాపురం పెట్టాడు.

* * *

అటు పంగడిలో ఉండలేక పోయాడు కుర్దు. సకుటుంబంగా తన తమ్ముడు యేసు దగ్గరకి ధనోరా వచ్చాడు. మళ్లీ అడివి నరికి భూమి సాగు చేసుకోవాలనే తలంపు ఉంది అతనికి. గూడాలు తిరిగి చూశాడు. బాబేఝరీ లొద్ది అంచున మంచి సాగు భూమి ఉంది. ఇప్పుడు తానొక్కడే కాకుండా చాల మందిని ఏకం చేశాడు. బాబేఝరీ గుట్టలు గొడ్డళ్ల చప్పుళ్లతో మారుమోగాయి. మనిషి దూరలేని అడవుల్ని నరికి పంట భూములుగా చేశారు.

బాబేఝరి, చల్‌బండి, గోగిన్ మోవాడం, టొయికన్ మోవాడం, భీమన్ గొంది; కల్లేగామ్, మురికిలొంక, అంకుసాపూర్, నర్సాపూర్, దేమ్డీగూడ, జోడెన్‌ఘాట్,



పట్నాపూర్ మొదలగు పన్నెండు గూడాలను పొందించారు. పందిళ్లు వేశారు. అటకలు కట్టారు. మంచెలు నాటారు. లొద్దికి బాటలు తీశారు. బేతాల్ జెండాలు నిలిపారు. జంగుబాయి గుళ్లు తీర్చారు. ఆ విధంగా కొత్త బతుకులు ప్రారంభించారు. కొత్త రుతువూ వచ్చింది.

* * *

కొన్ని నెలలు గడిచాయి. దేవడం నుండి లచ్చు పటేల్ తాలూకు పొగాకు అంగడిలో అమ్మి రావాలి. కొమురం భీమ్ బండి కట్టుకొని పొగాకుతో బయలు దేరాడు. అది రాజోరా అంగడి. ఆ చుట్టుపట్ల గూడాలకు అంగడి వినోద కేంద్రం. అంగడిలో పొగాకు అమ్ముకున్నాడు. డబ్బు మూట గట్టుకొని తిరుగు ప్రయాణం కట్టాడు భీమ్. బండికి ఎడ్లను కట్టి ఇక అదిలించ సిద్ధమయ్యాడు. అంగడిలో ఓ మూలన ఏదో గొడవ జరుగుతుంది. అంగడి పడుచువాళ్లకు విలాస కేంద్రంగా ఉంటుంది. ఆ గొడవ జరుగుతూన్న వైపు వెళదామనుకున్నాడు. మళ్లీ చీకటి పడవస్తోంది వెళ్లాలి గదా అనుకొని బండి ఎక్కి కూర్చున్నాడు భీమ్. ఇంతలో ఒక అమ్మాయి వచ్చింది. గబుక్కున భీమ్ బండి ఎక్కింది.

ఎక్కుతూనే "పోనీయ్ బండి. వాళ్లు నా వెంట పడ్డారు" అంది బెదురుచూపులు చూస్తూ...

ఎడ్లను అదిలించాడు భీమ్. బండి పరుగు దీసింది.

"ఎవరూ నువ్వూ? ఏంది కథా?" అడిగాడు భీమ్.

"నేను అంగడికొచ్చాను. నా తోటి వాళ్లు ఎటో వెళ్లిపోయారు. ఒక్కదాన్ని ఉన్నాని ఆ జంగ్లాత్ జవాన్లు నా వెంట పడ్డారు. అల్లరి పెడుతున్నారు. అందులో ఒకన్ని తన్నినాను. మరొకని దవడ పగిలేశాను" చెప్పింది ఆమె.

"శబ్బాష్! బలే పని చేశావే. చాలా దూరమొచ్చాం ఇక బండి దిగు వాళ్లు ఇక నిన్నేం అనరు. రాజోరా దాటాం గదా" బండి ఆపేశాడు భీమ్.

"బలేవాడివయ్యా! ఇక్కడ ఎలా దిగనూ? మా వాళ్లూ వెళ్లిపోయారు మీదే ఊరూ?"

"మాది దేవడం దగ్గర కాకన్‌ఘాట్. నా పేరు కొమురం భీమ్."

"అబ్బో! నువ్వేనా కొమురం భీమ్ అంటే" మురిసిపోయింది. ఉత్సాహంగా ఊగింది ఆ అమ్మాయి. "నీ గురించి అందరూ చెప్పుకోగా విన్నాను. చాలా దేశం తిరిగొచ్చావటగా! నా పేరు పైకూబాయి. రేపు ఉదయం నేను మా ఊరు వెళ్లిపోతాలే.

బండిపోనీ" అంది మళ్లీ.

భీమ్ బండిని నడిపించాడు.

"నాకు అమ్మా నాన్నా లేరు. చిన్నాన్న ఉన్నా సరిగా చూడడు. నువ్వు నన్ను పెళ్లి చేసుకోరాదూ!? నోతోనే ఉంటానూ!" చాలా సేపు మౌనంగా ఉండి అంది పైకుబాయి.

కొమురం భీమ్‌ని బాగా గమనించింది. అతని ఆకారం. ఆ సూటిచూపులు, సూటిమాట. ఆ విగ్రహ పుష్టి, చలాకీతనం ఆమెకు నచ్చింది. అందుకేనేమో ధైర్యం చేసి అలా అడిగింది.

భీమ్ అయోమయంలో పడ్డాడు. 'దిక్కులేని దానినంటుంది. పైగా ఫారెస్ట్ జవాన్లనే తన్నింది. భలే ధైర్యస్తురాలు. చేసుకుంటే తప్పేముందీ' అనుకున్నాడు.

ఇంటికి వెళ్లగానే సోంబాయితో "సోమీ! నీకు చెల్లెను తెచ్చాను" అన్నాడు. సోంబాయి కొంచెం విస్తుపోయింది. పైకూబాయిని బాగా చూసింది. సంతోషంగా రమ్మని పిలిచింది. గోండు వాళ్ల ఆచారం ప్రకారం ఇద్దరు ముగ్గుర్ని పురుషులు చేసుకోవచ్చు. అది సోంబాయికీ తెలుసు. మరునాడు పైకూబాయిని పెండ్లి చేసుకున్నాడు కొమురం భీమ్.

* * *

వారం రోజులు గడిచాయి. "బాబేఝురీలో గోండులు, కొలామ్‌లు పన్నెండు గ్రామాలను పొందించారు." ఈ వార్త చాలా చోట్లకు పాకింది. అన్ని గ్రామాల ప్రజలు ఉత్తేజం పొందారు. ఈ ఉత్సాహాన్ని మంటగలిపే ప్రయత్నం చేసింది సర్కారు. కుర్దు, యేసుల కష్టం ఫలించలేదు. జంగ్లాత్ వాళ్లు వచ్చి మళ్లీ దాడి చేశారు. ఎందరినో చావ తన్నారు. గూడాలు బూడిద చేశారు. అందరి మీదా కేసులు పెట్టారు. గ్రామస్తులంతా బాధ పడుతుంటే కుర్దు ధైర్యం చెబుతూ... "ఇది మనకు మామూలే! మనం బతకాలంటే ఈ బాధలు తప్పవు. వాళ్లు గుడిసెలను కాలపెడితే మళ్లీ వేసుకుందాం. భయపడవద్దు. వాళ్లు ఎన్ని చేసినా మన భూములను ఎత్తుకుపోలేరు గదా! ఇక కేసులా!? ఉండనీయండి. ఆ సంగతులన్నీ చేసేందుకు మనం లచ్చుపటేల్ దగ్గరున్న మా భీముని ఇక్కడికి తెచ్చుకుందాం. వాడు అన్నీ చక్కపరుస్తాడు" అన్నాడు.

అన్నట్టుగానే కుర్దు, యేసు దేవడం వెళ్లి భీమ్‌తో మాట్లాడారు. భీమ్ తనకు కొన్ని విషయాలు తెలుస్తున్నాయి అన్నాడు. చిన్నాయనలకు వచ్చిన ఆపద ఈనాటిది కాదని అతనికి తెలుసు. నైజాం నవాబు రాజ్యం ఎంత మోసం చేస్తూందో తనకు

అదనంగా చెప్పనవసరం లేదు. ముఖాసీలు రాజభోగాలకు అలవాటు పడ్డారు. ఇక ప్రతి గోండు, కొలామ్ తన పోరాటం తానే చేయాలి.

లచ్చు పటేల్ దగ్గర సెలవు తీసుకున్నాడు భీమ్. అన్నలతో మాట్లాడాడు. వదినలతో చెప్పాడు. తల్లికి చెప్పి, భార్యలను వెంట బెట్టుకొని బయలుదేరాడు.

బాబెఝురీ వైపు వచ్చిన కొమురం భీమ్ టొయికన్ అనే గూడెంలో దిగాడు. అక్కడి పెద్దమనిషి శిడాంగన్ను భీమ్‌కి 'రాం రాం' చెప్పాడు. ఆ కుటుంబానికి గుడిసె ఏర్పాడు చేశాడు. వచ్చిన పది రోజుల్లో ప్రతి గూడెం తిరిగి రైతుల బాధలు విన్నాడు. వాళ్లను జంగ్లాత్ వాళ్లు పెడుతున్న కష్టాలు అర్థం చేసుకున్నాడు. తర్వాత ఏం చేయాలన్నదే భీమ్ ప్రశ్న.

అప్పుడు భీమ్ రెండో భార్య పైకూబాయి భర్తకు గుండె నిబ్బరాన్ని అందించింది. "వీళ్ల బాధలు తీర్చడానికే గదా మనం వచ్చింది. మార్గం మన కళ్ల ముందే ఉంది. కేసులు ఏమీ చేయలేవని చెప్పండి. పన్నెండు గ్రామాల ప్రజలు కష్టించి భూములు దున్నివారు. వాళ్ల కష్టం వాళ్లదే ఐతే పంటలూ వాళ్లే కాపాడుకుంటారు. వాళ్ల నుండి పంటనూ, భూమినీ ఎవ్వరూ గుంజుకోలేరు. మనకు ధైర్యముంటే ఫారెస్టు వాళ్లను పెద్దవాగు దాటి ఇవతలకి రానిస్తామా!? భయం లేదు. చేయవలసిన పని యోచించండి భూములు ఉంటాయా? పోతాయా! అని కాదు. వీళ్ల మీద పెట్టిన ఆ కేసులు ఎంతపాటియో ముందు కనుక్కోండి. ఒక వకీలును నియమిస్తే ఇక వాటి ఊసు మనకుండదు" అని చెప్పింది.

పైకూ చెప్పింది నిజమే అనుకున్నాడు భీమ్. చిన్నాయనతో మాట్లాడాడు.

"ముందు మనకు రాతపూతలు చూసుకొను ఒక వ్యక్తి కావాలి. అతను పట్నాపూర్‌లో 'వావుదం' గ్రామంలో ఉంటాడు. పేరు మహదు. అతనితో కలిసి మీరు ఇద్దరు జనగామలో ఉన్న పైకాజీ రామచంద్రరావు వకీలుని కలిస్తే బాగుంటుంది" అన్నాడు కుర్దు.

కొమురం భీమ్ మహదు దగ్గరకెళ్లాడు. అతన్ని వెంటబెట్టుకున్నాడు. నేరుగా జనగామ చేరాడు. అక్కడ వకీలు రామచంద్రరావు పైకాజీని కలిశాడు. భీము తన తాతల కాలం నుండీ భూమిని నమ్మి బతుకుతున్నామని చెప్పాడు. ఇప్పుడు బాధలెక్కువయ్యాయనీ, అక్కడ ఏ హక్కు లేకుండా వెళ్లగొడుతున్నారనీ అన్నాడు. ఇది అన్యాయం కాదా? అసలు మా హక్కును ఎవ్వరు ఎందుకు గుంజుకోవాలి? అన్ని ప్రశ్నించాడు.

అందుకు పైకాజీ భీమ్‌కి అర్థమయ్యేలా...

"భీమ్ నువ్వన్నది నిజమే. అవి మీ భూములే. మీరే రాజులు. కానీ ఎప్పుడు? 1918కి పూర్వం. అప్పుడు సర్కారు అడవి మీద తన హక్కు ఉందని అనలేదు. 1918లో తాసీలు ఆఫీసు ఉట్నూరుకి వచ్చింది. అది తెలిసి ఎక్కడెక్కడి నుండో రావులు, బ్రహ్మలు, తురకలు కొండల్లోకి వచ్చారు. సర్కారుతో ఏదో విధంగా సంబంధం పెట్టుకున్నారు. దాంతో పట్టాలు వాళ్లకు వచ్చాయి. మీకు భూమి మీద హక్కు పోయింది. ఇప్పుడు చట్టం వాళ్లను కాపాడుతోంది" చెప్పాడు.

భీమ్‌కి కోపమొచ్చింది. 'ఈ చట్టాలు ఎవరు పెట్టారు? ఎందుకు ఆ దొంగలకు పట్టా ఇచ్చారు? ఎవరితో మాట్లాడి మా భూములు వాళ్ల పేర రాశారూ?' అని అడిగాడు.

'ఇన్నేండ్లుగా ఈ ప్రశ్నలు అడిగిన వాడు లేడు. ఇప్పుడు నిన్ను ఒకన్ని చూశాను భీమ్. ఈ రాజ్యం ఇప్పుడు నైజాం రాజుది. రాజుకు ఏది తోస్తే అదే చేస్తాడు. ఆయన ఇష్టం."

"అట్లాంటి రాజు ఎందుకుండాలి? ఈ మాత్రం న్యాయం చూడని రాజెందుకూ?"

"నిజం చెప్పాలంటే రాజులకు ప్రజల న్యాయంతో పనేముంది భీమ్. వాళ్లకు డబ్బు కావాలి. అది ఎట్లాగో తెచ్చి పెట్టేవాళ్లు పోలీసులు, పెత్తందార్లు, ఈ ఆఫీసులు, ఆ చట్టాలు... ఇక ప్రజలు ఎట్లా చస్తేనేం?" అని ఇదంతా ఇప్పుడు ఎందుకులే! ముందు మీ వాళ్ల మీద ఉన్న కేసుల సంగతి చూడండి" అన్నాడు పైకాజీ.

"అయితే పైకాజీ గారూ! మా చావుకోరే సర్కారు మాది ఎట్లా అవుతుందండీ? మా నెత్తురు పిండేవాళ్లు మాకు శత్రువులు కారా?"

"చూడు కొమురం భీమ్! ప్రతి మాటా నా నోటితో చెప్పించకు. వెళ్లి మీ బాధలన్నీ ఒకసారి నైజాం నవాబుకు చెప్పి చూడండి. ఏమైనా మేలు జరుగుతుందేమో! అలా చేయలేకపోతే! నైజాం సర్కారుతో సవాలు చేయండి. మీ చట్టాలనూ, అదాలత్‌లనూ, మీ లంచగొండి అధికారులనూ మేం ఒప్పుకోం అనండి. అట్లా అంటే ఇక ఎదురు తిరిగి లడాయికి సిద్ధం కావాలి. నీ మాటతీరు నాకు అట్లానే తోస్తోంది. కానీ, మీరు నైజాంతో కొట్లాడి భూముల్ని సాధించగలరా? నాకు మాత్రం నమ్మకం లేదు. ఇక మీ ఇష్టం" అన్నాడు పైకాజీ రామచంద్రరావు వకీలు.

భీమ్ ముఖం ఎర్రనయ్యింది. గోండులను పైకాజీ తక్కువ అంచనా వేస్తున్నాడనుకున్నాడు. భీమ్‌కి రాంజీ గోండు జ్ఞాపకమొచ్చాడు. అతను ఇంకా అక్కడ

ఉండలేదు. ఎన్ని కేసులుంటే ఏం చేస్తారో చూద్దాం అనుకున్నాడు. పైకాజీకి 'రాం రాం' చెపుతూ... 'అవసరముంటే వస్తాం. మీరు సహాయం చేయాలి" అంటూ మహద్‌తో కలసి గూడెం దిక్కు నడిచాడు.

* * *

ఉన్న పరిస్థితి పూర్తిగా అర్థం చేసుకున్నాడు భీమ్. వెంటనే పన్నెండు గ్రామాల ప్రజల్ని సమావేశ పరచాలనుకున్నాడు. హవల్దారు (గ్రామ వార్తాహరుడ) కొమురం సూరుని పిలుచుకు రమ్మని రఘును పంపించాడు. అప్పటికే కుర్దు, యేసు, మహదులను సమావేశపరిచాడు. సూరు రాగానే పన్నెండు గూడాల ప్రజల ఏకమై పట్నాపూర్ రావాలసిందిగా వార్త పంపించాడు. తుడుం మోగింది.

ప్రజలందరూ భీమ్ పిలుపుతో వచ్చారు. వచ్చి ఓ పెద్ద చెట్టు కింద కూర్చున్నారు. అప్పుడు భీమ్ లేచి నిలబడి...

"రైతులారా! మీ అందరి పక్షాన నిలబడి మాట్లాడడానికి నేను ఇక్కడికొచ్చాను. మీ కష్టాలు నాకు తెలుసు. భూమి కోసం మనం జంగల్ నరికితే సర్కారు, పట్టేదార్లు తప్పు అంటున్నారు. ఐనా మనకు వేరే బతుకుదెరువు లేక వాళ్లు కేసులు పెట్టినా ఊరుకున్నాం. కొట్టినా, గుడిసెలు తగులపెట్టినా, మన చేతులు నరికినా అడివిలో మన భూమి మనం సాగుచేస్తున్నాం. మనందరం ఒకటేనని మా చిన్నాయనలు ఈ పన్నెండు గ్రామాలు పొందించారు. మన బలం గొప్పది. ఐతే సర్కారు వాళ్లు మన మీద కేసులు పెట్టారు. వకీలు కోర్టుకు రమ్మని అంటున్నాడు. మనం గంజి తాగి బతకడం ఏమోగానీ, ఈ కోర్టు కేసులతోనే చావుకు దగ్గరౌతాం. మన సమస్యలకు పరిష్కారం కోర్టు చెప్పదు. వినండి వర్షాకాలం రాబోతుంది. అన్ని గూడాల్లో భూములు దున్నడం సాగిద్దాం. వాళ్లు మరిన్ని కేసులు పెడతారు. చివరికి మనకు ఇష్టమున్నా లేకున్నా వాళ్లే యుద్ధానికి దిగుతారు. ఎప్పుడో ఒకసారి వీళ్ల పీడ మనకు తొలగిపోవాలి. మనం మన పంటలను అడివి జంతువుల బారినుండి రక్షించుకుంటాం' అట్లే వీళ్లతో యుద్ధం చేసి మన హక్కులు సాధించుకుందాం. ఇట్లా మన భూములను దక్కించుకుందాం! మీ అందరికీ ఇష్టమేనా?" అడిగాడు భీమ్.

"లడాయి తప్పక చేయాలి. ఆకలితో చచ్చేకన్నా పోరాటం చేసి చద్దాం" అన్నారు కొందరు యువకులు.

అందరూ 'సరే' అంటే 'సరే' అన్నారు. తుపాకులు కావాలని ఒకరంటే, తూటాలు ఎలాగని మరొకరు అన్నారు. యుద్ధానికి సిద్ధమైతే, అన్నీ వస్తాయి అని రఘు గొంతెత్తి



చెప్పాడు. 'బిడ్డ పుట్టినంక కదా కుల్ల కుట్టడం ముందు అడివి నరకండి' అని జంగు గట్టిగా అన్నాడు. భీమ్ ఎంతో గొప్పవాడు కానిదే దేశాలు తిరిగొచ్చాడా? లచ్చు పటేల్ భూమి ఇప్పించాడా? పైకాజీతో మాట్లాడి నీల్లు మింగించాడా? అతను తలుచుకుంటే ఏదైనా సాధించగలడు అనుకున్నారు జనమంతా.

* * *

ఆ సంవత్సరం అడివి నరికి రైతులు పంటలు పండించారు. జంగ్లాత్ వాళ్లు ఎందుచేతనో రాలేదు. భీమ్‌కు భయపడే రాలేదని కొందరంటే, ఇక వాళ్ల పీడ ఉండదని మరికొందరనుకున్నారు. భీమ్ మాత్రం ఏదో అనుమాన పడుతున్నాడు. కొందరి మీద కేసులు నడుస్తూనే ఉన్నాయి.

తర్వాత కొన్ని నెలలకు జంగ్లాత్ వాళ్ళు బాబేఝరీ వైపు విరుచుకపడ్డారు. అందులో అమీన్‌సాబ్, చౌకీదార్, సేరెదార్, గిర్ధావర్ ఇంకా పట్వారి సీతారామారావు ఉన్నారు. కొందరు గుర్రాల మీద వస్తే, కొందరు బండ్ల మీద వచ్చారు. టొయికన్‌లో ఆగి చూస్తే కుర్దు మొదలైన వాళ్లు వచ్చి వాళ్లకు 'రాం రాం' చెప్పారు.

"మళ్లీ జంగల్ నరికినారట మేము పంచనామాకు వచ్చాం" అంటూ తన బలగంతో "నడవండి జంగల్ నరికిన చోటికి" అన్నాడు అమీన్ "పంచనామా చేయండి మరిన్ని కేసుల పెట్టండి అంతకు మించి మరేం చేయగలరూ?" అని అడిగాడు భీమ్.

వద్దంటే అడవి నరుకుతున్నారని కోపంతో ఉన్నాడు అమీన్. బూతులు తిట్టడం ప్రారంభించాడు.

"ఇది మా అడవి మా ఇష్టం మేము చేసుకుంటాం. మీరు మమ్మల్ని దోచుకుపోకుంటే చాలు. లంచాల కింద మేకలు, గొర్లు, కోళ్లు ఇక ఇచ్చేది లేదు. చాటు మాటుగా మా సంపద ఎత్తుకు పోకండి. మీరు దొంగలు కాకండి. మమ్మల్ని దొంగలను చేయకండి" అన్నాడు భీమ్.

అప్పటికే కోపంగా ఉంది. ఇక్కడ చూస్తే తామంటే భయమే లేకుండా వీడు భీమ్ మాట్లాడుతున్నాడు. ఇక అమీన్‌కి మంట పుట్టింది. "మమ్మల్ని దొంగలంటావా! గోండునా కొడకా!" అంటూ భీమ్‌ని ఒక్కటి వేశాడు.

భీమ్‌ని అమీన్ కొట్టగానే అతనితో వచ్చిన వాళ్లంతా గోండుల్ని కర్రలతో కొట్టసాగారు. అంతే రఘు తుడుం మోగించాడు. చూస్తుండగానే గోండులు, కొలామ్‌లు అందరూ పరిగెత్తుకొచ్చారు. జంగ్లాత్ వాళ్లను ఎదురుకొన్నారు. ఆ ప్రదేశమంతా



యుద్ధరంగంలా మారింది. గోండులు గట్టిగా బదులు చెపుతున్నారు. ఇక పరిస్థితి చేయి దాటేలా ఉందని ఒక జాగీర్‌దార్ తుపాకీ పేల్చాడు. అది భీమ్‌ని గాయపర్చింది. తుపాకీ గుండు భీమ్ భుజం నుండి దూసుకుపోయింది. భీమ్ రక్తం నేలను తడిపేస్తోంది. గోండులు ఇంకా విజృంభించారు. వచ్చిన వాళ్లందర్నీ విపరీతంగా కొట్టేశారు. ఆ దెబ్బలకు తట్టుకోలేక ఆమీన్‌తో సహా అందరూ జనగామ దిక్కు పరుగుతీశారు.

కొన్ని రోజుల తర్వాత అంగడికి వెళ్లారు కుర్దు, అతని కొడుకులు. వాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. అప్పుడు భీమ్ దేవడం లచ్చు పటేల్‌కు ఉత్తరం రాశాడు. అతను వాళ్లను జామీన్ మీద విడుదల చేయించాడు.

జంగ్లాత్ అమీన్‌సాబ్, గిర్దావర్ ఇంకా ఆలస్యం చేయక తాసీల్‌దార్ అబ్దుల్‌సత్తార్‌తో కలిసారు. అప్పుడు అమీన్‌సాబ్ బాబేఝరీ సంగతి అంతా వివరంగా చెప్పాడు. 'తిండికి కూడా కటకటలాడే గోండులు ఈ రోజు సర్కారుకే సవాలయ్యారని చెప్పాడు. ఇంకా సర్కారు ఓపిక పడితే చాలా ప్రమాదముందనీ తెలియజేశాడు. అబ్దుల్ సత్తార్ వెంటనే డి.ఎస్.పి.తో మాట్లాడి గోండులను అరెస్టు చేయాలన్నాడు. అంతేగాదు ఇక్కడ కొండల్లో ఏం జరుగుతుందో వివరంగా హైద్రాబాద్ హోం సెక్రటరీకి తెలిపాడు.

డి.ఎస్.పి. బాబేఝరీలో జంగ్లాత్ వాళ్ల మీద దౌర్జన్యం చేశారనీ, అడివి నరికారనీ కేసులు పెట్టాడు. అందులో కొమురం భీమ్ మొదటి ముద్దాయిగా మహదు, రఘు, జంగు, కుర్దు, యేసు, సుద్దుల పేర్లు ఉన్నాయి. వీళ్లను అరెస్టు చేయాలంటే చాలా పెద్ద బలగంతో వెళ్లాలి. ఎలా అని ఆలోచిస్తున్నాడు డి.ఎస్.పి.

ఒకనాడు కుర్దు మానసికంగా బాధపడుతూ కూర్చున్నాడు. అది గమనించిన భీమ్ "ఏమి చిన్నాయినా! అట్లున్నవేందీ?" అని అడిగాడు.

కుర్దు "జీవితమంతా కొట్లాటలతోనే సరిపోయిందిరా భీమ్. రోజు రోజుకూ మన మీద కేసులు పడుతూనే ఉన్నాయి. ఈ జంగ్లాత్ వాళ్ల సంగతి సర్కారుకు తెలుసో, తెలియదో? సర్కారు మంచిదే కావొచ్చు. ఒకసారి మీరు వెళ్లి నైజాం నవాబుతో మాట్లాడి వస్తే బాగుండు. మన బాధలు విని కనికరిస్తాడేమో!" అన్నాడు.

ఈ మాటలు విన్న పైకూబాయి తనలో తాను నవ్వుకుంది. భీమ్ ఎటూ మాట్లాడలేకపోయాడు.

"పెద్ద మనిషి మాట ఎందుకు కాదనాలి? వెళ్లి ఆ పని చూసుకొని రండి,



తెలుస్తుంది గదా!" అంది పైకూబాయి.

'సరే'నని భీమ్ హైద్రాబాద్ బయలుదేరాడు. తన వెంట మహదు, రఘు ఉన్నారు. అడివిలో బతికే మా బాధలూ ఇవ్వి, మాకు మీరే దిక్కు సహకరించండి అనే సారాంశంతో లేఖ రాశారు. మహదుతో వివరాలన్నీ చెప్పాడు భీమ్. ఇంకా అందులో లంచాల తీరు, జాగీర్దార్ల దోపిడీ, కేసుల సంగతీ ఉంది.

కొమురం భీమ్ హైద్రాబాద్ వెళ్లాడు. ఉదయం నుండి సాయంకాలం వరకు పడిగాపులు కాశాడు. తను చాలా దూరం నుండి వచ్చాననీ అక్కడి అధికారులకు చెప్పాడు. మహదు నైజాం దర్శనం కోసం అధికారులను బతిమాలాడు. మళ్లీ మళ్లీ కనిపించి అడిగి చూశారు. కానీ, నైజాం దర్శనం కాలేదు. వీళ్లను ఎవరూ పలకరించలేదు. వీళ్లను మనుషుల కిందే లెక్కించలేదు. ఇక లాభం లేదని వెనక్కి తిరిగారు భీమ్ వాళ్లు.

హైద్రాబాద్ వెళ్లిన కొమురం భీమ్ తిరిగొచ్చే వరకు గూడాల మీద పోలీసులు మరోసారి దాడి చేశారు. జోడెన్‌ఘాట్‌లో ఉండే గ్రామ పెద్ద కుర్దూ పటేల్ (కొమురం కుర్దుకాదు) వాళ్లకు సహకరించాడు. ఊర్లన్నీ కకా వికలమయ్యాయి. దొరికిన వాళ్లనందరినీ విపరీతంగా కొట్టారు. కొమురం కుర్దూకి, యేసు, సూరు, మాదులకి బాగా దెబ్బలు తాకాయి. అరెస్టు చేశారు. ఈ విషయం హైద్రాబాద్ నుండి రాగానే తెలిసింది భీమ్‌కి. వెంటనే జోడెన్‌ఘాట్ వెళ్లాడు. మళ్లీ సమావేశం ఏర్పాటు చేశాడు. అందులో...

"మేము హైద్రాబాద్ వెళ్లి వచ్చేసరికి జంగ్లాత్ వాళ్లు ఎంత ఘాతుకం చేశారో చూశారా? మన గూడాల మీద మళ్లీ విషం కురిపించారు. అక్కడ నైజాం నవాబును చూస్తే పోలీసుల్ని తన చుట్టూ కాపలా పెట్టుకొని కులుకుతున్నాడు. విందులారగిస్తున్నాడు. ఇక్కడ మనల్ని చంపిస్తున్నాడు. అతని వజీర్లు దొంగలు, అధికార్లు దొంగలు; మనం మోసపోయాం అధికార్లతో తన్నులు తిన్నాం. తింటున్నాం.

రైతులారా! బాగా ఆలోచించండి. వాళ్లు మనను బతకనివ్వటం లేదు. కానీ, మనం బతకాలి. ఈ గాలీ, నీరూ, ఆకాశం, అడవీ, భూమీ మనవి. మనకే చెందాలి. మన రక్తం రుచి మరిగిన ఈ సర్కారు తోడేలు మనను బతకనీయదు. మన భూమి మనదంటే వదిలిపెట్టదు. ఈ సర్కారు ఇంకా రెట్టింపు పోలీసులతో వచ్చి మళ్లీ మన గూడాలను కాలపెడుతుంది. చెప్పండి ఆ మంటల్లో పడి చనిపోదామా? ఏం చేద్దాం?" అని సూటిగా అడిగాడు.



"ఎదురు తిరిగి వాళ్ల అంతు చూద్దాం" అన్నారు ఒకరు.

"మనమే కాదు. ఈ పన్నెండు గ్రామాల ప్రజలే కాదు. జాతులన్నీ ఒక్కటి కావాలి. భూములు దున్నే వాళ్లంతా ఏకం కావాలి. మనకు భూమి కావాలంటే యుద్ధం చేయాలి. మన భూముల్లో జంగ్లాత్ వాళ్లు, పోలీసులు, పట్టేదార్లు రావొద్దు. వాళ్లు రావొద్దంటే తగిన గుణపాఠం చెప్పాలి."

"భూమి లేక చచ్చేకంటే కొట్లాడి సద్దాం భీమ్... దాదా" అన్నాయి వందల కంఠాలు.

మనం యుద్ధం చేసి తీరుతాం. రాంజీ గోండులాగా చేసి ఇప్పుడు మనం గెలిచే తీరుతాం. ఈ జోడెన్ ఘాట్‌ని మనమంతా కలిసి మళ్లీ నిర్మించుకుందాం. ముందు వాళ్లు అరెస్టు చేసిన మన వాళ్లను విడిపించుకొచ్చుకుందాం. వకీలుతో మట్లాడి మహదు ఆ పని పూర్తి చేసుకొస్తాడు" అని భీమ్ చెప్పాడు.

అక్కడ పన్నెండు గూడాల పెద్దలున్నారు. ప్రజలున్నారు. అందరితో చర్చించి కార్యక్రమం రూపొందించాడు భీమ్. "ముందు జోడెన్‌ఘాట్ నుండి పోలీసులు పట్టుకుపోయిన వాళ్లను విడిపించాలి. అన్ని గ్రామాలకు ఈ జోడెన్‌ఘాట్ కేంద్రంగా ఉంటుంది. తిండి ఖర్చులు, ఆయుధాల ఖర్చులు అన్ని గూడాలు భరించాలి. తుడుం అన్ని గూడాలకీ సంకేతంగా ఉపయోగించాలి. ప్రతి గ్రామంలో బడితెపూజ నిర్వహించాలి. (అంటే ప్రతివాడూ తన ఎత్తు కర్రకు పూజ చేసి ఎప్పుడూ దగ్గరుంచుకోవాలి.) గొడ్డళ్లు, ఈటెలు, బాణాలు, వొడిశెలలు, తుపాకులు తయారు చేయాలి. జోడెన్‌ఘాట్‌లో మన సైన్యం ఉంటుంది. గ్రామాల్లో రక్షక దళాలు ఉంటాయి. ప్రతి గ్రామానికీ వార్తలు తెచ్చే వ్యక్తి ఒకడు ఉండాలి. ఇక ఏ కేసులు పెట్టినా 'మేం కోర్టులకు రా'మని సర్కారుకి వార్త పంపించాలి. అడివి భూములన్నీ గోండులవీ, కొలామ్‌లవి అని చెప్పాలి. భూములను సర్కారు పూర్తిగా మాకు ధారాదత్తం చేసే వరకు పోరాటం సాగుతూనే ఉంటుందని ప్రకటించాలి. మనమంతా రహస్యంగా పనిచేయాలి. గోండు రాజ్యస్థాపనే మన ముఖ్య లక్షణం. మన జెండా రగల్ జెండా.

ఈ విషయాలన్నీ ముఖ్యులమైన మన పన్నెండు మందిలోనే ఉండాలి అని పన్నెండు గ్రామాల ప్రతి నిధులు నిర్ణయించుకున్నారు. మహదు జనగామ వెళ్లాడు.

మహదు పైకాజీతో కలిసి మాట్లాడాడు. పైకాజీ వెళ్లి చాలా సేపు తాసీల్‌దార్‌తో మాట్లాడాడు. తాసిల్దార్ హైద్రాబాద్‌లో ఉన్న డైరెకర్ జనరల్ ఆఫ్ రెవెన్యూ గారికి లేఖ రాశాడు. అందులో ముద్దాయిల మీద దయ చూపితే సర్కారు ప్రతిష్ట పెరుగుతుంది.

వాళ్లు కొమురం భీమ్ తప్పుడు మాటలు విని మోసపోయారు. మీరు కనికరించాలి" అని ఉంది. ఎలాగైతేనేం అరెస్టు గావించబడిన వాళ్లు విడుదలయ్యారు. వాళ్లూ జోడెన్‌ఘాట్ చేరారు.

నెల రోజులు గడిచాయి. బాబేఝరీ ప్రాంతంలో ఉన్న ఏ ఒక్క వ్యక్తీ కేసులకు హాజరు కావడం లేదు. అందుకు సర్కారు ఆజ్ఞతో అమీన్‌సాబ్ కొందరు పోలీసుల్ని వెంట పెట్టుకొని బయలుదేరాడు. వాళ్ల గుర్రాలు కష్టంగా జోడెన్‌ఘాట్ కొండ ఎక్కాయి. భీమ్‌ని కలిసి కోర్టుకి రమ్మని సమన్లు ఇచ్చాడు.

"ఇంకా కేసు లెందుకు? ఇక్కడున్న పన్నెండు గ్రామాలు మా సొంతం. ఇది గోండు రాజ్యం. ఈ సంగతి మీ సర్కారుకు తెలియదేమో! ఇక్కడికి జంగ్లాత్ వాళ్లు వస్తే మళ్లీ ప్రాణాలతో వెళ్లలేరు. ఈ రాజ్యం మాది. మీకు ఎలాంటి అధికారం ఇక్కడ లేదు. మేం తప్పు చేయడం లేదు. ఎవరి సొమ్మూ తినడం లేదు. ఎవరికీ అన్యాయం చేయడం లేదు. ఈ రాజ్యం మా అందరి నిర్ణయం. మీరు వెళ్లి మీకు దిక్కున్న చోట చెప్పుకోండి" అన్నాడు కొమురం భీమ్. పైకూబాయి, మిగతా ఆడవాళ్లు కూడా చప్పట్లు కొట్టారు. దాంతో అక్కడున్న వాళ్లంతా చప్పట్లు కొట్టారు.

అమీన్ వెళ్లదలుచుకోలేదు. వీళ్లను ఎలాగైనా కోర్టుకి తీసుకెళ్లాలని మొండికేశాడు. ఇక తప్పదనుకున్నాడు. తుపాకి తీసి గాలిలో కాల్పులు జరిపాడు. హెచ్చరించాడు. గోండులు నవ్వుకున్నారు. అతన్నీ, అతనితో వచ్చిన వాళ్లనూ దేహశుద్ధి చేశారు. తుపాకి లాక్కున్నారు. వెనక్కి పంపించారు. జోడెన్‌ఘాట్‌లో కుర్దు పటేల్ అనేవాడు ఇంతవరకూ అమీన్‌కి సహాయం చేశాడు. మళ్లీ ఇలాంటి పిచ్చిపనులు చేయొద్దని అతనికి బుద్ధి చెప్పారు.

యుద్ధ కేంద్రంగా జోడెన్‌ఘాట్‌లో కొలిమి రాజింది. ఈటెలు, బాణాలు, బరిశెలు, గొడ్డళ్లు, తుపాకుల గొట్టాలు తయారౌతున్నాయి. ఏ ఆయుధం ఎలా ఉపయోగించాలో తెలిసిన వాళ్లు తెలియని యువకులకూ, పిల్లలకూ చూపుతున్నారు. శిక్షణ ప్రారంభమైంది. స్త్రీలూ సహాయం చేస్తున్నారు. పైకూబాయి అందరిలో ముందు నిలిచింది.

కొన్ని గ్రామాలు కొత్త రూపుదిద్దుకున్నాయి. కొమురం భీమ్ నాయకత్వమని విన్నారు ఇతర గ్రామస్థులు. వాళ్లూ ఈ పన్నెండు గ్రామాలతో కలిసేందుకు ఇష్టపడ్డారు. అందులో కల్లెగాంపాడ్, ధనోరా ముఖ్యమైనవి. అంతేగాక పల్లపు ప్రాంతవాసులు కొందరు వచ్చారు. వాళ్లు గోండు రాజ్య స్థాపనకు జేజేలు పలికారు. నైజాం రాజ్యానికీ,

జాగీర్దారుల అరాచకత్వానికి వ్యతిరేకులైన కొందరు త్యాగనిరతితో వచ్చారు. వాళ్లు తుపాకులు, బార్మాకులు తయారు చేసే పద్ధతి నేర్పించారు.

ఇదే సమయంలో గ్రామ గ్రామాల ప్రజలకు తనదిగా సందేశం పంపించాడు కొమురం భీమ్. కొమురం సూరు భీమ్ సందేశం వినిపించాడు.

"మన భూములు మనకు దక్కాలంటే దోపిడీ దారుల దోపిడీ నశించాలి. అడివి మీద మనకు అధికారం రావాలి. అధికారం దానంతట అదే రాదు. అందుకు మనం యుద్ధం చేయాలి. సర్కారును ఓడించాలి. ప్రజలు తలుచుకుంటే సాధించలేనిది లేదు. అందుకే సైన్యంలో చేరండి. రగల్ జెండాకి జై అనండి. మిమ్మల్ని మీరు విముక్తులను చేసుకోండి. మన రాజ్యం కోసం మనం యుద్ధం చేద్దాం. యుద్ధంలో చావు బతుకులుంటాయి. మనం చస్తున్నామంటే బతకడానికే. ఇప్పుడు మనం మనం మంచి కోసం త్యాగం చేస్తాం. ఆ త్యాగం రేపు మన పిల్లలకు సుఖాన్నిస్తోంది. వాళ్లన్నా బాగుంటారు. ఎలాగూ ఆకలితో చచ్చే రోజులు వచ్చాయి. అదే పోరాటంలో చస్తే మనకు రాజ్యమొస్తుంది. దున్నేవాడికి భూమి దక్కాలంటే యుద్ధం చేయకతప్పదు. ఓ తల్లులారా! మీ బిడ్డలమైన మేము ఇంత కష్టమైన కార్యభారం మోస్తున్నాం. మీరు మమ్ములను మనసారా దీవించండి."

ఇలా ఉంది కొమురం భీమ్ సందేశం.

ఒకనాడు ఉదయం జోడెన్‌ఘాట్ కొండ మీద తుడెం మోగింది. పోరాట శుభ సమయం. ప్రతీ గ్రామం నుండి కొమురం భీమ్‌కి జేజేలు. రగల్ జెండాకి జేజేలు అందుతున్నాయి. భీమ్ సభ ఏర్పాటు చేసి మాట్లాడాడు. అందరూ ఉత్సాహంగా ఉన్నారు. కొందరు డోళ్లు, కొందరు డప్పులు వాయించారు. పరదాన్లు భజంత్రీలు వాయించారు. చెట్టు మీద రగల్‌జెనిడా ఎగరేశారు. స్త్రీలంతా వలయాకారంగా నిలిచి నృత్యం చేశారు.

ఆ సమయంలో కొమురం సూరు పరుగెత్తుకొచ్చి నైజాం సైనికులు వస్తున్నారని చెప్పాడు. వెంటనే భీమ్ బంధూకు పైకెత్తాడు. పోరాటం ప్రారంభించవలసిందిగా ప్రకటించాడు. కొమ్ములు ఊదారు. తుడుం మోగింది.

"నైజాం సైన్యంలో ఒక్కన్నీ జోడెన్‌ఘాట్ పటారు ఎక్కనీయవద్దు. గన్నుల్లో బార్మరు నింపండి. బాణాలు సంధించండి. ఈటెలు గురి చూసి విసరండి. ఆ సైనికులను మూడు దిక్కులుగా చుట్టి కత్తులతో నరికేయండి. ఈ భూమి మనది. ఈ అడివి మనది. శత్రువు అంతు చూడండి" అంటూ భీమ్ యోధులకు ఊపు

అందించాడు.

స్త్రీ పురుష భేదం లేకుండా యుద్ధరంగం కోలాహలంతో నిండి పోయింది. పైకూబాయి వీరవనితలా ముందుకు ఉరికింది.

రెండు వైపుల నుండి తుపాకుల శబ్దం. చావు కేకలు. ఏ ఒక్క నైజాం సైనికుడు కొండ ఎక్కే ప్రయత్నం చేయకున్నాడు. చేశాడా కూలిపోతున్నాడు. భీమ్ సైన్యం ఎడమా, కుడి అనకుండా ఎదుర్కొని నైజాం బలగాన్ని ఊపిరాడనీయలేదు. ఇక చేసేది లేక వాళ్ల కెప్టెన్ "బాగో బాగో" (పారిపోండి, పారిపోండి) అని ఉర్దూలో అరిచాడు. భీమ్ వైపు విజయసూచికగా తుడుం మోగింది.

* * *

కొమురం భీమ్ విజయవార్త అడివిలోని అన్ని గూడాలకూ పాకిపోయింది. గోండులంతా నృత్యాలు చేశారు. ఊరూరా చంద్రవంక ఎర్రజెండాలు ఎగరేశారు.

"నైజాం సైన్యాన్ని గడ్డి కరిపించాడు. ఒక మారుమూల గోండు యువకుడు కొమురం భీమ్." ఈ వార్త తెలిసిన తాసీల్దార్ కుతకుత ఉడికిపోయాడు. స్వయంగా వరంగల్ వెళ్లి సుబేదార్ అనే ఉన్నత అధికారితో మాట్లాడి వచ్చాడు. అట్లే జనగామ (ఆసిఫాబాద్)లో ఉన్న డి.ఎస్.పి.తో మాట్లాడాడు. "ఇది చాలా ముఖ్యమైన భూమి సమస్య. మనం గోండులతో కలిసి చర్చించి పరిష్కరించాలి" అన్నాడు.

ఏది ఏమైనా ఆ రోజే కొమురం భీమ్ యుద్ధం చేశాడనీ, సర్కారు సైనికుల్ని తరిమినాడనీ వార్త హైదరాబాద్ అందింది. హోం సెక్రటరీ, నైజాం నవాబుతో కూర్చున్నాడు. ఈ సమస్య ఎలా పరిష్కరించాలా అని దీర్ఘంగా ఆలోచించారు. ఎలాగైనా పెద్ద ఎత్తున సైన్యాన్ని పంపించాలి. గోండులను అణచివేయాలి. సర్కార్ మీర్ ఉస్మాన్ ఆలీ పాషాతో ఇంగ్లీషు అధికారి ముచ్చటించాడు. అతను...

"గోండుల పోరాటాన్ని మొక్కలోనే తుంచి వేయాలి. మీకు ఒక దిక్కు హిందువులు, మరో దిక్కు కమ్యూనిస్టులు బలపడుతున్నారు. ఇంకా గిరిజన పోరాటాలా? ఈ పోరాటం వెంటనే వీరు అణచకపోతే ఇక మీ కుర్చీకే హాని ఉంది. అల్లూరి సీతారామరాజుని చంపడానికి మేం ముప్పుతిప్పలు పడ్డాం. మీరింకా ఆలస్యం చేయవద్దు. కొండ వాళ్లనందరినీ చంపేయండి" అని హితవు చెప్పాడు.

నైజాం రాజు తన ఎత్తుగడలలో భాగంగా ముందు కొండల కింద ఉన్న ప్రజల మీద దాడి చేయించాడు. పోలీసులు, ముస్లిం జాగీర్దార్‌లు, జంగ్లాత్ వాళ్లు బాబేఝరీ చుట్టు పట్ల గ్రామాలను అల్లకల్లోలం చేశారు. దోచుకున్నారు. తగుల

పెట్టారు. కొట్టడం, చంపడం మొదలు పెట్టారు. ఆ బాధలు పడలేక జనం వెళ్లి నేరుగా కొమురం భీమ్ సైన్యంలో చేరసాగారు.

నాలుగు నెలలు గడిచాయి. కొండల మీద భీమ్ సైనికులకు తిండికి కరువొచ్చింది. చుట్టుపట్ల గ్రామాల్లో జనం నైజాం చేయించిన దాడితో భయపడ్డారు. ప్రజల నుండి సహాయం అందకుంది. అయినా రహస్య దళాలు చుట్టూ ఉన్న గ్రామాలకు వెళ్లాయి. పాటలు పాడి, పోరాట పటిమ వినిపించి ధాన్యం తెచ్చాయి. కొమురం భీమ్ సందేశం గ్రామాల్లో మారుమోగింది.

మరోసారి నైజాం సర్కారుకు ఉత్తరం రాయడం మంచిదని ముఖ్యుల సమక్షంలో తీర్మానమైంది. భీమ్ మహదుతో రాయించాడు. అందులో "....పన్నెండు గ్రామాలకు గోండు రాజ్య అధికారమిస్తే నైజాంకు విధేయులమై ఉంటాం" అన్నదే సారాంశం. ఆ లేఖ తాసీల్దార్ అబ్దుల్ సత్తార్‌కి అందింది. కానీ, నైజాం నుండి ఏమీ జవాబు రాలేదు. నైజాం మనుషులు చుట్టూ ఉన్న గ్రామాల్లో పంట చేలు పాడుచేస్తున్నారు. ఆడవాళ్లను హింసిస్తున్నారు. గుడిసెలు తగలపెడతూనే ఉన్నారు.

జోడెన్‌ఘాట్‌లో భీమ్ యుద్ధంలో పాటించవలసిన ఉపాయాల గూర్చి చెపుతున్నాడు. రాయి, రప్పా, తాడూ, కర్ర, కందకం అన్నీ శత్రువులను ఎదుర్కోవడంలో ఉపయోగపడతాయని చెపుతున్నాడు. పొదల మాటున, చెట్ల మాటున ఉండి ఒక్కసారే ఎట్లా మీద పడాలో, శత్రువును ఎలా వేరు చేసి అంతు చూడాలో చూపిస్తున్నాడు. ఆ ఉదయమే రఘు ఒక మనిషిని తీసుకు వచ్చి కొమురం భీమ్ ముందు ఉంచాడు అతను...

"నేను నైజాం సర్కారు సబ్ కలెక్టర్ దగ్గర నుండి వచ్చాను. సబ్ కలెక్టర్ గారు మీతో మాట్లాడతారట. మీరు ఆజ్ఞ ఇస్తే వచ్చి మాట్లాడతారు" అన్నాడు.

"సరే! బంగ్లా దగ్గరకి పిలుచుకరండి" అన్నాడు భీమ్.

రఘు అతని వెంట కొద్ది దూరం వెళ్లి "కలెక్టరు గారు ఒక్కరే రావాలి. అతనితో మరెవ్వరూ రాకూడదు. వారు నిరాయుధులై ఉండాలి" అని హెచ్చరించాడు.

తర్వాత సబ్ కలెక్టర్ ఒకడే వచ్చాడు. అతన్ని బంగ్లా దగ్గర మంచం మీద కూర్చోపెట్టారు. అప్పుడు అతనికి, భీమ్‌కీ మధ్య ఈ సంభాషణ జరిగింది.

"కొమురం భీమ్ మీకూ, మీ చిన్నాయనకు ఎంత భూమి కావాలో అడగండి ఇస్తాం. పట్టాలు చేస్తాం. ఈ పోరాటం ఆపండి."

"ఈ యుద్ధం మా కొరకే కాదు. గోండులు, కోలామ్‌లు మొదలుకొని ఎన్నో

తెగల ప్రజల కోసం చేస్తున్నాం."

"ఐతే మీరు అడిగే పన్నెండు గూడాలకూ పట్టాలు ఇచ్చేస్తాం. భూములు మీ సొంతం అవుతాయి. యుద్ధం మానుకోండి."

"మాకు పన్నెండు గ్రామాల భూముల పట్టాలు కాదు కావలసింది. ఈ పన్నెండు గ్రామాల రాజ్య అధికారం కావాలి. గోండు రాజ్యం మేము స్థాపించుకుంటాం."

"అదెట్లా సాధ్యమౌతుంది?"

"ఎందుకు కాదూ! అసలు అడవి మీ సర్కారుదే ఎట్లా అయ్యింది? మీ సర్కారు ఆడే పన్నెండు గ్రామాల పట్టా నాటకం మాకు అక్కర్లేదు. మేము భిక్షం అడగడం లేదు. మా హక్కు నేరవేర్చుకుంటున్నాం. నిజం చెప్పాలంటే పన్నెండు గ్రామాలకే కాదు. ఉట్నూరు నుండి రాజోరా దాకా మా గోండు పరగణకే మేము పాలించే హక్కు కావాలి. వెళ్లి మీ సర్కారుతో ఈ విషయం చెప్పండి. మా మీదకు ఎక్కువ సైన్యాన్ని పంపించి మమ్మల్ని చంపే ప్రయత్నం చేయవచ్చు. కానీ, మాలో ఏ ఒక్క గోండు పిల్లవాడు బతికున్నా గోండు రాజ్యం కొరకే పోరాడి తీరుతాడు. మా రాజ్యం మేం గెలుచుకునే వరకూ మా యుద్ధం సాగుతూనే ఉంటుంది."

భీమ్ మాటలు విన్న సబ్‌కలెక్టర్ ముఖం వాడిపోయింది. ఒక గోండు యువకుడు నైజాం సర్కారును గడ్డి పరక కింద లెక్క కట్టడం చూసి ఆశ్చర్యమేసింది. అలా కొద్ది సేపు తలవంచుకొని కూర్చున్నాడు. తర్వాత లేచి వచ్చిన దారి పట్టాడు.

కొమురం భీమ్ యుద్ధం ప్రారంభించిన ఏడు నెలలు గడిచాయి. ఆహారం కొరత, అందరి ముఖాల్లో ఆకలి, క్రింద నుండి పదార్థాలు రావడం లేదు. ఏది ఏమైనా ఈ పోరాటం కొనసాగించాలనీ, ఇంకా విస్తరింప చేయాలనీ భీమ్ తపన. ఇంతలో "నైజాం సర్కారు పెద్ద ఎత్తున దాడికి సిద్ధమయ్యాడనీ, సైన్యం వచ్చేస్తుందనీ" వార్త తెలిసింది.

భీమ్ ఆజ్ఞాపించగానే తుడుం మోగింది. జనం అన్ని వైపుల నుండీ పరిగెత్తుకొచ్చారు. అందరి ముఖాల మీద మళ్లీ పోరాట పటిమ. ఉత్సాహం, విజయవాంఛ కనిపించింది. అది పేద రైతుల గుండెబలం. భీమ్ అందర్నీ ఒక్కసారి పరిశీలించి చూసి...

"చిన్నాయనలారా! బంధువులారా! సోదరులారా! మనం యుద్ధరంగంలో ఉన్నాం. యుద్ధం చేస్తున్నాం. యుద్ధంలో గెలిచేదీ మనమే. కానీ, ఒకవేళ ఓడిపోతే!? మనమెవరం మిగులకపోవచ్చు. మిగిలితే మనమెందుకు ఓడిపోయామో తెలిసుండాలి





కదా!? ఒక సత్యాన్ని మనం నిలపెట్టాలి. అదేమంటే... ఈ సర్కారు పాలనలో మనలాగా బాధపడేవాళ్లు ఎంతో మంది ఉన్నారు. వాళ్లనందరినీ మనం కలుపుకొని రాలేదు. క్రితం జరిగిన పోరాటాల చరిత్ర అదే చెపుతుంది. ఐనా మనం వెనక్కి అడుగేయం. ఈ మట్టి కోసం, ఈ భూమి కోసం, మన రాజ్యం కోసం పోరాడుదాం. మన పోరాటం వృధా కాదు. మనమేమైనా మన తర్వాత తరం గుణపాఠం తీసుకుంటుంది. ఇంతకన్నా ఉన్నతంగా యుద్ధం చేస్తుంది. గోండు సోదరులారా! కొమ్ములు ఊదండి. తుడుం మోగించండి. పటారు మీదకి సర్కారు సైన్యంలోని ఒక్కడు కూడా అడుగుపెట్ట వీల్లేదని మర్చిపోకండి. వీరోచితంగా పోరాడండి. జై రగల్ జెండా...” అంటూ ఉద్రేకంతో మాట్లాడి మిత్రులందరినీ ఆలింగనం చేసుకున్నాడు. తుడుం మోగుతూనే ఉంది.

ఆ రాత్రంతా యుద్ధ పద్ధతుల చర్చ జరిగింది. పోరాట మెళకువల గూర్చి ఎత్తుకు పై ఎత్తు కదలిక గూర్చి మాట్లాడారు. పన్నెండు గ్రామాల ప్రతినిధులు, యువకులు శత్రువుని చికాకు పరిచి చిత్తు చేసే పద్ధతులు గ్రహించారు.

ఇంకా తూర్పు తెల్లారలేదు. పది రోజుల తలమునకలైనా శత్రువుకు జోడెన్‌ఘాట్ మీదకి దారి దొరకలేదు. భీమ్ సైన్యంలోని దళాలు ఆయాదారుల్లో పెట్టని కోటగోడలై నిలుచున్నాయి. భీమ్ సైన్యాన్ని నైజాం సైన్యం ఇప్పట్లో జయించలేదు. చాలా కష్టం. కానీ, అదే గ్రామం పెద్ద కూర్దూ పటేల్ (కొమురం కుర్దూ కాదు) ద్రోహం చేసి సర్కారుతో చేతులు కలిపాడు. పటారు మీదకి అతి రహస్యంగా దారి చూపాడు. నైజాం సైన్యం దొంగతనంగా, యుద్ధనీతికి విరుద్ధంగా పైకి వచ్చేసింది. వస్తూనే పదకొండు మంది వీరుల్ని రాక్షసంగా కాల్చేశారు. ఆ చీకటి మాటున ఎందరినో చంపేశారు. గుడిసెలన్నీ కాల్చేశారు.

“అదిగో కొమురం భీమ్ అక్కడున్నాడు దొరా!” అని కుర్దూ పటేల్ భీమ్ వెనక నుండి చూపించాడు. ఇంటి గుట్టు బయటపెట్టాడు. అంతే భీమ్ మీద తూటాల వర్షం కురిసింది. భీమ్ నేలకొరిగాడు. ఆ రోజు సెప్టెంబర్ ఒకటి పంతొమ్మిది వందల నలభైయవ సంవత్సరం.

గోండు వీరుడు కొమురం భీమ్ సాహసం చరిత్రలో శాశ్వతంగా మిగిలి ఉంటుంది. నేల తల్లి విముక్తి కోసం, తన జాతి విముక్తి కోసం పోరాడి ప్రాణ త్యాగం చేసిన మహావీరుడు కొమురం భీమ్.

* * *



## KOMURAM BHEEM

*A Children's Novel on a Tribal Hero*

తలలో నాలుకై కంటి చూపుగై
నాటిని మొక్కై ఏటి గలగలై
అడవి పచ్చనై అగ్గి రూపమై
అందరి బతుకుల ఆశదీపమై
వీరుడు శూరుడు కొమరం భీముడు
అడవి బిడ్డలను ఐక్యం చేయగ
యుద్ధ నేర్పరికి జయన్‌కటో
త్యాగమూర్తికీ జయన్‌కటో...
కొమురంభీమ్‌కు జయన్‌కటో
గోండువీరునికి జయన్‌కటో

– భూపాల్

వెన్నెల ప్రచురణలు